RNI NO.TELTEL / 2013 /50370

తెలంగాణ స్వరాష్ట్ర సమరయోధ పత్రిక

Estd : 2002

# జనంసాక్షి

www.janamsakshi.org

మంగళవారం 26.08.2025 | సంపుటి :12 సంచిక : 38 | పేజీలు :12 వెల : రూ. 4/-

హైదరాబాద్ | Simultaneously Published from Hyderabad & Karimnagar | ఎడిటర్ : ఎం.ఎం. రహమాన్

ప్రకటనల కోసం సంప్రదించండి
98483 28698






## 20 ఏళ్ల తర్వాత ఉస్మానియాలో అడుగుపెట్టిన

# తొలి సీఎం రేవంత్

## పోరాటాల పురిటిగడ్డ ఉస్మానియా

### తెలంగాణ ఉద్యమంలో కీలకపాత్ర మన వర్సిటీది • ఈ విశ్వవిద్యాలయ అభివృద్ధికి రూ.వెయ్యి కోట్లు అందిస్తాం

"విద్యా ప్రమాణాలు పెంచుకోవాలంటే నేను చేయగల్గింది ఏంటో చెప్పండి. పేదరికం మాకు కొత్తదనం కాదు, చుట్టం కాదు. పేదరికం మా జీవన విధానంలో ఒక భాగం. విద్యార్థులు మీకు ఇబ్బంది కలిగించిన వారికి మీ నిరసన తెలపండి. మీ సమస్యల పరిష్కారం కోసం వచ్చిన వాళ్లను అడ్డుకుంటే అభివృద్ధి ఎలా జరుగుతుందో ఆలోచించుకోవాలి. ప్రపంచంలో పోటీపడేటట్లుగా ఒక ఆక్స్‌ఫర్డ్ యూనివర్సిటీ స్థాయిలో ఓయూను అభివృద్ధి చేసుకుందాం. మీకోసం రూ.1,000 కోట్లు ఖర్చు పెట్టడానికి ప్రభుత్వానికి ఏ అభ్యంతరం లేదు"
-సీఎం రేవంత్ రెడ్డి

## ప్రొ॥ కోదండరామ్‌ను మళ్లీ ఎమ్మెల్సీ చేస్తాం

**సుప్రీంకు వెళ్లి పదవిని రద్దు చేయించారు**

**బీఆర్ఎస్‌పై సీఎం రేవంత్ రెడ్డి ఆగ్రహం**

హైదరాబాద్,ఆగస్ట్25(జనంసాక్షి):ప్రొఫెసర్ కోదండరామ్‌ను మరో 15 రోజుల్లో మళ్లీ ఎమ్మెల్సీని చేసి శాసన మండలికి పంపిస్తానని సీఎం రేవంత్ రెడ్డి సంచలన ప్రకటన చేశారు. తమ ప్రభుత్వం ప్రొఫెసర్ కో దండరామ్‌ను ఎమ్మెల్సీగా చేసిందని గుర్తు చేశా రు. కానీ బీఆర్ఎస్ నేతలు.. సుప్రీంకోర్టు వరకు వెళ్లి ఆయన పదవిని తీయించేశారని విమర్శించారు. ప్రొ. కోదండరామ్ ఎమ్మెల్సీ పదవిని ఊడకొట్టేందుకు రూ. కోట్లు ఖర్చు చేశారంటూ బీఆర్ఎస్ నేతలపై నిప్పులు చెరిగారు.

మిగతా 2లో..

- విశ్వవిద్యాలయాన్ని స్టాన్‌ఫోర్డ్, ఆక్స్‌ఫర్డ్‌లా అభివృద్ధి చేస్తాం
- యూనివర్సిటీ అభివృద్ధి అధ్యయనానికి ఇంజనీర్స్ కమిటీ
- తెలంగాణ, ఉస్మానియా రెండూ అవిభక్త కవలలు
- మహామహులంతా ఇక్కడి నుంచి ఉద్భవించిన వారే
- తెలంగాణ పదానికి ప్రత్యామ్నాయం ఉస్మానియా
- ఓయూకు పూర్వవైభవం తీసుకొచ్చేలా ప్రతిపాదనలు చేయాలి
- యూనివర్సిటీలో వసతి గృహాలను ప్రారంభించిన ముఖ్యమంత్రి రేవంత్



ఉస్మానియా యూనివర్సిటీలో శిలాఫలకాలను ఆవిష్కరించడానికి వస్తున్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి

**హైదరాబాద్,ఆగస్ట్25(జనంసాక్షి):** తెలంగాణ పదానికి ప్రత్యామ్నాయం ఉస్మానియా యూనివర్సిటీ అని, తెలంగాణ, ఉస్మానియా రెండూ అవిభక్త కవలల్లాంటివని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. చదువుతోపాటు పోరాటాన్ని నేర్పించే గడ్డ ఉస్మానియా యూనివర్సిటీ అన్నారు.. రాజకీయ నాయకులు తమ ప్రయోజనాల కోసం చేతులెత్తేసినప్పుడు.. తెలంగాణ ఉద్యమాన్ని ముందుకు తీసుకెళ్లింది కూడా ఉస్మానియా యూనివర్సిటీ అన్నారు. ఉస్మానియా వర్సిటీలో రూ.90 కోట్లతో నిర్మించిన భవనాలను సీఎం రేవంత్‌రెడ్డి ప్రారంభించారు. దుందుభి, బీమా వసతి భవనాలను ప్రారంభించిన అనంతరం.. డిజిటల్ లైబ్రరీ, రీడింగ్ రూమ్‌లకు శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో మంత్రి అడ్లూరి లక్ష్మణ్, వేం నరేందర్‌రెడ్డి, కోదండరామ్, ఓయూ వీసీ కుమార్ తదితరులు పాల్గొన్నారు. సోమవారం ఉస్మానియా యూనివర్సిటీని సందర్శించిన సందర్భంగా సీఎం రేవంత్ మాట్లాడుతూ.. కొందరు వ్యక్తులు.. ఉస్మానియా యూనివర్సిటీని కాలగర్భంలో కలపాలని చూశారని మండిపడ్డారు. కానీ ఓయూకు పూర్వ వైభవం తీసుకురావాలని తాము నిర్ణయం తీసుకున్నామని వివరించారు. ఆ క్రమంలో 108 ఏళ్ల చరిత్ర కలిగిన వర్సిటీకి దళితుడిని వీసీ చేసి చూపించామన్నారు. దేశానికి యువ నాయకత్వం అవసరమని ఆయన స్పష్టం చేశారు. తెలంగాణ ఉద్యమానికి పురిటి గడ్డ ఉస్మానియా వర్సిటీనేనని గుర్తు చేశారు. యూనివర్సిటీలు సమస్యలపై చర్చలకే కాదు..సైద్ధాంతిక అంశాలకు వేదిక సైతం కావాలని ఆయన ఆకాంక్షించారు. సామాజిక, సాంకేతిక అంశాలపై చర్చలు జరపాల్సి ఉందని అభిప్రాయపడ్డారు. 1938 సాయుధ రైతాంగ పోరాటానికి ఊపిరిలూదిన

మిగతా 2లో..



# రేపటి నుంచి ట్రంప్ వడ్డింపులు షురూ



## 50% టారీఫ్‌లపై నేడు పీఎంఓలో కీలక భేటీ..!



**న్యూఢిల్లీ(జనంసాక్షి):**రష్యా చమురు కొనుగోలు చేస్తోందన్న కారణంతో అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ భారత్‌పై అదనపు సుంకాలు విధించిన సంగతి తెలిసిందే. ఆగస్టు 27 నుంచి 50శాతం టారిఫ్‌లు అమల్లోకి రానున్నాయి. దీనిపై నేడు ప్రధానమంత్రి కార్యాలయంలో అత్యున్నత స్థాయి సమావేశం జరగనుంది. టారిఫ్‌ల వల్ల భారత ఎగుమతులపై పడే ప్రభావం గురించి ఈ భేటీలో చర్చించనున్నట్లు తెలుస్తోంది. ప్రధాని మోదీకి ప్రధాన కార్యదర్శి ఈ సమావేశానికి నేతృత్వం వహించనున్నారు. గతంలో విధించిన 25 శాతం టారిఫ్‌లు ఆగస్టు 7 నుంచి అమల్లోకి రాగా.. అదనంగా విధించిన 25% సుంకాలు బుధవారం నుంచి అమల్లోకి రానున్నాయి. ఈ నేపథ్యంలో కేంద్రం అత్యున్నత స్థాయి భేటీకి సిద్ధమైంది. ఈ నేపథ్యంలో కేంద్రం అత్యున్నత స్థాయి భేటీకి సిద్ధమైంది. ఇప్పటికే వాణిజ్య, పరిశ్రమల మంత్రిత్వ శాఖ.. దేశీయ ఎగుమతిదారులు, ఎగుమతి సమాఖ్య మండలి సభ్యులతో చర్చలు జరుపుతోంది. టారిఫ్‌ల ప్రభావం తీవ్రంగా ఉండే కొన్ని రంగాలకు మద్దతిచ్చేలా విధాన పరమైన నిర్ణయాలు తీసుకోవాలని కేంద్రం భావిస్తోంది. మరోవైపు, సుంకాల ప్రభావాన్ని తట్టుకునేలా ఎమర్జెన్సీ క్రెడిట్ లైన్ గ్యారెంటీ స్కీమ్‌ను అందుబాటులోకి తేవాలని ఎగుమతిదారులు కోరుతున్నారు.

## భారత్‌పై సుంకాలు.. రష్యాపై ఒత్తిడి తెచ్చేందుకే

**ట్రంప్ ఆలోచన అదే: జేడీ వాన్స్**


**భారత్ అమెరికా రాయబారిగా అత్యంత వివాదాస్పదుడైన సెర్గియో గోర్ నియామకం**

**వాషింగ్టన్(జనంసాక్షి):**భారత్‌పై అమెరికా సుంకాల విధింపుపై ఉపాధ్యక్షుడు జెడి వాన్స్ కీలక వ్యాఖ్యలు చేశారు. రష్యాను అడ్డుకునేందుకే అమెరికా అధ్యక్షుడు ట్రంప్..భారత్‌పై ఒత్తిడి పెట్టినట్టు చెప్పుకొచ్చారు. ఇదే సమయంలో రష్యా-ఉక్రెయిన్ యుద్ధాన్ని ముగించడంలో అమెరికా మధ్యవర్తి పాత్ర

మిగతా 2లో..



# 'షా' వ్యాఖ్యలపై పెల్లుబుకిన ఆగ్రహం





**సుప్రీం తీర్పును ఎలా వక్రీకరిస్తారు?**

**మూకుమ్మడిగా ఖండించిన సుప్రీం, హైకోర్టు విశ్రాంత న్యాయమూర్తులు**

**న్యూఢిల్లీ(జనంసాక్షి):**సల్వాజుడుం రద్దు కేసులో సుప్రీం కోర్టు తీర్పును వక్రీకరించి మాట్లాడటం సరికాదని, కేంద్ర హోంమంత్రి అమిత్ షా సుప్రీం తీర్పును తప్పుగా అర్థం చేసుకుంటున్నారని సుప్రీంకోర్టు, హైకోర్టులకు చెందిన ప్రముఖ విశ్రాంత న్యాయమూర్తులు జస్టిస్ సంజీవ్ బెనర్జీ, జస్టిస్ అంజనా ప్రకాష్, జస్టిస్ అభయ్ ఒకా, జస్టిస్ కైలాష్ గంభీర్, జస్టిస్ మదన్, జస్టిస్ జేసీ, జస్టిస్ కురియన్, జస్టిస్ విక్రమ్, జస్టిస్ ఏకే పట్నాయక్, జస్టిస్ గోపాల్ గౌడ, జస్టిస్ మురళీధర్, జస్టిస్ గోవింద్ మథుర్, జస్టిస్ చంద్రు, జస్టిస్ గోపాల్ రెడ్డి, జస్టిస్ కన్నన్, జస్టిస్ చంద్రకుమార్, జస్టిస్ మోహన్ గోపాల్, జస్టిస్ సీహెచ్ ప్రవీణ్ కుమార్, జస్టిస్ రఘురామ్ ఓ ప్రకటనలో అమిత్ షా వ్యాఖ్యలను ఖండించారు. సల్వాజుడుం తీర్పు కేసులో నక్సలిజాన్ని గానీ, దాని భావజాలాన్నిగానీ ఎక్కడా సమర్థించినట్లు పేర్కొనలేదని స్పష్టం చేశారు. ఎన్డీఏ కూటమి ఉపరాష్ట్రపతి అభ్యర్థి తరపున ప్రచారం కోసం అమిత్ షా అటువంటి వ్యాఖ్యలు చేయడం సహేతుకం కాదని తప్పుబట్టారు. ఉపరాష్ట్రపతి ఎన్నికలు గౌరవప్రదంగా, భావజాల కేంద్రీకృతంగా

మిగతా 2లో..

## కొండాపూర్‌లో రేవ్ పార్టీ..

**డ్రగ్స్ గుర్తించిన పోలీసులు**

**డిప్యూటీ తహసీల్దార్ సహా 8 మంది అరెస్ట్**

**శేరిలింగంపలి(జనంసాక్షి):**డ్రగ్స్‌కేసులో రాజమ హేంద్రవరం డిప్యూటీ తహసీల్దార్ మణిదీప్‌ను గచ్చి బౌలిలో పోలీసులు అరెస్ట్ చేశారు. ఓ అపార్ట్ మెంట్‌లో నిర్వహించిన బర్త్‌డే పార్టీలో యువకులు డ్రగ్స్ తీసుకున్నట్లు ఈగల్ టీమ్ పోలీసులు గుర్తించారు.కీలక నిందితుడు

మిగతా 2లో..

## దివ్యాంగులపై జోకులు తగవు

**స్టాండప్ కమెడియన్లపై సుప్రీంకోర్టు ఆగ్రహం**

**ఢిల్లీ(జనంసాక్షి):**దివ్యాంగులపై జోకులు వేసే కమెడియన్లపై సుప్రీంకోర్టు తీవ్రంగా స్పందించింది. స్టాండప్ కామెడీ పేరుతో దివ్యాంగులపై అనుచితమైన జోక్స్ తగదంటూ ఆగ్రహం వ్యక్తం చేసింది. ఇలాంటి అవమానించే వ్యాఖ్యలు ఎప్పుడు ఆగుతాయంటూ వ్యాఖ్యానించిన ధర్మాసనం.. అసభ్యకరమైన జోకులు వేసిన కమెడియన్లను మందలించింది. ఇలాంటి షోల్లో పాల్గొని అనుచిత వ్యాఖ్యలు

మిగతా 2లో..

## మోదీ డిగ్రీ వివరాలు బహిర్గతం చేయాల్సిన అవసరం లేదు

**సీఐసీ ఆదేశాలను నిలిపివేసిన ఢిల్లీ హైకోర్టు**

**న్యూఢిల్లీ(జనంసాక్షి):** ఎన్నో ఏళ్లుగా ప్రధాని నరేంద్ర మోదీ డిగ్రీ వివాదం అంశానికి సంబంధించి తనిఖీకి అనుమతిస్తూ కేంద్ర సమాచార కమిషన్ (సీఐసీ) ఇచ్చిన ఆదేశాలను ఢిల్లీ హైకోర్టు నిలిపివేసింది. ప్రధాని మోదీ విద్యకు సంబంధించిన రికార్డులను బహిరంగ పర్చాల్సిన అవసరం లేదని కోర్టు స్పష్టం చేసింది.ప్రధాని నరేంద్ర మోదీ విద్యార్హతలపై గత కొన్ని సంవత్సరాలుగా వివాదం కొనసాగుతోంది. 1978లో ఢిల్లీ యూనివర్సిటీ నుంచి నరేంద్ర మోదీ.. బీఏ డిగ్రీ పూర్తి చేశారని చెబుతున్న నేపథ్యంలో, ఆ డిగ్రీ

మిగతా 9లో..

## అనుమతిలేని కేబుల్ వైర్లు తొలగించొచ్చు: హైకోర్టు

3లో..




# రేవంత్-మోడీల మధ్య లోపాయికారి ఒప్పందం

- తెలంగాణకు ద్రోహం ఖాయంగా కనిపిస్తోంది
- యూరియా సంక్షోభానికి కాంగ్రెస్సే కారణం
- బీజేపీ, కాంగ్రెస్‌లు 'దొందూ దొందే'
- స్థానిక ఎన్నికల్లో కాంగ్రెస్‌కు బుద్ధిచెప్పాలి: కేటీఆర్

**హైదరాబాద్(జనంసాక్షి):**తెలంగాణ రాష్ట్రంలో అధికార కాంగ్రెస్ పార్టీ, కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీలు ఒకరిపై ఒకరు విమర్శలు చేసుకోకుండా, తెలంగాణకు ద్రోహం చేయడంలో మాత్రం కలిసి పనిచేస్తున్నాయని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సంచలన ఆరోపణలు చేశారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ప్రధాని నరేంద్ర మోడీల మధ్య అంతర్గత ఒప్పందం ఉందని, దానివల్ల తెలంగాణ భవిష్యత్తు ప్రమాదంలో పడుతుందని ఆయన తీవ్రంగా విమర్శించారు. సోమవారం తెలంగాణ భవన్‌లో జరిగిన పార్టీలో బిజెపి సీనియర్ నాయకులు అలూరి విజయ భారతి, పలువురు బిజెపినేతలు బీఆర్ఎస్ పార్టీలో చేరిన చేరికల కార్యక్రమంలో మాజీ మంత్రి సబితా ఇంద్రారెడ్డి, మాజీ ఎమ్మెల్యే జీవన్ రెడ్డి తదితర సీనియర్ నాయకులతో కలిసి ప్రసంగిస్తూ కేటీఆర్ ఈ వ్యాఖ్యలు చేశారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై

మిగతా 2లో..

## ప్రధాని అయినా రాజీనామా చేయాల్సిందే

**'ఉద్వాసన' బిల్లులపై అమిత్ షా వ్యాఖ్యలు**

**అనారోగ్య కారణాలతోనే ధన్‌ఖడ్ తప్పుకున్నారని వెల్లడి**

**ఉపాధ్యాయ నియామక కుంభకోణం..**

## పశ్చిమ బెంగాల్‌లో ఈడీ దాడులు

అధికారుల నుంచి తప్పించుకునేందుకు గోడ దూకిన ఎమ్మెల్యే

**సరిహద్దుల్లో**

## పాక్ డ్రోన్ల కలకలం

**అప్రమత్తమైన భద్రతా దళాలు**

వివరాలు 2వ పేజీలో..

# భారత్‌కు రష్యా బాసట



**భారతీయులకు ఊరటనిచ్చేలా వీసా నిబంధనల్లో మార్పులు**

**మాస్కో(జనంసాక్షి):**భారతీయులకు రష్యా శుభవార్త చెప్పింది. పాశ్చాత్య దేశాలు వలస నియమాలను కఠినతరం చేస్తున్న సమయంలో.. రష్యా వీసా నిబంధనల్ని సడలించింది. భారతీయులకు ఊతం ఇచ్చేలా వీసా నిబంధనలు మార్చింది.తద్వారా రష్యాలోని పలు రంగాల్లో అనుభవజ్ఞులైన భారతీయులకు డిమాండ్ పెరిగింది.రష్యాలోని ప్రముఖ సంస్థల్లో ఎలక్ట్రానిక్స్,మెషినరీ విభాగాల్లో సిబ్బంది కొరత తీవ్రంగా ఉంది. ఇదే విషయాన్ని రష్యాలోని భారత రాయబారి వినయ్ కుమార్ స్థానిక మీడియాకు వెల్లడించారు.రష్యాకు మ్యాన్‌పవర్.. భారతీయుల్లో నైపుణ్యం ఉంది.వాటికి అనుగుణంగా రష్యా వీసా నిబంధనలు మార్చింది. తద్వారా స్థానిక రష్యా కంపెనీలన్నీ భారతీయుల్ని నియమించుకుంటున్నాయి. ఇప్పటికే అధికమొత్తంలో రష్యాకు భారతీయులు వచ్చారు. వచ్చిన వారిలో ఎక్కువ మంది నిర్మాణ, వస్త్ర

మిగతా 2లో..



## ప్రభాకర్‌రావు దర్యాప్తునకు సహకరించట్లేదు

- సుప్రీం కోర్టుకు తెలిపిన తెలంగాణ ప్రభుత్వం
- ఫోన్ ట్యాపింగ్ కేసులో మాజీ ఐపీఎస్ అధికారి బెయిల్ పిటిషన్‌పై విచారణ వాయిదా

**న్యూఢిల్లీ(జనంసాక్షి):**ఫోన్‌ట్యాపింగ్ కేసులో నిందితుడు, మాజీ ఐపీఎస్ అధికారి ప్రభాకర్‌రావు దర్యాప్తునకు సహకరించడం లేదని తెలంగాణ ప్రభుత్వం సుప్రీంకోర్టుకు తెలిపింది.ప్రభాకర్‌రావు బెయిల్ పిటిషన్‌పై సోమవారం సుప్రీంకోర్టు మరోసారి విచారణ చేపట్టింది. కేసు దర్యాప్తునకు సంబంధించి స్టేటస్ రిపోర్టు దాఖలు చేసినట్లు రాష్ట్ర ప్రభుత్వం తరఫు సీనియర్ న్యాయవాది సిద్ధార్థ లూథ్రా, సొలిసిటర్ జనరల్

మిగతా 2లో..

# 'షా' వ్యాఖ్యలపై పెల్లుబూకిన ఆగ్రహం

జరగాల్సిన ఎన్నికలని తెలిపారు. ఉపరాష్ట్రపతి ఎన్నికలు వ్యక్తుల మధ్య జరగవని, అయినప్పటికీ అత్యున్నత పదవిలో ఉన్న హెూంమంత్రి అమిత్ షా వ్యాఖ్యలు దేశ న్యాయవ్యవస్థ స్వతంత్రతను దెబ్బతీసేలా ఉన్నాయని పేర్కొన్నారు. ఇది సుప్రీంకోర్టు న్యాయమూర్తులపైనా ప్రభావం పడనుందని ఆందోళన వ్యక్తం చేశారు. ఇకనైనా ఉపరాష్ట్రపతి ఎన్నికను గౌరవప్రదంగా భావించాలని, వ్యక్తిగత దూషణలు, పేరుపెట్టి అవమానించడం వంటి అసభ్య రాజకీయాలకు చోటు ఉండకూడదనీ హితవు పలికారు.

## కొండాపూర్‌లో రేవ్ పార్టీ..

ఎనిమిది మందిని అరెస్ట్ చేశారు. వీరిలో డిప్యూటీ తహసీల్దార్‌తో పాటు ఇద్దరు యువతులు కూడా ఉన్నారు. బెంగళూరు నుంచి డ్రగ్స్ తీసుకొచ్చినట్లు పోలీసులు గుర్తించారు. మల్నాడు రెస్టరంట్ డ్రగ్స్ కేసులో విక్రమ్‌రెడ్డి కీలకంగా వ్యవహరించాడు. కొండాపూర్‌లోని ఓ అపార్ట్‌మెంట్‌లో రేవ్ పార్టీ నిర్వహిస్తున్నట్లు పోలీసులకు సమాచారం అందింది.దీంతో గచ్చిబౌలి పోలీసులతో పాటు ఈగల్ టీమ్ సంయుక్త ఆపరేషన్ నిర్వహించారు. 20 గ్రాముల కొకైన్, 3 గ్రాముల ఎండీఎంఏ, 8 గ్రాముల డ్రగ్ పిల్స్ స్వాధీనం చేసుకున్నారు. అరెస్టయిన వారిలో తేజ, విక్రమ్, నీలిమ, చందన్, పురుషోత్తం రెడ్డి, భార్గవ్, రాహుల్ ఉన్నారు. వీరిలో తేజ, విక్రమ్ ఏపీలోని తూర్పుగోదావరి జిల్లాకు చెందిన వారు కాగా..నీలిమ, పురుషోత్తంరెడ్డి, భార్గవ్ హైదరాబాద్‌కు చెందినవారు. చందన్, రాహుల్ బెంగళూరుకు చెందినవారిగా పోలీసులు తెలిపారు. వీరిద్దరూ డ్రగ్స్ సరఫరా చేసినట్లు వెల్లడించారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసిన దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

## భూదాన్ భూముల ఆక్రమణపై విచారణకు ఆదేశించిన సీఎం

**హైదరాబాద్(జనంసాక్షి):** రంగారెడ్డి జిల్లా యాచారంలో భూదాన్ భూముల అన్యాక్రాంతంపై విచారణకు సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశించారు. 250 ఎకరాల భూముల ఆక్రమణతో పాటు ఔషధ పరిశ్రమ భూ సేకరణ కింద పరిహారం పొందిన అంశంపై విచారణ జరిపి నివేదిక అందించాలని రెవెన్యూశాఖ కార్యదర్శిని సీఎం రేవంత్ ఆదేశించారు.యాచారం మండలం తాడిపర్తిలో 104 సర్వే నంబరులో 250 ఎకరాల భూమిని కొందరు దాతలు 1955లో భూదాన్ యజ్ఞ బోర్డుకు అందజేశారు. 1997లో ప్రభుత్వం, 2006లో రంగారెడ్డి జిల్లా కలెక్టర్ ఆ భూమిని భూదాన్‌గా గుర్తించి సర్క్యులర్లు జారీ చేశారు. అయితే ఆ భూమిని కొనుగోలు చేశామంటూ హైదరాబాద్ పరిసర ప్రాంతాలకు చెందిన కొందరు హక్కులు క్లెయిమ్ చేశారు. దీంతో ఔషధ పరిశ్రమ కోసం చేపట్టిన భూసేకరణలో రెవెన్యూ అధికారులు పట్టా భూమిగా పరిగణించి ఎకరాకు రూ.16లక్షల చొప్పున రూ.40కోట్ల పరిహారం చెల్లించారు. మరోవైపు ఆ భూములను సాగు చేసుకుంటున్నామని.. పట్టాలకు దరఖాస్తు చేసుకుంటే భూదాన్ భూములంటూ ఇవ్వలేదని స్థానికులు పేర్కొంటున్నారు.

ఉపాధ్యాయ నియామక కుంభకోణం..

## పశ్చిమ బెంగాల్ ఈడీ దాడులు

**తప్పించుకునేందుకు గోడ దూకిన ఎమ్మెల్యే**



**కోల్‌కతా(జనంసాక్షి):**పశ్చిమ బెంగాల్ రాజకీయాలను కుదిపేసిన ఉపాధ్యాయ నియామక కుంభకోణం వ్యవహారంలో ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ పలువురు నేతల ఇళ్లపై దాడులు చేస్తున్నారు.ఈ నేపథ్యంలో అరుదైన ఘటన చోటుచేసుకుంది. ఈడీ అధికారులు ముర్షిదాబాద్ జిల్లాలోని తృణమూల్ కాంగ్రెస్ ఎమ్మెల్యే జిబన్ కృష్ణ సాహా నివాసం సహా ఆయనకు సంబంధించిన పలు ప్రదేశాలపై దాడులు నిర్వహించారు. అయితే సోదాల గురించి తెలుసుకున్న ఎమ్మెల్యే తమ ఇంటి మొదటి అంతస్తు నుంచి కిందకు దూకి.. గోడ దూకి పారిపోయేందుకు యత్నించారు. ఇంటి బయట కాపలా అధికారులు కృష్ణ సాహాను గుర్తించి అదుపులోకి తీసుకున్నారు.పారిపోయే క్రమంలో ఎమ్మెల్యే తన వద్ద ఉన్న సాక్ష్యాలను ధ్వంసం చేసేందుకు తన మొబైల్ ఫోన్‌ను ఇంటికి సమీపంలోని చెరువులోకి విసిరేసినట్లు అధికారులు తెలిపారు. మరో రెండు ఫోన్‌లను స్వాధీనం చేసుకొని.. ఫోరెన్సిక్ విశ్లేషణకు పంపామన్నారు.ఇంటి నుంచి పారిపోవడానికి ఎందుకు ప్రయత్నించారనే విషయంపై కృష్ణ సాహా ను విచారిస్తున్నట్లు అధికారులు పేర్కొన్నారు. అనంతరం ఆయనను కోల్‌కతాలోని ప్రత్యేక ఈడీ కోర్టు ముందు హాజరుపరుస్తామన్నారు. రఘునాథ్‌గంజ్ ప్రాంతంలోని ఎమ్మెల్యే అత్తమామలకు చెందిన ఇళ్లలోనూ సోదాలు చేపట్టినట్లు పేర్కొన్నారు. ఉపాధ్యాయ నియామక కుంభకోణం కేసులో 2023 ఏప్రిల్‌లో సీబీఐ అధికారులు కృష్ణ సాహాను అరెస్టు చేశారని.. 2025 మేలో ఆయనకు బెయిల్ మంజూరయ్యిందని తెలిపారు. ప్రభుత్వ ప్రాయోజిత, ఎయిడెడ్ పాఠశాలల్లో 9 నుంచి 12 తరగతులకు ఉపాధ్యాయులతో పాటు గ్రూప్ సి, గ్రూప్ డి స్టాఫ్ సిబ్బంది నియామకాల కోసం 2016లో బెంగాల్ సర్కారు రాష్ట్ర స్థాయి సెలక్షన్ పరీక్ష నిర్వహించింది. 24,650 ఖాళీల భర్తీ కోసం చేపట్టిన ఈ రిక్రూట్‌మెంట్ పరీక్షకు 23 లక్షల మందికి పైగా హాజరయ్యారు. అనంతరం ఇందులో ఎంపిక ప్రక్రియ చేపట్టి 25,753 మందికి అపాయింట్‌మెంట్ లెటర్లు అందజేశారు. ఈ నియామక ప్రక్రియలో అవకతవకలు జరిగాయని ఆరోపణలు వచ్చాయి. దీనిపై దర్యాప్తు చేపట్టాలని న్యాయస్థానాల్లో పిటిషన్లు దాఖలయ్యాయి. దీంతో దర్యాప్తు కొనసాగుతోంది.

**20 ఏళ్ల తర్వాత ఉస్మానియాలోకి అడుగుపెట్టిన**

# తొలి సీఎం రేవంత్



గద్ద ఇది.. దేశ ఖ్యాతిని ప్రపంచానికి చాటిన శివరాజ్ పాటిల్, పీవీ నర్సింహారావు ఈ యూనివర్సిటీ విద్యార్థులే.. ఉత్తమ పార్లమెంటేరియన్‌గా గుర్తింపు పొందిన జైపాల్ రెడ్డి ఈ యూనివర్సిటీ విద్యార్థినే.. తెలంగాణ నలుమూలలా ఏ సమస్య వచ్చినా మొదట చర్చ జరిగేది యూనివర్సిటీలోనే..అని అన్నారు. మలిదశ తెలంగాణ ఉద్యమంలో తొలి అమరుడు శ్రీకాంతాచారిది ఉస్మానియా యూనివర్సిటీనే.. యాదయ్య, ఇషాన్ రెడ్డి, వేణుగోపాల్ రెడ్డి రాష్ట్ర సాధనలో సమిధలయ్యారు.. ఎంతో మంది మేధావులను అందించిన ఘనత ఉస్మానియా యూనివర్సిటీది.. గత పదేళ్ల పాలనలో ఉస్మానియా యూనివర్సిటీని నిర్వీర్యం చేసే కుట్ర జరిగింది.. ఉస్మానియా యూనివర్సిటీకి పూర్వ వైభవం తీసుకురావాలని మేం ఆలోచన చేశాం.. అధికారంలోకి వచ్చిన వెంటనే రాష్ట్రంలోని యూనివర్సిటీలకు వీసీలను నియమించాం.. చదువుకుని చైతన్యం ఉన్న వారిని వీసీలుగా నియమించాం.. తెలంగాణ సమాజాన్ని చైతన్యపరిచే మేధా సంపత్తిని ఉస్మానియా యూనివర్సిటీ నుంచి ఆశిస్తున్నాం.. అన్నారు. దేశానికి యువ నాయకత్వం అవసరం.. దేశంలో 60 శాతం జనాభా 35 ఏళ్ల లోపు వారే.. ఇది మన దేశ సంపద.. 21 ఏళ్ల వయసులో దేశానికి సేవలంది స్తున్నప్పుడు.. 21 ఏళ్ల యువకులు శాసన సభలో ఎందుకు అడుగుపెట్టకూడదు?.. తెలంగాణలో జరుగుతున్న పరిణామాలు చూస్తుంటే ఆవేదన కలుగుతోంది.. యువతను గంజాయి, డ్రగ్స్ వ్యసనాలు పట్టి పీడిస్తున్నాయి.. గంజాయి, డ్రగ్స్ యువతను నిర్వీర్యం చేస్తున్నాయి.. ఆ వ్యసనాల నుంచి యువతను బయటపడేలా చేయాలి.. చదువు, చైతన్యం ఉంటేనే సమాజంలో రాణిస్తారు.. నా దగ్గర పంచడానికి భూములు లేవు, ఖజానా లేదు మీకు నేను ఇవ్వగలిగింది విద్య ఒక్కటే.. అన్నారు. మీ తలరాతలు మార్చేది చదువొక్కటే.. చదువు ఒక్కటే మిమ్మల్ని ధనవంతుల్ని చేస్తుంది, గుణవంతులను చేస్తుంది.. పేదరికం మాకు కొత్త కాదు.. ఆ పేదరికాన్ని చూసి వచ్చినవాళ్ళం.. పేదరికాన్ని పారద్రోలడం మాకంటే ఎక్కువ ఎవరికీ తెలియదు.. యూనివర్సిటీ అభివృద్ధి అధ్యయనానికి ఇంజనీర్స్ కమిటీ వేయాలని అధికారులను ఆదేశిస్తున్నా.. ఉస్మానియా యూనివర్సిటీని స్టాన్ ఫర్డ్, ఆక్స్ ఫర్డ్ స్థాయిలో తీర్చిదిద్దుతాం.. ఉస్మానియా యూనివర్సిటీ చరిత్రకు నిలువెత్తు సాక్షిగా నిలవాలి.. ఉస్మానియా యూనివర్సిటీ– లేకపోతే తెలంగాణ రాష్ట్రమే లేదు.. యూనివర్సిటీ– అభివృద్ధికి ఏం కావాలో అడగండి.. అంచనాలు తయారు చేసి ఇవ్వండి..అని అన్నారు. మళ్లీ యూనివర్సిటీకి వస్తా.. ఆర్ట్స్ కాలేజీ వద్ద మీటింగ్ పెట్టి నిధులు మంజూరు చేస్తా..పోలీసులకు నేను ఆదేశిస్తున్నా.. ఆ రోజు యూనివర్సిటీ లో ఒక్క పోలీస్ కనిపించొద్దు.. నిరసన తెలిపే వారిని నిరసన తెలపనివ్వండి.. నేను రావొద్దని అడ్డుకునే వారికి సమాధానం చెప్పే చిత్తశుద్ధి నాకుంది.. కొంతమంది రాజకీయ నాయకులకు పదవులు పోయాయన్న ఆవేదన ఉంటుంది.. వాళ్ల కొడుకులను ఏదో చేద్దామనుకుంటే ఏదో అవుతున్నారని బాధ ఉంటది.. వారి ఉచ్చులో మీరు పడొద్దు.. సమస్య ఉంటే మాకు చెప్పండి.. మా మంత్రులు మీకు అందుబాటులో ఉంటారు.. కోదండరామ్ సార్ పై కుట్ర చేసి సుప్రీం కోర్టుకు వెళ్లి పదవి తొలగించారు.. ఇదేం పైశాచిక ఆనందం.. మళ్లీ కోదండరాం సార్ కు ఎమ్మెల్సీ ఇస్తాం..అని ప్రకటించారు. అపోహలకు లోను కాకండి.. అబద్ధాల సంఘం చెప్పే మాటలు నమ్మొద్దు..వాట్సాప్, సోషల్ మీడియాలో ప్రభుత్వంపై దుష్ప్రచారం చేస్తున్నారు.. ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్స్ తో సెంట్రల్ యూనివర్సిటీలో సింహాలు, ఏనుగులు ఉన్నాయని ప్రచారం చేసి అడ్డుకున్నారు.. తెలంగాణలో సింహాలు, ఏనుగులు లేనేలేవు.. మానవ రూపంలో ఉన్న మృగాలు ఉన్నాయి.. వాళ్లు తెలంగాణ సమాజానికి పట్టిన చెదలు లాంటివారు.. వాళ్లు తెలంగాణ సమాజం బాగు కోరుకోరు.. వాళ్లు మళ్లీ వస్తే ఉస్మానియా యూనివర్సిటీని ఉండనివ్వరు.. మీ చదువుకు ఏం కావాలో అడగండి.. ఉస్మానియా యూనివర్సిటీని అభివృద్ధి చేసే బాధ్యత నాది అని సీఎం రేవంత్ తెలిపారు.

## కొదండరామ్‌ను మళ్లీ ఎమ్మెల్సీచేస్తాం

గత పదేళ్లలో యూనివర్సిటీని భ్రష్టు పట్టించారని మండిపడ్డారు. అయినా.. ఎందుకు అంత శునకానందం మీకు అంటూ.. బీఆర్ఎస్ పార్టీ నేతలపై ఆగ్రహం వ్యక్తం చేశారు. రాజకీయ నాయకులు తమ ప్రయోజనాల కోసం చేతులెత్తేసినప్పుడు.. తెలంగాణ ఉద్యమాన్ని ముందుకు తీసుకెళ్లింది ఈ యూనివర్సిటీ–నే అని వివరించారు. మలి దశ తెలంగాణ ఉద్యమంలో తొలి అమరుడు శ్రీకాంతాచారిది ఉస్మానియా యూనివర్సిటీనే అని తెలిపారు. అలాగే యాదయ్య, ఇషాన్ రెడ్డి, వేణుగోపాల్ రెడ్డి తదితరులు రాష్ట్ర సాధనలో భాగంగా సమిధలయ్యారని పేర్కొన్నారు. ఎంతో మంది మేధావులను అందించిన ఘనత ఉస్మానియా యూనివర్సిటీదన్నారు. గత పదేళ్ల పాలనలో ఉస్మానియా యూనివర్సిటీని నిర్వీర్యం చేసే కుట్ర జరిగిందంటూ మండిపడ్డారు. ఉస్మానియా యూనివర్సిటీకి పూర్వ వైభవం తీసుకురావాలని తాము ఆలోచన చేశామని చెప్పారు. అధికారంలోకి వచ్చిన వెంటనే రాష్ట్రంలోని యూనివర్సిటీలకు వీసీలను నియమించామని గుర్తు చేశారు. చదువుకుని చైతన్యం ఉన్న వారిని వీసీలుగా నియమించామని వివరించారు. అనంతరం క్యాంపస్‌లోని ఠాగూర్ ఆడిటోరియంలో విద్యార్థులను ఉద్దేశించి సీఎం రేవంత్ రెడ్డి కీలక వ్యాఖ్యలు చేశారు. ఎమ్మెల్సీలు ప్రొ. కోదండరామ్,అమీర్ అలీఖాన్ సభ్యత్వాన్ని సుప్రీంకోర్టు ఇటీవల రద్దు చేసింది. కాంగ్రెస్ ప్రభుత్వం కొలువు తీరిన తర్వాత.. వీరిద్దరిని గవర్నర్ కోటాలో ఎమ్మెల్సీగా నియమించిన సంగతి తెలిసిందే..

# భారత్‌కు రష్యా బాసట

రంగాలలో ఉన్నారు.వీటితో పాటు మెషినరీ, ఎలక్ట్రానిక్స్ విభాగాలలో భారతీయుల డిమాండ్ పెరుగుతోందని ఆయన అన్నారు.రష్యాకు భారతీయల వలసలు పెరుగుతున్న నేపథ్యంలో రాయబార కార్యాలయం తన సేవల్ని విస్తరించేందుకు మరింత ప్రయత్నిస్తుందని చెప్పారు. పాస్‌పోర్ట్‌లు అప్‌డేట్,అప్రూవల్ వంటి సేవలు వేగవంతం అవుతాయని తెలిపారు.

## ప్రభాకర్‌రావు దర్యాప్తునకు సహకరించట్లేదు

తుషార్ మెహతా కోర్టుకు వివరించారు.ఎన్నిసార్లు పిలిచినా దర్యాప్తునకు హాజరవుతున్నట్లు ప్రభాకర్‌రావు తరఫు న్యాయవాది శేషాద్రి నాయుడు తెలిపారు. ఎలక్ట్రానిక్ పరికరాలు, సాక్ష్యాధారాలు టాంపరింగ్ చేశారని లూథ్రా కోర్టుకు వివరించారు. డేటా రికవరీ చేయడానికి కూడా సహకరించడం లేదన్నారు. తాను స్వయంగా వచ్చి కేసు వివరాలన్నీ చెబుతానని, అప్పటి వరకు పాస్ ఓవర్ ఇవ్వాలని లూథ్రా విజ్ఞప్తి చేశారు. ప్రభాకర్‌రావు ఇచ్చిన ఎలక్ట్రానిక్ పరికరాలన్నీ ఫార్మాట్ చేసి ఇచ్చారని సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా అన్నారు. ప్రభుత్వం ఇచ్చిన ల్యాప్‌టాప్ కూడా అదే స్థితిలో ఉందని, దానిలో ఎలాంటి సమాచారం లేదని తెలిపారు. వాదనలు విన్న ధర్మాసనం తదుపరి విచారణను నాలుగు వారాలకు వాయిదా వేసింది. దర్యాప్తునకు సహకరించాలని ప్రభాకర్‌రావును ఆదేశించింది.

## దివ్యాంగులపై జోకులు తగవు..

చేసినవారు తమ సామాజిక మాధ్యమాల్లో కూడా క్షమాపణలు చెప్పాలని సుప్రీంకోర్టు ఆదేశించింది.సామేయ్ రైనా, విపున్ గోయల్, బల్ రాజ్ పరమజీత్ సింగ్ ఘాయ్, సోనాలి థక్కర్, నిశాంత్ జగదీష్ తన్వర్ వంటి కమెడియన్లు వికలాంగులను అపహాస్యం చేశారంటూ ఎస్ఎంఏ క్యూర్ ఫౌండేషన్ పిటిషన్ దాఖలు చేసింది. దీనిపై జస్టిస్ సూర్య కాంత్, జస్టిస్ జాయ్ మాల్యా బాగ్చీలతో కూడిన ధర్మాసనం సోమవారం విచారణ చేపట్టింది. హాస్యం జీవితంలో భాగమే, కానీ అది ఇతరుల గౌరవాన్ని దెబ్బతీయకూడదంటూ ధర్మాసనం హెచ్చరించింది. సమాచార, ప్రసార మంత్రిత్వ శాఖ దీనికి సంబంధించి మార్గదర్శకాలను రూపొందించాలంటూ ఆదేశించింది. ఇలాంటి కేసులలో భవిష్యత్తులో జరిమానాలు కూడా విధించవచ్చంటూ సుప్రీంకోర్టు వార్నింగ్ ఇచ్చింది. ఇకపై కమెడియన్లు ప్రతి విచారణకు వ్యక్తిగతంగా హాజరు కావాల్సిన అవసరం లేదన్న ధర్మాసనం.. ఈ ఇన్‌ఫ్లుయెన్సర్లపై విధించాల్సిన జరిమానాపై తర్వాత నిర్ణయం తీసుకుంటామని పేర్కొంది. ఈ వివాదం అనంతరం సమయ్ రైనా తన షో "ఇండియాస్ గాట్ లాటెంట్"ను నిలిపేసిన సంగతి తెలిసిందే.

## సరిహద్దుల్లో పాక్ డ్రోన్ల కలకలం

**అప్రమత్తమైన భద్రతా దళాలు**

**న్యూఢిల్లీ(జనంసాక్షి):**నియంత్రణ రేఖ వెంట పాక్ డ్రోన్లు కలకం సృష్టించాయి. గగనతలంలో పాక్ డ్రోన్లను గుర్తించిన భారత్ భద్రతా దళాలు అప్రమత్తమయ్యాయి. ఆదివారం రాత్రి సరిహద్దు అవతలి నుంచి ఆరు డ్రోన్లు ఎగురుతూ వచ్చినట్లు అధికారులు తెలిపారు.ఐదు నిమిషాల్లో అవి తిరిగి పాక్ భూభాగంలోకి వెళ్లాయన్నారు. నిఘా కోసం దాయాది దేశం వీటిని ప్రయోగించినట్లు అనుమానం వ్యక్తం చేశారు. డ్రోన్లు ఆయుధాలు, మాదకద్రవ్యాలను జారవిడిచి ఉంటాయా అనే కోణంలో దర్యాప్తు చేస్తున్నామని.. డ్రోన్ల కదలికను గుర్తించిన అన్ని ప్రాంతాల్లో సోమవారం సెర్చ్ ఆపరేషన్ నిర్వహిస్తున్నామని వెల్లడించారు. గత కొన్నేళ్లుగా జమ్మూ కశ్మీర్‌లోని సరిహద్దు ప్రాంతాల్లో పాకిస్థాన్ డ్రోన్లు పలు ఆయుధాలు, మాదకద్రవ్యాలను జారవిడుస్తుండడం పెద్ద సమస్యగా మారిందని అధికారులు పేర్కొన్నారు. పహల్గాం దాడి అనంతరం భారత్, పాక్ మధ్య ఉద్రిక్తతలు నెలకొన్న విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో ఉగ్రవాదులు చొరబడకుండా ఉండేందుకు సరిహద్దు ప్రాంతాల్లో భారత సైన్యం భద్రతను మరింత కట్టుదిట్టం చేసింది. ఆపరేషన్ సిందూర్ అనంతరం పాక్ చేసే డ్రోన్ దాడులను తిప్పికొట్టేందుకు పటిష్ఠమైన చర్యల్లో భాగంగా బీఎస్ఎఫ్ అధికారులు సరిహద్దు ప్రాంతాల్లో డ్రోన్ స్క్వాడ్రన్‌ను ఏర్పాటు చేశారు. సరిహద్దు వెంబడి నిఘా ఉంచడంతో పాటు, శత్రు సేనల కదలికల్ని గమనించడం, దాడుల్లో పాల్గొనడం వంటి కార్యకలాపాల్లో వీటిని వినియోగించనున్నారు.

# భారత్‌పై సుంకాలు.. రష్యాపై ఒత్తిడి తెచ్చేందుకే..

పోషించగలదని వాన్స్ విశ్వాసం వ్యక్తం చేశారు. అమెరికా ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్ తాజాగా ఓ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా వాన్స్ మాట్లాడుతూ..'రష్యాకు చమురు ఆర్థిక వ్యవస్థ నుంచి వచ్చే ఆదాయాన్ని తగ్గించడం, తద్వారా అది యుద్ధాన్ని కొనసాగించలేకపోవడం ఈ చర్యల లక్ష్యం. అధ్యక్షుడు ట్రంప్, రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ మధ్య ఇటీవల జరిగిన సమావేశం తర్వాత ఏర్పడిన అడ్డంకులు ఉన్నప్పటికీ, రష్యా–ఉక్రెయిన్ యుద్ధాన్ని ముగించడంలో అమెరికా మధ్యవర్తి పాత్ర పోషించగలదు. రష్యాపై ట్రంప్ బలమైన ఆర్థిక ఒత్తిడిని తెచ్చారు.ఎలా అంటే.. భారత్‌పై అదనపు సుంకాలు విధించడం ద్వారా , చమురు నుంచి వచ్చే రష్యా ఆదాయాలు తగ్గిపోతాయి. రష్యా దాడులను ఆపివేస్తే, దానిని మళ్ళీ ప్రపంచ ఆర్థిక వ్యవస్థలో చేర్చవచ్చని, కానీ దాడులు కొనసాగితే, అది ఒంటరిగా ఉండాల్సి వస్తుందనే సందేశాన్ని ఇవ్వడానికి ట్రంప్ ప్రయత్నించారని అన్నారు. ఉక్రెయిన్‌పై బాంబు దాడులను ఆపమని రష్యాను బలవంతం చేయడానికి ట్రంప్ దూకుడుగా ఆర్థిక ఒత్తిడి విధానాన్ని అవలంభించారు. భారత్ ద్వితీయ సుంకాలను విధించడం కూడా ఇందులో భాగమని తెలిపారు.మరోవైపు.. రష్యా నుంచి భారత్ చమురు కొనుగోలుపై అమెరికా విమర్శలు చేసింది. భారత వస్తువులపై ట్రంప్ సుంకాన్ని 50 శాతానికి రెట్టింపు చేయడం వల్ల భారత్–అమెరికా సంబంధాలలో ఉద్రిక్తతలు పెరిగాయి. ఇదే సమయంలో రష్యా చమురును ఎక్కువగా కొనుగోలు చేసే చైనాపై ట్రంప్ ఎటువంటి అభ్యంతరం వ్యక్తం చేయలేదు. దీంతో, ట్రంప్ తీరును పలు దేశాల నేతలు తీవ్రంగా విమర్శిస్తున్నారు.

**భారత్ అమెరికా రాయబారిగా సెర్గియో గోర్‌నియామకం**

అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ నిర్ణయాలు భారత్–అమెరికా సంబంధాలను తీవ్రస్థాయిలో దెబ్బతీస్తున్నాయి. తాజాగా అత్యంత వివాదాస్పదమైన వ్యక్తుల్లో ఒకరైన సెర్గియో గోర్‌ను భారత్ అమెరికా రాయబారిగా, దక్షిణ, మధ్యఆసియాలో పర్యవేక్షకుడిగా నియమించడం దౌత్యవర్గాలను షాక్‌కు గురిచేసింది.ఒకప్పుడు భారత్ తీవ్రంగా వ్యతిరేకించిన పనినే ట్రంప్ బలవంతంగా చేశారు. 38 ఏళ్ల గోర్‌పై ట్రంప్‌నకు విపరీతమైన నమ్మకం ఉంది. ఇతడు చెప్పిన మీదటే నాసా చీఫ్ నియామకాన్ని చివరి నిమిషంలో మార్చేశారు. గోర్ నియామకంపై భారత్‌లో మిశ్రమ స్పందన వస్తోంది. విదేశీ వ్యవహారాల నిపుణుడు, మాజీ దౌత్యవేత్త కన్వల్ సిబల్ స్పందిస్తూ భారత్‌లో నియమించిన దౌత్యవేత్తను దక్షిణ, మధ్య ఆసియాకు ప్రత్యేక దూతగా నియమించడం ఇదే తొలిసారి అన్నారు. పాకిస్థాన్ సహా పొరుగుదేశాలతో భారత్‌కు ఉన్న సంబంధాలను అతడు గమనిస్తాడన్నది వాస్తవమని పేర్కొన్నారు. అయితే.. ఈ చర్య భారత్, పాకిస్థాన్‌ను ఒకేగాటన కట్టినట్లవుతుందని.. ఇలాంటి అమెరికా వైఖరిని న్యూదిల్లీ గతంలో తీవ్రంగా వ్యతిరేకించిందన్నారు. అంతేకాదు.. ఇక భారత్–అమెరికా సంబంధాల్లో ఇండో–పసిఫిక్ ప్రాధాన్యం కనుమరుగవుతుందని చెప్పారు. మరో మాజీ దౌత్యవేత్త నిరుపమారావ్ కూడా ట్రంప్ ఉద్దేశాలను ప్రశ్నించారు. ఈ నియామకం భారత్–అమెరికా సంబంధాలను దెబ్బతీస్తుందన్నారు. గోర్ దౌత్యవేత్త కాకపోవడం, భారత్, దక్షిణాసియాలో అతడికి అనుభవం లేకపోవడం ఇబ్బందికరమన్నారు. కేవలం వీరవిధేయతే ఏకైక అర్హతన్నారు. అధ్యక్షుడి అజెండాను ముందుకతీసుకెళ్లడానికే అతడిని నియమించారన్నారు. అది భారత్‌తో సంబంధాలను బలోపేతం చేస్తుందని చెప్పలేమన్నారు. అమెరికా అనుసరించే పాక్–అఫ్గాన్ పాలసీతో భారత్‌ను కూడా కలపడం ఇబ్బందికరమే అని తెలిపారు.వ్యక్తిగతంగా తనకు అత్యంత సన్నిహితుడైన వ్యక్తిని భారత్‌లో నియమించి ట్రంప్ నుంచి మోదీ ప్రభుత్వానికి బలమైన సంకేతాలు వెళ్లాయని పొలిటికో పత్రిక పేర్కొంది. అధ్యక్షుడి నుంచి వచ్చే అభ్యంతరాలు, ఇతర సందేశాలపై భారత్ కూడా తీవ్రంగా పరిగణించి.. చర్చలు జరపాల్సిన అవసరం ఉందని అభిప్రాయపడింది.

**ట్రంప్-మస్క్ వివాదాన్ని ఎగదోసి..**

శ్వేతసౌధంలో ట్రంప్ వ్యక్తిగత కార్యదర్శి హోదాలో అమెరికా ప్రభుత్వంలో ఏకంగా 4,000 నియామకాలు చేశారంటే.. గోర్ పరపతిని అర్థం చేసుకోవచ్చు. మస్క్ దోస్త్ జరేడ్ ఇస్సాక్‌మన్ నాసా చీఫ్‌గా తొలుత ప్రకటించారు. ఆయన నామినేషన్ ఆమోదం కోసం సెనెట్‌కు పంపే సమయంలో మస్క్–ట్రంప్ మధ్య విభేదాలు తీవ్రస్థాయిలో ఉన్నాయి. అదే సమయంలో ఇస్సాక్‌మన్ డెమోక్రాట్లకు ఎన్నికల్లో నిధులు సమకూర్చినట్లు గోర్ నుంచి అధ్యక్షుడికి సమాచారం వెళ్లింది. దీంతో డోజ్ అధిపతిగా మస్క్ చివరి రోజున.. నాసా చీఫ్ పదవి నుంచి ఇస్సాక్‌మన్ పేరును ట్రంప్ తొలగించారు. ఈ నేపథ్యంలో గోర్‌ను 'పాము'గా అభివర్ణిస్తూ మస్క్ ఎక్స్‌లో పోస్టు పెట్టారు. సెనెట్‌లో ఆమోదముద్ర పడితే గోర్ భారత్‌కు రావడం ఖాయమవుతుంది. ఇది కూడా అంత ఈజీ ఏమీ కాదు.

# ప్రధాని అయినా రాజీనామా చేయాల్సిందే

- 'ఉద్వాసన' బిల్లులపై అమిత్ షా వ్యాఖ్యలు
- అనారోగ్య కారణాలతోనే ధన్‌ఖడ్ తప్పుకున్నారని వెల్లడి

**న్యూఢిల్లీ(జనంసాక్షి):**ముఖ్యమంత్రి అయినా.. ప్రధానమంత్రి అయినా జైలు నుంచే పరిపాలన చేయడం మంచి విషయమేనా? అని కేంద్ర హెూంమంత్రి అమిత్ షా ప్రశ్నించారు. మన ప్రజాస్వామ్యానికి అది మర్యాదపూర్వకంగా ఉంటుందా? అంటూ విపక్షాలపై మండిపడ్డారు. ప్రముఖ జాతీయ మీడియా సంస్థ 'ఏఎన్‌ఐ'కి అమిత్ షా ప్రత్యేక ఇంటర్వ్యూ ఇచ్చారు. ఈసందర్భంగా 130వ రాజ్యాంగ సవరణ బిల్లు సహా పలు అంశాలపై ఆయన మాట్లాడారు. మాజీ ఉప రాష్ట్రపతి ధన్‌ఖడ్ రాజీనామా అంశం పైనా స్పందించారు."విపక్షాలు ఇప్పటికీ కూడా జైలుకు వెళ్తే సులభంగా ప్రభుత్వాలు ఏర్పాటుచేయగలమని అనుకుంటున్నారు. వారు జైలునే సీఎం, పీఎం అధికారిక నివాసాలుగా మార్చేస్తారు. అప్పుడు డీజీపీ, చీఫ్ సెక్రటరీ, కేబినెట్ సెక్రటరీ వంటి ఉన్నతాధికారులు జైలు నుంచే ఆదేశాలు తీసుకోవాల్సి ఉంటుంది. ఇలాంటి సిద్ధాంతాలను నేను, మా పార్టీ తీవ్రంగా వ్యతిరేకిస్తున్నాం. జైలు నుంచే ప్రభుత్వాలను నడిపే పరిస్థితి మన దేశంలో రాకూడదు" అని అమిత్ షా అన్నారు. "ప్రధాని గానీ, ముఖ్యమంత్రి గానీ లేదా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల్లో ఉన్న ఏ నేత అయినా సరే.. ఏదైనా కేసులో అరెస్టయితే 30 రోజుల్లో బెయిల్ పొందాలి. లేదంటే తమతమ పదవులకు రాజీనామా చేయాలి. అలా చేయకపోతే.. చట్టమే వారిని తప్పించేలా 130వ రాజ్యాంగ సవరణను తీసుకొస్తున్నాం. చట్టమేదైనా ప్రభుత్వం, ప్రతిపక్షానికి ఒకేలా అమలవుతుంది. ఈ నిబంధన ప్రధాని పదవికి కూడా వర్తించేలా స్వయంగా నరేంద్రమోదీనే దీన్ని సవరణలో చేర్చారు. ఆయనకు కూడా ఇది వర్తిస్తుంది. ప్రధాని జైలుకెళ్తే ఆయనైనా రాజీనామా చేయాల్సిందే. ఎన్నికైన ప్రభుత్వం రాజ్యాంగ సవరణను తీసుకొస్తే దానిపై అభ్యంతరాలు లేవనెత్తే హక్కు అందరికీ ఉంటుంది. అంతేగానీ, పార్లమెంట్‌లో ప్రవేశపెట్టేందుకు కూడా అవకాశం లేకుండా ఆందోళనలు చేస్తే ఎలా?" అని ప్రతిపక్షాలపై హెూంమంత్రి మండిపడ్డారు. ఈ బిల్లు కచ్చితంగా పార్లమెంట్‌లో ఆమోదం పొందుతుందని ఆశాభావం వ్యక్తంచేశారు. 130వ రాజ్యాంగ సవరణ బిల్లుపై విపక్షాల ఆరోపణలను అమిత్ షా తీవ్రంగా ఖండించారు. ఈ సందర్భంగా 2013 నాటి ఉదంతాన్ని ప్రస్తావిస్తూ కాంగ్రెస్ ఎంపీ రాహుల్ గాంధీపై ధ్వజమెత్తారు. "రాజ్యాంగ సవరణ బిల్లులో నైతికత లేదని విపక్షాలు అంటున్నాయి. నాడు లాలూ యాదవ్‌ను కాపాడేందుకు అప్పటి ప్రధాని మన్మోహన్ సింగ్ ప్రభుత్వం తీసుకొచ్చిన ఆర్డినెన్స్ పత్రాలను రాహుల్ గాంధీ చింపేశారు. ఆ రోజే ఆయన నైతికతతో వ్యవహరిస్తే ఇప్పుడు ఈ పరిస్థితి వచ్చేది కాదు. ఈ రాజ్యాంగ సవరణపై కాంగ్రెస్ ద్వంద్వ వైఖరి ప్రదర్శిస్తోంది. వరుస వైఫల్యాలతో ఆ పార్టీ ఆలోచనావిధానం మందగించి ఉంటుంది" అని కేంద్రమంత్రి ఎద్దేవా చేశారు. ఈ సందర్భంగా మాజీ ఉపరాష్ట్రపతి జగదీప్ ధన్‌ఖడ్ రాజీనామా అంశాన్నీ ఆయన ప్రస్తావించారు. "ధన్‌ఖడ్‌జీ రాజ్యాంగ పదవిలో కొనసాగారు. ఆయన పదవీకాలంలో ఎన్నో మంచి పనులు చేశారు. వ్యక్తిగత అనారోగ్య సమస్యల కారణంగా ఇప్పుడు రాజీనామా చేశారు. ఈ విషయాన్ని మరీ ఎక్కువగా లాగొద్దు. కేవలం ప్రతిపక్షాల ఆరోపణల ఆధారంగా దీనిపై ఓ అంచనాకు రావడం సరికాదు" అని అమిత్ షా స్పష్టం చేశారు.త్వరలో జరగబోయే ఉపరాష్ట్రపతి ఎన్నిక గురించి ప్రస్తావిస్తూ.. "రాష్ట్రపతిని తూర్పు భారతం నుంచి ఎన్నుకున్నాం. ఇప్పుడు ఉపరాష్ట్రపతి దక్షిణాది నుంచి ఉండాలని అనుకున్నాం. దీనికి, తమిళనాడు ఎన్నికలకు ఎలాంటి సంబంధం లేదు" అని తెలిపారు.



## రేవంత్-మోడీల మధ్య లోపాయికారి ఒప్పందం

కేటీఆర్ వ్యంగ్యాస్త్రాలు సంధించారు. "రేవంత్ రెడ్డి జేబులో కత్తెర పెట్టుకొని తిరుగుతున్నారు. గతంలో మా బీఆర్ఎస్ ప్రభుత్వం కట్టిన భవనాలను రిబ్బన్ కట్ చేసి ప్రారంభించడానికి తాపత్రయ పడుతున్నారు. ఆ కత్తెర పట్టుకుని జాగ్రత్తగా తిరగండి," అంటూ ఆయన సెటైర్ వేశారు. ఈ రోజు ఉస్మానియా విశ్వవిద్యాలయానికి వెళ్లిన రేవంత్ రెడ్డి, గతంలో కేసీఆర్ గారు పునాది వేసిన భవనాలను ప్రారంభించి వచ్చారని కేటీఆర్ ఎద్దేవా చేశారు. రేవంత్ రెడ్డి మాట్లాడుతున్న 'వికృతమైన' మాటలు చూసి ప్రజలు నవ్వుకుంటున్నారని, గత ముఖ్యమంత్రులతో పోల్చి చూసి రేవంత్‌ను బండ బూతులు తిడుతున్నారని కేటీఆర్ మండిపడ్డారు. కాళేశ్వరం ప్రాజెక్టు మరమ్మతులు చేయకపోవడాన్ని తీవ్రంగా విమర్శించిన కేటీఆర్, "గోదావరి నీళ్లను దిగువకు పంపి చంద్రబాబు కడుతున్న కనకచెర్ల ప్రాజెక్టుకు, అక్కడి నుంచి తమిళనాడుకు తరలించేందుకు రేవంత్ కుట్ర చేస్తున్నాడు. ఇది మోడీ, చంద్రబాబు ఆదేశాల మేరకే జరుగుతోంది" అన్నారు. మోడీ, చంద్రబాబు ఆదేశాల మేరకే రేవంత్ రెడ్డి గోదావరి నీళ్లను కిందికి పంపించేందుకు కుట్ర చేస్తున్నారని కేటీఆర్ ఆరోపించారు. "కాళేశ్వరం నీళ్లు ఆగకుండా, గోదావరి నీళ్లు కిందికి వెళ్లి చంద్రబాబు కడుతున్న కనకచెర్ల ప్రాజెక్టుకు, అక్కడి నుంచి తమిళనాడుకు వెళ్లాలనేది కేంద్రంలోని బీజేపీ, రేవంత్‌కు ఇచ్చిన ఆదేశం. అందుకే రేవంత్ కాళేశ్వరం ప్రాజెక్టుపై పగ పట్టారు," అని కేటీఆర్ స్పష్టంగా చెప్పారు. రాష్ట్రంలో యూరియా కొరత ఒకవైపు ఉంటే, రేవంత్ రెడ్డి మరోవైపు సినిమా వాళ్ళతో సమావేశాలు పెట్టుకున్నారని కేటీఆర్ విమర్శించారు. "యూరియా కొరతకు 'ఆపరేషన్ సిందూర్' కారణమని బీజేపీ ఎంపీలు చెబుతున్నారు. అందుకే చైనా నుంచి ఎరువులు రాలేదని అంటున్నారట. అసలు మనకు చైనాతో యుద్ధం జరిగిందా? రేవంత్‌పై మాట పడకుండా బీజేపీ కాపాడుతోంది," అని కేటీఆర్ ప్రశ్నించారు.'బడా మోడీ, చోటా మోడీ'ల దొంగాట: రాహుల్‌కు దెబ్బ ఖాయంకేటీఆర్ మాట్లాడుతూ, రేవంత్ రెడ్డి, నరేంద్ర మోడీల మధ్య అనేక పోలికలు ఉన్నాయని, ఇద్దరూ ఇచ్చిన హామీలను అమలు చేయడంలో విఫలమయ్యారని ఎద్దేవా చేశారు. "ఒకరు బడా మోడీ, మరొకరు చోటా మోడీ. ఇద్దరూ కలిసి పని చేస్తున్నారు. రేవంత్ రెడ్డి వ్యవహార శైలి చూస్తుంటే, ఆయన రేపో మాపో మోడీతో కలిసిపోవడం ఖాయం అనిపిస్తోంది. దీనివల్ల కాంగ్రెస్ నాయకుడు రాహుల్ గాంధీకే పెద్ద దెబ్బ తగులుతుంది," అని కేటీఆర్ విశ్లేషించారు. గత పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్, బీజేపీలు దొంగలు దొంగలు ఊళ్లు పంచుకున్నట్లుగా ఎనిమిది చొప్పున ఎంపీ స్థానాలను పంచుకున్నారని ఆయన ఆరోపించారు. రేవంత్ రెడ్డి హామీల వైఫల్యాలపై బీజేపీ ఎంపీలు ఏనాడు ప్రశ్నించడం లేదని, కానీ రేవంత్‌కు రక్షణగా కేసీఆర్ గారిపై మాత్రం విమర్శలు చేస్తున్నారని కేటీఆర్ దుయ్యబట్టారు. అమృత్ స్కాం, హెచ్‌సీయూ భూముల స్కామ్‌లపై ఆధారాలతో ఫిర్యాదు చేసినా కేంద్రం చర్యలు తీసుకోవడం లేదని ఆయన ప్రశ్నించారు.తెలంగాణకు ద్రోహం చేయడంలో బీజేపీ, కాంగ్రెస్‌లు రెండూ ఒకటేనని కేటీఆర్ అన్నారు.బీజేపీ తెలంగాణకు తీరని అన్యాయం చేసిందని పేర్కొన్నారు. లక్షల ఉద్యోగాలు కల్పించే ఐటీఐఆర్ ప్రాజెక్టును బీజేపీ రద్దు చేసిందని, హైదరాబాద్‌లోని డిఫెన్స్ కారిడార్‌ను కాదని బుందేల్‌ఖండ్‌కు తరలించిందని ఆరోపించారు. కేన్స్, మైక్రాన్ వంటి సంస్థల రూ. 10 వేల కోట్లకు పైగా పెట్టుబడులను కూడా గుజరాత్‌కు తరలించారని ఆయన వివరించారు. పారిశ్రామిక రంగంలో అన్యాయం, విద్యా, సాగునీటి రంగాల్లో బిజెపి తీవ్ర మోసం చేసిందన్నారు. తెలంగాణకు ఒక్క నవోదయ పాఠశాల, మెడికల్ కాలేజీ, ఐఐఎం వంటి విద్యా సంస్థలను కూడా బీజేపీ ఇవ్వలేదని కేటీఆర్ గుర్తు చేశారు. అలాగే, పసుపు బోర్డును చిన్న రూమ్‌కు పరిమితం చేసిందని, కాళేశ్వరం, పాలమూరు–రంగారెడ్డి ఎత్తిపోతల పథకాలకు జాతీయ హోదా ఇవ్వలేదని అన్నారు. "గత పదేళ్లలో కేసీఆర్ చేసిన పాలనను ప్రజలు మర్చిపోయారు అందుకే ఇప్పుడు యూరియా వంటి సంక్షోభాన్ని ఎదుర్కొంటున్నారు.

## వసతి గృహాల్లో అధికారులు పర్యవేక్షణ చేయాలి

- జయశంకర్ భూపాలపల్లి జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ



జయశంకర్ భూపాలపల్లి బ్యూరో, (జనంసాక్షి): వసతి గృహాల విద్యార్థుల సంక్షేమం, ఆహార నాణ్యత పరిశీలనకు ప్రత్యేక, పోలీస్, క్లస్టర్ అధికారులు పటిష్ట పర్యవేక్షణ చేయాలని జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ కోరారు. సోమవారం ఐడిఓసి కార్యాలయంలో సంక్షేమ శాఖల విద్యార్థుల సంక్షేమం, భోజన నాణ్యత, రక్షణ తదితర అంశాలపై విద్యా, సంక్షేమ శాఖల అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ 61 మంది ప్రత్యేక అధికారులు, మండల ప్రత్యేక అధికారులు, పోలీస్ అధికారులు విద్యార్థుల సమస్యలు తెలుసుకోవడం, ఆహార నాణ్యత పరిశీలన చేయాలని తెలిపారు. మెనూ పాటించకపోయినా, విద్యార్థులను ఇబ్బందులకు గురి చేసినా కఠిన చర్యలకు సిఫారసు చేయాలని, నిష్పక్షపాతంగా వ్యవహరించాలని సూచించారు. విద్యార్థులకు బోధనలోని సృజనాత్మకతతో ప్రయోగాలు చేసి వారిలోని నైపుణ్యాలను వెలికి తీసి సమాజానికి ఉపయోగపడే పౌరులుగా తీర్చి దిద్దాలని చెప్పారు. విద్యార్థులను ఉత్తములుగా తీర్చిదిద్దే కర్తవ్యాన్ని ఉపాధ్యాయులు గౌరవంగా భావించాలని, వారిలో ఉన్న ప్రతిభను వెలికి తీయడమే నిజమైన ఉపాధ్యాయ ధర్మమని పేర్కొన్నారు. గురువులు తమ బోధన విధానంలో కొత్త పద్ధతులు, సరికొత్త ఆవిష్కరణలను అవలంబించి విద్యార్థుల అభ్యసన సామర్థ్యాలను ఉపయోగకరంగా తీర్చిదిద్దాలని అన్నారు. విద్యార్థుల భవిష్యత్తు మీద ప్రయోగాలు చేయడం ప్రమాదకరమని, వారికి మానసిక, శారీరక, విద్యా పరమైన పరిపూర్ణతను అందించడంలో ఉపాధ్యాయులు కీలక పాత్ర పోషించాలన్నారు. ఇటీవల జిల్లాలో జరిగిన సంఘటనల పట్ల విద్యార్థుల ఆరోగ్య పరిరక్షణ, ఆహార భద్రతకు చర్యలు చేపట్టామన్నారు. హాస్టళ్లకు ప్రత్యేక అధికారులను ఇప్పటికే నియమించామని వారితో పాటు పోలీస్ పర్యవేక్షణను పెంచి భద్రతా చర్యలను కట్టుదిట్టం చేయాలని ఆదేశించారు. క్లస్టర్ అధికారులు విస్తృతంగా తనిఖీలు నిర్వహించి విద్యార్థుల ఆరోగ్య భద్రతను కాపాడాలని సూచించారు. జిల్లాలోని అన్ని వసతి గృహాలు, విద్యాసంస్థల్లో ఆహారం, మంచినీటి నాణ్యతపై కఠిన పర్యవేక్షణ కొనసాగుతుందని జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ స్పష్టం చేశారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్లు అశోక్ కుమార్, విజయలక్ష్మి, డీఈఓ రాజేందర్, ఆర్డీఓ రవి, మండల ప్రత్యేక అధికారులు పాల్గొన్నారు.

## జూబ్లీహిల్స్‌లో రూ.100 కోట్ల విలువైన భూమికి విముక్తి

- 2 వేల గజాల స్థలాన్ని కాపాడిన హైడ్రా



హైదరాబాద్, ఆగస్టు 25 (జనంసాక్షి) : జూబ్లీహిల్స్ చెక్‌పోస్టుకు చేరువలో.. ప్రధాన రహదారికి ఆనుకుని.. ఆక్రమణలకు గురైన భూమిని హైడ్రా కాపాడింది. 2 వేల చదరపు గజాల విస్తీర్ణంలో ఉన్న ఈ భూమి విలువ దాదాపు రూ. 100 కోట్లవరకూ ఉంటుంది. రెండు దశాబ్దాలుగా అక్రమార్కుల చేతిలో కబ్జా అయిన భూమికి హైడ్రా సోమవారం విముక్తి కల్పించింది. జూబ్లీహిల్స్ కోపరేటివ్ హౌసింగ్ సొసైటీకి సంబంధించిన ఈ భూమి లే ఔట్ ప్రకారం ప్రజావసరాలకు ఉద్దేశించినది. అయితే పిల్లా సత్యనారాయణ అనే వ్యక్తి ఆక్రమించి.. ఫేక్ ఇంటి నంబరు క్రియేట్ చేసి అందులో నర్సరీ నడుపుతున్నాడు. ఈయనపై జూబ్లీహిల్స్ పోలీసు స్టేషన్లో కేసు కూడా నమోదైంది. జీహెచ్ ఎంసీ పలుమార్లు స్వాధీనం చేసుకునే ప్రయత్నం చేసింది. ఆక్రమణకు పాల్పడిన సత్యనారాయణ హైకోర్టును ఆశ్రయించాడు. కోర్టును కూడా తప్పుదోవ పట్టించి స్టేటస్‌కో కూడా తెచ్చుకున్నాడు. స్టేటస్‌కో ఉంటుండగా.. అక్కడ ఎలాంటి నిర్మాణాలు చేపట్టరాదు... నర్సరీ నడపరాదు. కాని.. అక్కడ అనుమతి లేని షెడ్డుల నిర్మాణాలు, నర్సరీ వ్యాపారాన్ని నిర్వహించారు.

### ప్రజావాణిలో ఫిర్యాదు మేరకు..

జూబ్లీహిల్స్ కోపరేటివ్ హౌసింగ్ సొసైటీ ఈ అవకతవకలపై హైడ్రా ప్రజావాణిలో ఫిర్యాదు చేసింది. హైడ్రా కమిషనర్ శ్రీ ఏవీ రంగనాథ్‌గారి ఆదేశాలతో హైడ్రా అధికారులు పూర్తి స్థాయి విచారణ చేపట్టారు. లే ఔట్ ప్రకారం ప్రజావసరాలకు ఉద్దేశించిన స్థలంగా నిర్ధారించారు. నర్సరీ నడుపుతున్న సత్యనారాయణకు నోటీసులు హైడ్రా ఇచ్చింది. ఈ నోటీసులపై తిరిగి హైకోర్టును ఆశ్రయించిన సత్యనారాయణకు అక్కడ చుక్కెదురైంది. గతంలో ఉన్న స్టేటస్‌కోను కూడా కొట్టేసి.. హైడ్రా తీసుకోబోయే చర్యలకు హైకోర్టు అనుమతిచ్చింది. కోర్టు ఆదేశాలతో సోమవారం ఉదయం జూబ్లీహిల్స్‌లో కూల్చివేతలు హైడ్రా చేపట్టింది. నర్సరీలో మొక్కలను తరలించుకునేందుకు అవకాశం ఇచ్చి.. అక్కడ షెడ్డులతో పాటు ఆక్రమణలను తొలగించింది. దీంతో 2000 గజాల స్థలంలో హైడ్రా కాపాడినట్టు పేర్కొంటూ బోర్డులు పెట్టింది. జూబ్లీహిల్స్ కోపరేటివ్ హౌసింగ్ సొసైటీ అధ్యక్షులు రవీంద్రనాద్‌తో పాటు.. పాలకమండలి సభ్యులు సంతోషం వ్యక్తం చేశారు. సుదీర్ఘంగా తాము చేస్తున్న న్యాయపోరాటం ఫలించిందని పేర్కొన్నారు. రూ. వంద కోట్ల ల్యాండ్ ను కబ్జా దారుల నుంచి విడిపించినందుకు తెలంగాణ ప్రభుత్వానికి , హైడ్రా కమిషనర్ శ్రీ రంగనాద్ గారితో పాటు.. జీహెచ్‌ఎంసీ అధికారులకు సొసైటీ ప్రెసిడెంట్ తో పాటు పాలకమండలి సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

## వన్యప్రాణుల వేటగాళ్ల అరెస్టు

- మాంసం స్వాధీనం



ఆదిలాబాద్ ప్రతినిధి (జనంసాక్షి) : జిల్లా అడవుల్లో ఉన్న వన్యప్రాణులను ఎవరైనా వేటాడితే అటువంటి వారిపై కఠిన చర్యలు తప్పవని ఆదిలాబాద్ ఎఫ్‌డీఓ చిన్న విశ్వనాథ్ భూషరెడ్డి అన్నారు. ఇటీవలే జిల్లాకు కొత్తగా వచ్చిన ఎఫ్ డీ ఓ చిన్న విశ్వనాథ్ భూషరెడ్డి సోమవారం జిల్లాలో వన్యప్రాణులను వేటాడి మాంసాన్ని అమ్ముకుంటున్న వ్యక్తులను పట్టుకున్నారు. ఈ మేరకు జిల్లా కేంద్రంలోని ఢీ ఎఫ్ ఓ కార్యాలయంలో ఆమె మాట్లాడుతూ జిల్లాలోని బోరజ్ మండలం లోని గిమ్మ గ్రామ శివారు మహారాష్ట్ర అటవీ ప్రాంతంలో గిమ్మకు చెందిన రాథోడ్ సందీప్, జెనథ్ కు చెందిన సంజీవ్ మహారాష్ట్ర కు చెందిన నిలేశ్ రోషన్ అనే వేటగాళ్ల కలిసి మహారాష్ట్ర అటవీ ప్రాంతంలో 4నెమళ్ళు, ఒక జింక ను వేటాడి వాటి మాంసాన్ని బోరజ్ లో విక్రయిస్తున్నట్లు తమకు సమాచారం అందిందన్నారు. వెంటనే ఎఫ్ఆర్‌వో గులాబ్ సింగ్ ఇంకా సిబ్బందితో కలిసి అక్కడికి చేరుకుని మాంసం అమ్ముతున్న నిందితులను పట్టుకోవడం జరిగిందన్నారు. కార్యక్రమంలో అటవీ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

## మహేష్ బిగాలను కలిసిన బీఆర్ఎస్ ఎన్ఆర్ఐ సౌత్ ఆఫ్రికా టీమ్



హైదరాబాద్, 2025 ఆగస్ట్ 25 (జనంసాక్షి) : బీఆర్ఎస్ ఎన్ఆర్ఐ సౌత్ ఆఫ్రికా కోర్ టీమ్ హైదరాబాద్‌లో బీఆర్ఎస్ ఎన్ఆర్ఐ కోఆర్డినేటర్ మహేష్ బిగాలను కలిసింది. భేటీలో విష్ణు జయ్ గుండా, శ్రీధర్ రెడ్డి అగ్గనగారి, వెంకట్రావు తల్లపల్లి తదితర కోర్ టీమ్ సభ్యులు పాల్గొన్నారు. ఈ సమావేశంలో బీఆర్ఎస్ ఎన్ఆర్ఐ సౌత్ ఆఫ్రికా టీమ్ 7 సంవత్సరాల సేవా ప్రయాణాన్ని వివరించింది. సౌత్ ఆఫ్రికాలోని ప్రవాస తెలంగాణీతులకు సేవ, సాంస్కృతిక కార్యక్రమాలు మరియు సామాజిక సేవా కార్యక్రమాల విజయవంతమైన ఘట్టాలను టీమ్ సమీక్షించింది. మహేష్ బిగాల ఈ భేటీలో బీఆర్ఎస్ ఎన్ఆర్ఐ సౌత్ ఆఫ్రికా అధ్యక్షుడు గుర్రాల నాగరాజు నేతృత్వంలోని కోర్ కమిటీ టీమ్ కృషిని అభినందించారు. భవిష్యత్తులో సౌత్ ఆఫ్రికాలో మరింత ఉత్సాహంతో, విస్తృతంగా సేవా కార్యక్రమాలు కొనసాగించాలని సూచించారు. అదనంగా, మహేష్ బిగాల గారు ప్రతీ టీమ్ సభ్యుని ప్రత్యేకంగా అభినందించారు. తదుపరి కార్యక్రమాలపై చర్చలో, రాబోయే రోజుల్లో సౌత్ ఆఫ్రికాలో చేపట్టనున్న కార్యక్రమాలపై సమీక్ష జరిగింది. అలాగే, 25వ వార్షికోత్సవాలను పురస్కరించుకొని కేటీఆర్ సందర్శనకు సంబంధించి ప్రణాళికలు చర్చకు వచ్చాయి. భేటీ సందర్భంగా, కోర్ కమిటీ సభ్యులు మహేష్ బిగాల గారికి అన్ని సహకారాలకు ధన్యవాదాలు తెలియజేశారు, మరియు రాబోయే రోజుల్లో సేవా కార్యక్రమాలను మరింత సమర్థవంతంగా కొనసాగించేందుకు ప్రణాళికలు రూపొందించారు.

## కొనసాగుతున్న యూరియా పడిగాపులు

నల్గొండ, ఆగస్ట్25 (జనంసాక్షి) : ఉమ్మడి నల్గొండ జిల్లా వ్యాప్తంగా యూరియా కోసం రైతులు పడిగాపులు కాస్తున్నారు. గత పక్షం రోజులుగా ఇదే పరిస్తితి ఉంది. దీంతో రైతులు మండిపడుతున్నారు. పంపిణీ కేంద్రాల వద్ద తెల్లవారుజాము నుంచే బారులు తీరారు. త్రిపురాంతకం, శాలిగౌరారం పీఏసీఎస్‌ల వద్ద క్యూలైన్లలో ఆధార్ కార్డులు, చెప్పులుపెట్టి నిరీక్షిస్తున్నారు. మరోవైపు సూర్యాపేట జిల్లా అనంతగిరిలో ఉదయం 5 గంటల నుంచే రైతులు క్యూ కట్టారు. పలు కేంద్రాల వద్ద ఉద్రిక్త వాతావరణం నెలకొనడంతో పోలీసులు పహారా కాస్తున్నారు. ఆయా జిల్లాల కలెక్టర్లు ఎప్పటికప్పుడు పరిస్థితిని సమీక్షిస్తున్నారు. ప్రతి రైతుకూ యూరియా బస్తాలు అందేలా చర్యలు చేపడుతున్నారు.

## ఉల్లి లారీ బోల్తా.. ట్రాఫిక్ జామ్



సంగారెడ్డి, ఆగస్ట్25 (జనంసాక్షి) : సంగారెడ్డి జిల్లా ఇస్నాపూర్ శివారులో ఉల్లిగడ్డ లోడుతో వెళ్తున్న లారీ బోల్తాపడింది. దీంతో ముంబై జాతీయ రహదారిపై ఆరు కిలోమీటర్ల మేర వాహనాలు నిలిచిపోయాయి. ఆదివారం రాత్రి ఉల్లిలోడుతో వెళ్తున్న లారీ ఇస్నాపూర్ వద్ద అదుపుతప్పి నేషనల్ హైవేపై డివైడర్‌ను ఎక్కించడంతో బోల్తాపడింది. దీంతో లారీలోని ఉల్లి బస్తాలు రహదారిపై పడిపోయాయి. సోమవారం మధ్యాహ్నం అవుతున్నప్పటికీ లారీని అక్కడి నుంచి తీయలేదు. మరోవైపు రోడ్డు విస్తరణ పనులు జరుగుతుండటంతో రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. వాహనాలు నిదానంగా కదులుతుండటంతో ఓ అంబులెన్స్ ట్రాఫిక్‌లో చిక్కుకుపోయింది. వాహనదారులు, యువత కలిసి డివైడర్‌పై నుంచి అంబులెన్స్‌ను రోడ్డు దాటించడంతో అది వెళ్లిపోయింది.

## నేషనల్ అవార్డుకు ఎంపికైన ఆదర్శ ప్రిన్సిపాల్ కరస్పాండెంట్




కాటారం ఆగస్టు 25 (జనంసాక్షి) : మండలకేంద్రంలోని ఆదర్శ హైస్కూల్ కరస్పాండెంట్ జనగామ కార్తీక్ రావు, ప్రిన్సిపాల్ జనగామ కృషితలు డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ నేషనల్ అవార్డ్ లను అందుకున్నారు. హైదరాబాదులో నిర్వహించిన ఎడ్యుటెక్ ఎక్స్ పో - 2025 కార్యక్రమంలో ప్రముఖుల చేతుల మీదుగా నేషనల్ ప్రిన్సిపాల్ అవార్డ్స్ ను కార్తీక్ రావు, కృషితలకు ప్రధానం చేశారు. అనంతరం ఎడ్యు ఎక్స్ పో కార్యక్రమంలో విద్యా రంగంలో వస్తున్న నూతన ఆవిష్కరణలు, ఏఐ ఇంటిగ్రేషన్ పై శిక్షణ తీసుకున్నారు. ఈ సందర్భంగా కరస్పాండెంట్ కార్తీక్ రావు మాట్లాడుతూ.. గ్రామీణ ప్రాంతంలో గత 36 సంవత్సరాలుగా ఉత్తమ విద్యా సేవలను అందిస్తూ ఎంతోమంది విద్యార్థులను ఉన్నత స్థాయిలో నిలిచేలా చేస్తున్న కృషిని గుర్తించి ప్రతిష్టాత్మకమైన సర్వేపల్లి రాధాకృష్ణన్ నేషనల్ అవార్డును ఇవ్వడం గర్వకారణమన్నారు. ఆదర్శలో 21వ సెంచరీ స్కిల్స్, ఆధునిక విద్య విధానాలు, ఉత్తమ విద్యతో పాటు క్రమశిక్షణ తో అత్యుత్తమ ఫలితాలు సాధించేలా విద్యార్థులను తీర్చిదిద్దడం జరుగుతుందన్నారు. కరస్పాండెంట్ కార్తీక్ రావు, ప్రిన్సిపాల్ కృషితలు నేషనల్ అవార్డ్స్ అందుకోవడం పట్ల ఆదర్శ విద్యాసంస్థల చైర్మన్ జనగామ కరుణాకర్ రావు, ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు, విద్యావేత్తలు హర్షం వ్యక్తం చేశారు.

## బెంగళూరు బేకరీలో కాలం చెల్లిన కేకుల విక్రయం

- కేక్ తిన్న వారికి తీవ్ర అస్వస్థత



తొర్రూరు, ఆగస్టు 25 (జనంసాక్షి) : తొర్రూరు పట్టణ కేంద్రంలోని బెంగుళూరు అయ్యంగార్ బేకరీ సిబ్బంది లాభాల కోసం ఎంతవరకు దిగజారతారో మరోసారి బయటపడింది. కాలం చెల్లిన కేకులు బూజు పట్టినా వాటిని ఎలాంటి జాగ్రత్తలు లేకుండా విక్రయించడం స్థానికులను భయభ్రాంతులకు గురిచేస్తోంది. ఆదివారం సాయంత్రం ఓ కుటుంబం పెళ్లిరోజు సందర్భంగా బేకరీలో కొనుగోలు చేసిన కేక్ తిని ప్రజలు వాంతులు, విరేచనాలతో తీవ్ర అస్వస్థతకు గురయ్యారు. బాధితులను వెంటనే దగ్గరలోని ఆసుపత్రికి తరలించగా, వైద్యులు కాలం చెల్లిన ఆహారం వల్లే ఫుడ్ పాయిజనింగ్ లక్షణాలు కనిపిస్తున్నాయి అని తేల్చారు. ఈ సంఘటనతో పట్టణంలో కలకలం రేగింది. కుటుంబ సభ్యులు బేకరీపై గొడవకి దిగారు. దీంతో అక్కడ తీవ్ర ఉద్రిక్త వాతావరణం నెలకొంది. ఒకవైపు బేకరీలు పేరుకు బ్రాండ్లతో మోసం చేస్తుంటే.. లోపల మాత్రం నాసిరకం పదార్థాలతో ప్రజల ప్రాణాలతో చెలగాట మాడుతున్నారు, అంటూ స్థానికులు మండిపడుతున్నారు. కాలం చెల్లిన పదార్థాలను దాచిపెట్టి అమ్మడం ఎంత నిర్లక్ష్యమో అధికారులు గమనించాలని డిమాండ్ చేస్తున్నారు. సాధారణ పౌరుడు తన పిల్లల కోసం కేక్ కొనుక్కుంటే.. అది ప్రాణానికి ముప్పుగా మారడం ఏమిటి..? ఇలాంటి సంఘటనలు ఆగాలంటే సంబంధిత అధికార విభాగం వెంటనే బేకరీపై దాడులు చేసి, శాంపిల్స్ సేకరించి, కఠిన చర్యలు తీసుకోవాలి అని ప్రజలు గళమెత్తుతున్నారు. ఈ ఘటనతో తొర్రూరు పట్టణంలో పెద్ద ఎత్తున చర్చ జరుగుతోంది. చిన్నపిల్లల నుండి పెద్దవారివరకు బేకరీ ఉత్పత్తులు తరచుగా తీసుకుంటారు. అలాంటప్పుడు ఇలాంటివి బయటపడటం ప్రజలను మరింత భయాందోళనలకు గురిచేస్తోంది.

## అనుమతిలేని కేబుల్ వైర్లు తొలగించొచ్చు: హైకోర్టు

హైదరాబాద్(జనంసాక్షి): విద్యుత్ స్తంభాలపై ఇంటర్నెట్, కేబుల్ వైర్ల తొలగింపుపై సోమవారం హైకోర్టు విచారణ చేపట్టింది. ఇటీవల రామంతాపూర్ విద్యుత్ ప్రమాద ఘటనలో ఐదుగురు ప్రాణాలు కోల్పోయిన సంగతి తెలిసిందే. విద్యుత్ స్తంభాలపై ఉన్న కేబుళ్ల వల్లనే ప్రమాదం చోటు చేసుకున్నట్లు పోలీసులు ప్రాథమికంగా నిర్ధారించారు. ఈ క్రమంలో జీహెచ్‌ఎంసీ వ్యాప్తంగా విద్యుత్ స్తంభాలపై ఉన్న కేబుళ్లను సిబ్బంది తొలగిస్తున్నారు. దీంతో ఎయిర్‌టెల్ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేసింది. అనుమతి తీసుకున్న కేబుళ్లను సైతం తొలగిస్తున్నారని సంస్థ తరఫు న్యాయవాది కోర్టుకు వివరించారు. ఏయే స్తంభాలకు అనుమతి తీసుకున్నారో చూపించాలని టీజీఎస్పీడీసీఎల్ తరఫు న్యాయవాది కోరారు. వాదనలు విన్న ధర్మాసనం అనుమతిలేని కేబుళ్లను తొలగించొచ్చని ఆదేశించింది. తదుపరి విచారణను వాయిదా వేసింది.

## గత ప్రభుత్వ హయాంలో 60 మంది ఎమ్మెల్యేల ఫిరాయింపు

- అప్పుడు కేటీఆర్‌కు పార్టీ ఫిరాయింపుల నిరోధక చట్టం గుర్తుకురాలేదా?
- ఎంపి చామల కిరణ్‌కుమార్‌రెడ్డి



హైదరాబాద్ (జనంసాక్షి) : బిఆర్‌ఎస్ అధికారంలో ఉన్న పదేళ్ళలో వేర్వేరు పార్టీల నుంచి అరవై మంది ఎమ్మెల్యేలు ఫిరాయింపులకు పాల్పడ్డారని కాంగ్రెస్ ఎంపి చామల కిరణ్‌కుమార్ రెడ్డి తెలిపారు. అప్పుడు బిఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కె. తారక రామారావు ఆ ఎమ్మెల్యేలతో రాజీనామా ఎందుకు చేయించలేదని ఎంపి కిరణ్‌కుమార్ రెడ్డి సోమవారం విలేకరుల సమావేశంలో ప్రశ్నించారు. పార్టీ ఫిరాయింపుల నిరోధక చట్టం గురించి కెటిఆర్‌కు అప్పుడు తెలియదా? అని అన్నారు. హైదరాబాద్‌లో ఎక్కువ మంది ఎమ్మెల్యేలు బిఆర్‌ఎస్ తరఫున గెలుపొందినా, పార్లమెంటు ఎన్నికల్లో సున్నా వచ్చిందన్నారు. కంటోన్మెంట్‌లో మూడో స్థానంలో బిఆర్‌ఎస్ నిలిచిందని ఆయన తెలిపారు. హైదరాబాద్‌ను బిఆర్‌ఎస్ అధినేత, మాజీ ముఖ్యమంత్రి కె. చంద్రశేఖర్ రావు కనుగొన్నట్లు మాజీ మంత్రి కెటిఆర్ మాట్లాడుతున్నారని ఆయన విమర్శించారు. కెసిఆర్ హయాంలో నాలుగు ఫ్లైవోవర్లు, దుర్గం చెరువుపై కేబుల్ బ్రిడ్జి తప్ప సాధించింది ఏమీ లేదని ఆయన విమర్శించారు. బిసిలకు 42 శాతం రిజర్వేషన్లు పార్టీ పరంగా ఇస్తామని కెటిఆర్ ప్రకటించగలరా? అని ఆయన ప్రశ్నించారు.

## సత్యాగ్రహ దీక్షకు జాగృతి సంఘీభావం



హైదరాబాద్ (జనంసాక్షి) : బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించిన తర్వాతే తెలంగాణలో స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలని కోరుతూ బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు ఆర్.కృష్ణయ్య చేపట్టిన సత్యాగ్రహ దీక్షకు తెలంగాణ జాగృతి పక్షాన సంపూర్ణ మద్దతు ప్రకటిస్తున్నాం అని ఎమ్మెల్సీ కవిత ప్రకటించారు. ఈ మేరకు సోషల్ మీడియా వేదికగా ప్రకటన విడుదల చేశారు. 'బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించాలన్న చిత్తశుద్ధి రాష్ట్ర ప్రభుత్వానికి లేదని ప్రభుత్వ పెద్దల చర్యలను బట్టి స్పష్టమవుతున్నది. అసెంబ్లీ, కౌన్సిల్‌లో బిల్లులు పాస్ చేయడం మినహా 42 శాతం రిజర్వేషన్ల అమలు కోసం రాజ్యాంగబద్ధంగా, రాజకీయంగా ఉన్న ఏ ఒక అవకాశాన్ని రాష్ట్ర ప్రభుత్వం ఉపయోగించుకోలేదు. ప్రధాని వద్దకు అఖిలపక్షాన్ని తీసుకెళ్లలేదు.. అసలు ప్రధాని అపాయింట్మెంట్ కూడా కోరలేదు.. గవర్నర్‌ను కలిసి ఆర్డినెన్స్ జారీ చేయాలని విజ్ఞప్తి చేయలేదు. కేంద్ర ప్రభుత్వం బీసీ బిల్లులను కోల్డ్ స్టోరేజీలో పెడితే న్యాయపోరాటం చేయలేదు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించకుండా స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహిస్తే బీసీలు ఈ ప్రభుత్వానికి, కాంగ్రెస్ పార్టీకి తగిన గుణపాఠం చెప్పడానికి సిద్ధంగా ఉన్నారు' అని ప్రకటనలో కవిత పేర్కొన్నారు.

## పర్యావరణానికి అనుకూలమైన మట్టి విగ్రహాలనే పూజించాలి

- వరంగల్ జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద



వరంగల్ ప్రతినిధి, ఆగస్టు 25 (జనంసాక్షి): నవరాత్రి ఉత్సవాల్లో మట్టి విగ్రహాలనే పూజించాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద సూచించారు. కలెక్టరేట్లో సోమవారం మట్టి గణపతి విగ్రహాలను పూజించాలనే పోస్టర్‌ను ఆవిష్కరించి, అధికారులకు, ఉద్యోగులకు మట్టి గణపతులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. పర్యావరణానికి అనుకూలమైన మట్టి విగ్రహాలను ఏర్పాటు చేసుకుని పర్యావరణాన్ని కాపాడుకునే బాధ్యత మన అందరిపై ఉందన్నారు. అవగాహన కార్యక్రమంలో భాగంగా బస్ స్టాపులు, జనసంచారం ఎక్కువగా ఉన్న ప్రదేశాలలో వాల్ పోస్టర్లను ప్రదర్శన చేయాలని తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా ఈ కార్యక్రమంలో భాగంగా 8 అంగుళాల మట్టి గణపతులను అందించి పర్యావరణం పై పెద్ద ఎత్తున అవగాహన కార్యక్రమాలు తెలంగాణ కాలుష్య నియంత్రణ మండలి నిర్వహిస్తున్నదని కలెక్టర్ తెలిపారు. ప్లాస్టర్ ఆఫ్ ప్యారిస్, ఇతర రసాయనిక రంగులతో రూపొందించిన విగ్రహాల కారణంగా జల వనరులు కలుషితం అయ్యే ప్రమాదం ఉందన్నారు. ప్రజలందరూ మట్టి గణపతులను ప్రతిష్టించి, పర్యావరణ పరిరక్షణకు దోహదపడాలని పిలుపునిచ్చారు. తెలంగాణ కాలుష్య నియంత్రణ మండలి ఆధ్వర్యంలో రెండు వేల మట్టి గణపతులను అందించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్‌లు సంధ్యారాణి, డిఆర్ ఓ విజయలక్ష్మి, జెడ్పి సీఈఓ రామిరెడ్డి, కాలుష్య నియంత్రణ మండలి ఈ ఈ సునీత, జిల్లా అధికారులు, తదితరులు పాల్గొన్నారు.




## బీజేపీ బిల్లు... భ్రష్టాచార నిర్మూలనకా?
# విపక్షాలపై కుట్రలో భాగమా !?

భారత రాజకీయ చరిత్రలో మరో వివాదాస్పద అధ్యాయానికి తెరవబడింది. ఆగస్టు 20, 2025న లోక్‌సభలో కేంద్ర హోంమంత్రి అమిత్ షా ప్రవేశపెట్టిన మూడు బిల్లులు - కాన్‌స్టిట్యూషన్ (130వ సవరణ) బిల్, యూనియన్ టెరిటరీస్ (సవరణ) బిల్, జమ్మూ కాశ్మీర్ రీఆర్గనైజేషన్ (సవరణ) బిల్ - దేశవ్యాప్తంగా తీవ్ర చర్చలకు దారితీశాయి. ఈ బిల్లుల ప్రకారం, ప్రధానమంత్రి, ముఖ్యమంత్రులు, కేంద్ర లేదా రాష్ట్ర మంత్రులు తీవ్రమైన నేర ఆరోపణలపై (కనీసం ఐదేళ్ల శిక్ష విధించదగినవి) అరెస్టై 30 రోజులు కస్టడీలో ఉంటే, 31వ రోజు నుంచి వారు తమ పదవిని కోల్పోతారు. బెయిల్ లభించినా లేదా తర్వాత నిర్దోషులుగా తేలినా,ఆ 30 రోజుల కస్టడీ సమయంలో పదవి కోల్పోవడం తప్పదు. ప్రభుత్వం దీన్ని భ్రష్టాచార నిర్మూలనకు, రాజకీయ అపరాధాలను అరికట్టడానికి ఒక చారిత్రక చర్యగా చిత్రీకరిస్తోంది. కానీ, విమర్శకులు, విపక్షాలు దీన్ని రాజకీయ కక్ష సాధింపు చర్యగా, ప్రజాస్వామ్యాన్ని దెబ్బతీసే ప్రయత్నంగా చూస్తున్నారు.

ఈ బిల్లుల పూర్వాపరాలు 2014లో బీజేపీ అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ఈ కుట్రల ప్రయత్నాలు మొదలయ్యాయి. మోదీ ప్రభుత్వం భ్రష్టాచార నిర్మూలనను తన ప్రధాన అజెండాగా చెప్పుకుంటూ వచ్చింది. 'నా ఖావుంగా, నా ఖానే దూంగా' అని మోదీ పదేపదే ప్రకటించారు. అందు కోసమే, గత దశాబ్ద కాలంలో విపక్ష నాయకులపై ఈడీ, సీబీఐ వంటి కేంద్ర దర్యాప్తు సంస్థలను దుర్వినియోగం చేస్తూ దాడులు, అరెస్టులు చేసి వేధింపులకు గురి చేయడం పెరిగింది. ఈ కక్ష సాధింపుల నేపథ్యంలో ఢిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్, ఝూరండ్ మాజీ ముఖ్యమంత్రి హేమంత్ సోరెన్ వంటి విపక్ష నాయకులు అరెస్టై జైలు పాలయ్యారు. 2014 నుంచి 2025 వరకు, 12 మంది విపక్ష మంత్రులు అరెస్టై 30 రోజులకు మించి జైల్లో ఉన్నారు. అందులో ఎక్కువ మంది సీబీఐ, ఈడీ చేతిలోనే అరెస్టులు జరిగాయి. ఆసక్తికరంగా, బీజేపీ లేదా ఎన్డీఏ మంత్రులు ఇలాంటి అరెస్టులు ఎదుర్కోలేదు.

ఈ బిల్లు ఇప్పుడు వచ్చిన నేపథ్యం 2024 ఎన్నికల్లో బీజేపీ మెజారిటీ కోల్పోయి, చంద్రబాబు నాయుడు, నితీష్ కుమార్ ఊతం కాళ్ళ సహకారంతో ఎన్.డీ.ఏ. కూటమి సహాయంతో అధికారంలో ఉండటం. విపక్షాలు బలపడటంతో, రాష్ట్ర ప్రభుత్వాలను అస్థిరపరచడానికి ఈ బిల్లును ఆయుధంగా ఉపయోగించవచ్చని విమర్శలు వెల్లువెత్తాయి.

**బిల్లు లక్ష్యాలు :**

భ్రష్టాచార ఆరోపణలతో జైల్లో ఉన్న నాయకులు ప్రభుత్వాన్ని నడపకుండా చేయడం.కేంద్ర ప్రభుత్వం దీన్ని ప్రజలకు మేలు చేసే చర్యగా చూపిస్తోంది. మోదీ ఆగస్టు 22న బీహార్ ర్యాలీలో మాట్లాడుతూ, "జైలు నుంచి ప్రభుత్వం నడపడం సరికాదు" అని అన్నారు. కానీ, విమర్శకులు దీన్ని 'ప్రిసమ్షన్ ఆఫ్ ఇన్నోసెన్స్' సూత్రానికి వ్యతిరేకంగా చూస్తున్నారు. నేరం నిరూపణ కాకముందే పదవి కోల్పోవడం ప్రజాస్వామ్య విరుద్ధం. రాహుల్ గాంధీ దీన్ని "మధ్యయుగాల రాజు ఇష్టానుసారం తొలగింపు"గా వర్ణించారు. ఫెడరల్ నిర్మాణాన్ని దెబ్బతీస్తుందని అసదుద్దీన్ ఒవైసీ వంటి నాయకులు గట్టీగా వాదిస్తున్నారు. ఎందుకంటే రాష్ట్రాల్లో చట్టబద్ధ పాలన రాష్ట్ర ప్రభుత్వాల బాధ్యత.కానీ, ఈ బిల్లు కేంద్రానికి ఒక హక్కుగా ఇస్తుంది.

విపక్షాలు ఈ బిల్లును తీవ్రంగా వ్యతిరేకిస్తున్నాయి. కాంగ్రెస్, టీఎంసీ, ఏఏపీ వంటి పార్టీలు దీన్ని "డ్రాకోనియన్" చట్టంగా ముద్రవేస్తున్నాయి. లోక్‌సభలో బిల్లు ప్రవేశపెట్టినప్పుడు విపక్ష సభ్యులు కాపీలు చించి ఉండలు చుట్టి అమిత్ షా ముఖంపై విసిరారు. ఇది ప్రజాస్వామ్యాన్ని హరించే ప్రయత్నమని ఆరోపిస్తూ తమ నిరసన వ్యక్తం చేశారు.

కేసీ వేణుగోపాల్ వంటి నాయకులు అమిత్ షా 2010లో అరెస్టైన సందర్భాన్ని ప్రస్తావిస్తూ, "అప్పుడు మీరు నైతికత పాటించారా?" అని ప్రశ్నించారు. అమిత్ షా ముందుగానే రాజీనామా చేశానని సమాధానమిచ్చారు, కానీ ఇది విపక్షాలకు సంతృప్తిని ఇవ్వలేదు. ఇండియా బ్లాక్ నాయకులు దీన్ని విపక్షాలను అణచివేయడానికి మోదీ ప్రభుత్వం చేస్తున్న కుట్రగా చూస్తున్నారు. మేధావులు, పత్రికలు, మీడియా కూడా ఈ బిల్లుపై తీవ్రంగా స్పందిస్తున్నాయి. అల్ జజీరా వంటి అంతర్జాతీయ మీడియా దీన్ని "జైలు నుంచి నాయకులను తొలగించే బిల్లు"గా వర్ణిస్తూ, అధికార దుర్వినియోగానికి అవకాశముందని హెచ్చరిస్తోంది. ది హిందూ, ఇండియా టుడే వంటి పత్రికలు దీన్ని "వెపనైజింగ్ డిస్‌క్వాలిఫికేషన్"గా చూస్తున్నాయి, బీజేపీ అనుకూల గోలీ మీడియా నియంత్రణతో విపక్షాలను భ్రష్టులుగా చిత్రీకరిస్తుందని వాదిస్తున్నాయి.

మేధావి రషీద్ కిద్వాయ్ వంటి వారు దీన్ని బీహార్ ఎన్నికలకు మధ్యతరగతి ఓట్లు సాధించే వ్యూహంగా చూస్తున్నారు. కానీ దీర్ఘకాలంలో దీని దుర్వినియోగం ప్రమాదకరమని అంటున్నారు. ఎకనామిక్ టైమ్స్, మింట్ వంటి పత్రికలు దీన్ని భ్రష్టాచారానికి వ్యతిరేకంగా చూస్తున్నప్పటికీ, విపక్షాలు దీన్ని కేంద్ర సంస్థల దుర్వినియోగానికి ఆయుధంగా మార్చవచ్చని ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి.

ఇక బీజేపీ ఉద్దేశాలపై విమర్శనాత్మకంగా చూస్తే, ఇది భ్రష్టాచార నిర్మూలన కంటే రాజకీయ ఆధిపత్యం సాధించడానికి ఒక సాధనంగా కనిపిస్తుంది. 2024 ఎన్నికల్లో మెజారిటీ కోల్పోయిన బీజేపీ, విపక్ష రాష్ట్రాలను అస్థిరపరచడానికి ఈడీ, సీబీఐలను ఉపయోగిస్తోందని ఆరోపణలు ఉన్నాయి. ఈ బిల్లు ఆ అరెస్టులను మరింత శక్తివంతం చేస్తుంది. నిరూపణ కాకముందే పదవి కోల్పోవడం ద్వారా ప్రభుత్వాలను కూల్చవచ్చు. ఇది ప్రజల ఎంపికను అగౌరవపరచడమే అవుతుంది. బీజేపీ స్వయంగా భ్రష్టాచార ఆరోపణలు ఎదుర్కొన్న నాయకులను రక్షిస్తుండటం (ఉదా: అమిత్ షా కేసు) ద్వంద్వ ధోరణిని చూపిస్తుంది. ఇది హిందుత్వ ఎజెండాతో పాటు అధికారాన్ని కేంద్రీకరించడానికి బీజేపీ ప్రయత్నమని విమర్శకులు అంటున్నారు. సుప్రీంకోర్టు గతంలో కేంద్ర సంస్థల దుర్వినియోగాన్ని ప్రస్తావించిన నేపథ్యంలో, ఈ బిల్లు ప్రజాస్వామ్యాన్ని బలహీనపరుస్తుందని ఆందోళనలు ఉన్నాయి. ఈ బిల్లు భ్రష్టాచార నిర్మూలనకు కొంత మేరకు మేలు చేయవచ్చు. కానీ, దాని అమలు రాజకీయ దురుద్దేశాలతో జరిగితే దేశ ప్రజాస్వామ్యానికే ప్రమాదకరం అవుతుంది.

జాయింట్ కమిటీలో చర్చలు ఎలా సాగుతాయో చూడాలి, కానీ ఇది భారత రాజకీయాల్లో మరో మలుపును సూచిస్తుంది.



డాక్టర్ కోలాహలం రామ్ కిశోర్
9849328496.

# సంచలనంపై నిశ్చల సంకల్పం


నీ గమ్యం 10 కిలోమీటర్లయితే, 12 కిలోమీటర్లకు టార్గెట్ ఫిక్స్ చేసుకో..అని ఉద్యమ కాలంలోనూ, ఆ తర్వాత మొదటి ముఖ్యమంత్రిగానూ కేసీఆర్ పిలుపునిచ్చేవారు. ఆ పిలుపునే కేటీఆర్ పుణికిపుచ్చుకోవాలి. రైతాంగ సమస్యలు సహా వివిధ వర్గాల ప్రజలను స్వయంగా కలిసేందుకు పాదయాత్రకు యోచించాలి. తటపటాయింపులు విడనాడాలి.

గతేడాది డిసెంబర్ 19న కావొచ్చు. ఓ పాపులర్ టీవీ న్యూస్ ఛానెల్ ఇంటర్వ్యూలో "..జైలుకు పోతా, ఫిట్ నెస్ తో వస్తా. పాదయాత్ర చేస్తా.." అని ఒక దశలో కేటీఆర్ తొణికిసలాడే ఉత్సాహంతో చెప్పారు. ఓ వార్షిక క్యాలెండరు మారింది, మరో కొత్త క్యాలెండర్ ఇంకో 4 మాసాల్లో వాడుకలోకి రాబోతుంది. ఆ అరెస్టు మాత్రం ఎలాగూ జరుగడం లేదు. కనీసం పాదయాత్రకైనా అడుగులు పడితే ఫిట్ నెస్ ఆటోమేటిగ్గా సొంతం అవుతుంది. అంతకుమించి పార్టీగా బీఆర్ఎస్ ఫిట్ అయ్యేందుకు, సమస్యలకు కొద్దోగొప్పో పరిష్కారంతో ప్రజల సాంత్వనకు "మార్గం" దొరుకుతుంది. పాదయాత్రతో ప్రజల మధ్య ఉన్నప్పుడు ఒకవేళ జరిగే అరెస్టుకు, ఇంట్లో ఉన్నప్పుడు సంభవించే అరెస్టుకు ప్రభావమంతమైన వ్యత్యాసం ఉంటుందని వేరే చెప్పక్కర్లేదు. జనం మధ్య నుంచి తీసుకెళితే పబ్లిక్ తోపాటు పార్టీ కేడరులో రాజకీయ లబ్ధి ఒనగూరే పాళ్లు మెండుగా ఉంటాయి. ఈ దిశగా ప్రధాన ప్రతిపక్ష పార్టీ భారత రాష్ట్ర సమితి వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీక్షణంగా ఆలోచించాలి. పాదయాత్ర చేసే అవకాశం హరీష్ రావుకు పార్టీ ఇవ్వాలే కానీ, చటుక్కున గడప దాటి రపా రపా నడవగలరు. లేదా ఏక కాలంలో చెరి సగం జిల్లాల్లో పాదయాత్రకు రూట్ మ్యాప్ రచించొచ్చు. సంశయాలు, సందిగ్ధాలకు తావు లేకుండా సం"చలన" నిర్ణయానికి నిశ్చలంగా కేటీఆర్ సంకల్పించాలి. కేసీఆర్ తర్వాత ఆ ముగ్గురిలో ఒకరితో దూరం పార్టీకి పెరుగుతున్న జాడలు చూస్తున్నాం. ఆ గ్యాప్ దరిమిలా కుటుంబంగా వర్తమాన, భవిష్యత్తుల్లో ఎలాగున్నా పార్టీగా మాత్రం సౌకర్యవంతమైన స్పేస్ అంతిమంగా కేటీఆర్ కు సొంతమే!

పార్టీ అధ్యక్షులు, అపోజిషన్ లీడర్ కేసీఆర్ ఎలాగూ ఇప్పటికిప్పుడు క్షేత్ర స్థాయిలో లెగ్ వర్క్ చేయడం డౌటే. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడ్డాక ముఖ్య విపక్షాల పరంగా బీజేపీ పుంజుకోకముందే పాదయాత్రతో రాష్ట్రాన్ని బీఆర్ఎస్ అల్లుకుపోవాలి. ఎలాగూ అధికారంలో కాంగ్రెస్ పెద్దలు కాస్త భుక్తాయాసంతో ఉన్నట్టున్నారు. ఢిల్లీకి వెళ్లిన 52 ట్రిప్పులైనా జిల్లాల్లో తిరగడానికి సమయం దొరకడం లేదు. బహుళ అంచెల భద్రత మధ్య అడపాదడపా బహిరంగ సభలకు మినహా, కొన్ని వందల మందితో చిన్నపాటి సమావేశాలు, సదస్సులతో అత్యంత సమీపంగా ఫీల్డ్ లెవెల్ లో చంద్రబాబు నాయుడు మాదిరిగా ఉండేందుకు ఆసక్తి లేనట్టుంది. సరిగ్గా ఇది కూడా కేటీఆర్ పాదయాత్రకు గొప్ప వెసులుబాటు, అడ్వాంటేజ్ కాగలదు.

**జనాలను కలవరనే అపప్రద పోయేలా పాదయాత్రతో చెరగని ముద్ర**

నాయకులు అంటేనే 365 రోజులూ ప్రజలతో ఉంటారు, ఉండాలి. అదే నాయకత్వ మౌలిక లక్షణం. నాయకులుగా భాసిల్లేందుకు కనీస అర్హత కూడా. ప్రజలను కలవడం, వారితో కలుపుగోలుగా, మమేకమై ఉండడం బీఆర్ఎస్ పెద్దలకు అంతగా ఇష్టం ఉండదనే అపప్రద ముఖ్యంగా అధికారంలో ఉన్నప్పుడే బలంగా ఏర్పడింది. అది నేటికీ ఇంచుమించు అలానే తిష్టవేసింది. అలాంటి అపప్రద తొలగించుకొని, తాము ప్రజలతోనే ఉంటామనే చెరగని ముద్ర పాదయాత్రతో వేయొచ్చు. రైతులు యూరియా కోసం పడరాని పాట్లు పడుతున్నారు. కొన్ని వారాలుగా మాధ్యమాల్లో సమాజం గమనిస్తోంది. ఇలాంటి స్థితిగతుల మధ్య వ్యవసాయదారులకు చేరువ కావొచ్చు. ట్వీట్లు, మీడియా మీట్ల ద్వారానే కాకుండా ఐ టూ ఐ మౌత్ టూ మౌత్ తమ ప్రభుత్వంలో ఎలా సేవలు అందించామో అప్పటికీ, ఇప్పటికీ వ్యత్యాసాలను నేరుగా చెప్పొచ్చు.



నడక యాత్రతో ప్రజల సమస్యలను సేకరించి తగిన ప్రణాళికలకు జీవం పోయొచ్చు.పాదయాత్రలో ప్రజలతో నేరుగా సంభాషణ చేసి, వారి పేదరికం, వ్యవసాయం, ఉపాధి, విద్య, ఆరోగ్యం వంటి ప్రధాన ఇబ్బందులను ముచ్చటించడం సులభం కాగలదు. ప్రతిష్టాత్మకంగా సాంఘిక, సామాజిక ఆస్తుల వద్ద, జల వనరుల వ్యవస్థలు, ఫ్యాక్టరీలు, విద్యా సంస్థలను సందర్శిస్తూ, అక్కడి సాధకబాధకాలపై ప్రభుత్వం, పాలనా యంత్రాంగంలో చలనం తేవొచ్చు. ప్రత్యక్షంగా చూసి పరిష్కార మార్గాలను చర్చించడానికీ పాదయాత్ర తిరుగులేని సాధనం. పాదయాత్ర ఆసాంతం స్థానిక శ్రేణులు, సామాజిక కార్యకర్తలతో సమావేశమై వారి సూచనలను, సలహాలను రికార్డు చేయించవచ్చు. ప్రజా సమస్యలపై పాలకుల్లో సాధ్యమైనంతవరకు నిర్లక్ష్యం తగ్గించి, ప్రత్యక్ష స్పందన తేవొచ్చు. పాదయాత్ర ద్వారా గుర్తించిన ముఖ్య సమస్యలపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల్లో సాధికార నివేదికలతో మేలుకొలుపు కలిగించే సౌలభ్యం ఉంటుంది.

ఇలా ప్రజల సమగ్ర ఆకాంక్షలను ప్రతిబింబించడానికి పాదయాత్ర చక్కని తొవ్వ. స్థానిక ఎన్నికల్లో సత్వర లాభానికీ పాదయాత్ర దోహదం చేస్తుంది. సదరు అసెంబ్లీ స్థానాల్లో ఎలాగూ బైపోల్స్ ఆశలు ఉండనే ఉన్నాయి.సమస్త పార్టీ యంత్రాంగాన్ని బ్రహ్మాండంగా యాక్టివేట్ చేయొచ్చు. బాగా కమాండ్ కూ, నిర్ణయాలకు ఉపయోగం. భవిష్యత్తులో ముఖ్యమంత్రి అయ్యేందుకు గొప్ప నైతిక యోగ్యత సొంతం చేసుకోవచ్చు. ఆపై పాలనా పాలసీలనూ తదనుగుణంగా రూపొందించవచ్చు. అన్నింటికీ మించి గట్టి ఆత్మవిశ్వాసం ఇన్ బిల్ట్ కాగలదు. బీజేపీ వారో, ఇతరులో పాదయాత్రలకు గడప దాటకముందే కేటీఆర్ స్పార్క్ నిర్ణయం తీసుకోవాలి. ఇప్పటి వరకు తెలుగు రాష్ట్రాల చరిత్రలో పాదయాత్ర చేసిన ముఖ్య నేతలు అందరూ రాజకీయంగా లాభపడ్డారే కానీ, నష్టపోలేదు. కనీసం ఈ సూక్ష్మాన్నయినా అండర్ లైన్ చేసుకోవాలి. ప్రస్తుత ప్రభుత్వం ఏర్పడి 20 నెలలే అయింది, ఇంకా 40 మాసాలు ఉన్నాయి కదా అని సరిపుచ్చుకోవడం కంటే...ఇపుడే కాదు, అవసరమైతే సాధారణ ఎన్నికలకు ఏడాది ముందు మరోసారి పాదయాత్రకు పూనుకోవాలి. తద్వారా పార్టీ, నాయకత్వ బేస్ బాగా పటిష్టమవడం తథ్యం.

ఇల్లెందుల దుర్గాప్రసాద్
వ్యాసకర్త:
సీనియర్ ఇండిపెండెంట్ జర్నలిస్టు,
హైదరాబాద్. 9440850384

## రంగులమైకం

హరితకంబళం పుడమికికప్పాలి
పచ్చదనం పరికింపచేయాలి
శ్వేతవర్ణం ప్రసరింపచేయాలి
నిష్కల్మషం తెలియపరచాలి

బులుగువర్ణం నింగికంటాలి
నీలాకాశం నేత్రాలకుచూపాలి
ఎర్రదనం వెదజల్లాలి
అరుణోదయం చేయించాలి

వివిధవర్ణపుష్పవర్షం కురిపించాలి
తేనెచుక్కలతియ్యదనం పంచిపెట్టాలి
సింధూరం చెక్కిళ్ళపై పూయాలి
బిడియం బుగ్గలపై ప్రదర్శించాలి

ఇంద్రాయుధం గగనంలో పొడిపించాలి
సప్తవర్ణాలు తిలకింపచేయాలి
చక్కదనం కూర్చాలి
సంతసం చేర్చాలి

చిలిపితనం చిందాలి
కలికితనం కనపరచాలి
పలుపువ్వులు పూయించాలి
వివిధవర్ణాలు వీక్షింపజేయాలి

కుంచెను చేతపట్టాలి
చిత్తరువులను చిత్రవిచిత్రంగాదిద్దాలి
రంగులమద్యం త్రాగించాలి
హృదులకుమైకం కలిగించాలి

గుండ్లపల్లి రాజేంద్రప్రసాద్

## మా కుక్కలు మిమ్మల్నే కరుస్తున్నయ్

ఒకప్పుడు మా కుక్కలకు
మేము కనబడితే చాలు
పరుగెత్తుకుంటూ ఎదురు వచ్చేవి
ముందటి కాళ్ల తో మా చేతులను,
పట్టుకుని ఎంతో ప్రేమను చూపించేవి.
గెంతుతూ ముద్దుగా ఆహ్వానించేవి
మా ముందు అద్భుతాలు చేసేవి.
వాటి ప్రేమ అనిర్వచనీయం అనిపించేది
అవి చూపించే ప్రేమ ముందు
మేము వేసిన పట్టెడు అన్నం
మాకు చాలా తక్కువగా అనిపించేది.
నిజానికి మేము తినగా
వాటికీ ఇంత అన్నం పెట్టేది
ప్రేమతో బిస్కెట్లు వేసేది
వాటి విశ్వాసం వెలకట్టలేనిదని
ముగ్ధులై మురిసిపోయే వాళ్ళం
జాతి భేదాన్ని మరిచిపోయి
కలిసి జీవనం కొనసాగించే వాళ్ళం
ఎప్పుడు వాటిని కుక్కల్లా చూడలే
మా మనుషుల్లో ఒక భాగం చేసుకున్నాం
ప్రేమగా చూసుకునే వాళ్ళం.
అవి కూడా మేము పెట్టింది తిని
హాయిగా మాతో కలిసి ఉండేవి
ఆనందంగా బతికే వాళ్ళం.
ఈమధ్యే మా కుక్కల్లో మార్పు మొదలైంది
దొంగలు పెట్టే తిండికి అలవాటైనట్టున్నాయి
మెడలు తిరగకుండా బలిసినయి
పుట్టి పెరిగిన నేలను మరిచిపోయినయి
జిత్తులమారి నక్కల రంగు పూసుకుని
నేలను విడిచి సాము చేస్తున్నయి
తిండి పెట్టిన వారిపైనే తిరగబడుతూ
మా కుక్కలు మమ్మల్నే కరుస్తున్నయ్

నెరువట్ల చైతన్య
9491470746

## సంకల్పం మంచిదైతే..!

ఆరంభం ఒక దీపం
వెలుగులు ప్రసరిస్తూనే
పదిమందికి దారి చూపాలి

సంకల్పం మంచిదైతే
కర్తవ్యం కమనీయమౌతుంది
చెడు పైన మంచి గెలుపే
జీవిత బాటకు అడుగైతుంది

శంకుస్థాపనలో పట్టుదల
మెట్టు మెట్టుకు రెట్టింపైతే
విజయం విచ్చుకుంటుంది
సంకల్పసిద్ధి భుజం తడుతుంది

చెప్పినవే విన్నవే
ఫలితానికి తొలిమెట్టు కాబోదు
సత్యం అనుకున్న ప్రతి అడుగు
సర్వస్వం శ్రేయోదాయకమౌతుంది

వేసే ప్రతి అడుగులోనా
సమాజ హితం కోరినదైతే
చైతన్యంతో చేయి కలుస్తుంది
భరోసా వెన్ను చరుస్తుంది
సంకల్పం మంచిదైతే
అంతటా ప్రశంసల వర్షం
సంపూర్తిగా కురుస్తుంది

నరెద్దుల రాజారెడ్డి
సెల్ : 9666016636

## స్వేచ్ఛా కాగితాలు

బ్రతుకునంతా బందీ చేసి
కలల కొలువుకై కష్టపడి
పరీక్షకు పయనమయితే
ముందు రోజే స్వేచ్ఛ పొంది
నిరుద్యోగిని నిండా ముంచిన
ప్రభుత్వోద్యోగ ప్రశ్నా కాగితాలు
ఆర్థిక అవకతవకల దోపిడీకి అడుగడుగున స్వేచ్ఛనిచ్చి
అబద్ధాగ్ని ప్రమాదంలో మిగలకుండా తగులబడిన
రక్షణలేని అధికారిక అభివృద్ధిపనుల కాగితాలు
యువత చేతిలో ఇమడలేక
గ్రంథాలయ మందిరాల్లో
చెదల నోటికి విడువబడిన
స్వాతంత్ర్య సమర వీరుల
చెల్లని చరిత్రా కాగితాలు
బ్రతికున్నోడి సావు జేసి
ప్రజాస్వామ్య పరువు తీసి
అసమర్థులను గెలిపించే
దొంగ ఓటు కాగితాలు
డెబ్బైతొమ్మిది వసంతాల స్వాతంత్ర్య భారతావని
సంపూర్ణ స్వాతంత్ర్యాన్ని
సవాలంటూ సిగ్గులేక దేశమంతా తిరుగుతున్నవే
ఈ స్వేచ్ఛా కాగితాలు.

నేపా సంతోష్ అచ్యుత్ కుమార్,
అసిస్టెంట్ ప్రొఫెసర్, కాళోజి ప్రతిభ పురస్కార గ్రహీత.
8639442397

# మదర్ థెరీసా - ఒక ప్రేరణాత్మక జీవితం

ప్రాంతాలు, మతాలు, కులాలకు అతీతంగా, ఏమీ ఆశించకుండా నిస్వార్థంగా మానవసేవ చేసే గొప్ప మానవమూర్తులు ఈ ప్రపంచంలో చాలా అరుదుగా ఉంటారు. ఆ అరుదైన వ్యక్తులలో తమ వ్యక్తిగత జీవితాన్ని కూడా సేవకే అంకితం చేసినవారు చాలా తక్కువగా ఉంటారు. అటువంటి వారిలో మహిళలు అయితే వేళ్ళ మీద లెక్కపెట్టవచ్చు. ఆ కొద్దిమందిలో మొదటి స్థానాన్ని పొందే అర్హత కేవలం ఒకే ఒక్క వ్యక్తికి సొంతం. ఆ మహిళా మూర్తి మేరీ తెరెసా బోజాక్సియు. ఇంతకీ ఆమె ఎవరు? ఆమెనే మదర్ థెరీసా.

ఆమె అల్బేనియన్ కాథలిక్ తల్లిదండ్రులైన నికోలా, డ్రానాఫైల్ బోజాక్షియులకు ఆగస్టు 26, 1910న మూడవ సంతానంగా మాసిడోనియాలోని స్కోప్జేలో జన్మించారు. ఆమె తండ్రి ఒక వ్యాపారవేత్త, తల్లి గృహిణి. ఆమెకు ఎనిమిది సంవత్సరాల వయస్సులో ఆమె తండ్రి మరణించారు. దాంతో బోజాక్షియు కుటుంబం ఆర్థికంగా కష్టాల్లో కూరుకుపోయింది. ఈ పరిస్థితుల్లో ఏం చేయాలో తోచక, ఒంటరి తల్లి అయిన డ్రానాఫైల్ కుటుంబ పోషణ కోసం వస్త్రాలు ఎంబ్రాయిడరీలను విక్రయించే చిన్న వ్యాపారాన్ని ప్రారంభించారు.

పన్నెండేళ్ల వయస్సులో ఆమె సన్యాసినిగా మారి దేవుడిని సేవించాలని భావించారు. సన్యాసిని కావాలనేది ఒక కష్టమైన నిర్ణయం. పెళ్లి, పిల్లలు కనే అవకాశాన్ని వదులుకోవడమే కాకుండా కుటుంబాన్ని శాశ్వతంగా వదులుకోవాలని ఆమెకు తెలుసు. ఐదేళ్లపాటు మదర్ థెరీసా సన్యాసినిగా మారాలా వద్దా అని గట్టిగా ఆలోచించారు. ఈ సమయంలో, ఆమె చర్చి గాయక బృందంలో పాటలు పాడేవారు, చర్చి కార్యక్రమాలను నిర్వహించడంలో తన తల్లికి సహాయం చేసేవారు. పేదలకు ఆహారం, ఇతర సామాగ్రిని అందించడంలో తన తల్లికి చేదోడువాదోడుగా ఉండేవారు. చివరికి, ఒక బలమైన లక్ష్యంతో సన్యాసిని కావాలని నిర్ణయించుకున్నారు. అప్పటికి ఆమె వయస్సు 17 సంవత్సరాలు. ఐర్లాండ్‌లోని లోరెటో సన్యాసినులకు దరఖాస్తు చేసుకున్నారు.

భారతదేశంలో క్యాథలిక్ మిషనరీలు చేస్తున్న పని గురించి అనేక కథనాలను చదివిన ఆమె జనవరి 6, 1929న మన దేశానికి చేరుకున్నారు. రెండేళ్ల తర్వాత, మే 24, 1931న లోరెటో సన్యాసినిగా తన మొదటి ప్రమాణం చేశారు. సన్యాసినిగా, మదర్ థెరీసా (అప్పట్లో సిస్టర్ థెరీసా అని మాత్రమే పిలిచేవారు, తరువాత సెయింట్ థెరీసా ఆఫ్ లిసియక్స్ ఆమె ఎంచుకున్న పేరు) కోల్‌కతాలోని లోరెటో ఎంటల్లీ పాఠశాలలో స్థిరపడ్డారు. అక్కడ పాఠశాలలో చరిత్ర, భూగోళశాస్త్రం బోధించేవారు. సాధారణంగా, లోరెటో సన్యాసినులు పాఠశాల నుండి బయటకు వెళ్లడానికి అనుమతించబడరు. అయితే, 1935లో, 25 ఏళ్ల థెరీసా పాఠశాల వెలుపల ఉన్న సెయింట్ థెరీసా పాఠశాలలో బోధించడానికి ప్రత్యేక మినహాయింపు ఇవ్వబడింది. సెయింట్ థెరీసాలో రెండు



సంవత్సరాల తరువాత, థెరీసా మే 24, 1937న తన ఆఖరి ప్రమాణం చేసి అధికారికంగా "మదర్ థెరీసా" అయ్యారు. ఆమె తన చుట్టూ ఉన్నవారి బాధలు, కష్టాలను చూసి తట్టుకోలేకపోయారు, అందుకే ఆమె తన శేష జీవితాన్ని పేదలు, అణగారిన వర్గాల వారికి సేవ చేయాలని, జీవితాంతం సేవకే అంకితం కావాలని దృఢంగా నిర్ణయించుకున్నారు.

దీనికోసం మదర్ థెరీసా ఆగస్టు 16, 1948న పాఠశాలను విడిచిపెట్టి కలకత్తాలోని మురికివాడల్లో ఒక చిన్న గుడిసెలో చిన్నపిల్లలకు పాఠాలు చెప్పడం ప్రారంభించారు. అక్టోబర్ 7, 1950న ఆకలితో ఉన్నవారు, నిరాశ్రయులు, వికలాంగులు, అంధులు, కుష్టురోగులు, సమాజం అంతటా ప్రేమించబడని, పట్టించుకోబడని, అవాంఛనీయమైనవారందరికీ సేవ చేయాలనే లక్ష్యంతో కోల్‌కతాలో పన్నెండు మంది సభ్యులతో ఒక చిన్న సంఘంగా మిషనరీస్ ఆఫ్ ఛారిటీని స్థాపించారు. మిషనరీస్ ఆఫ్ ఛారిటీ కోల్‌కతా అంతటా లెప్రసీ-ఔట్రీచ్ క్లినిక్‌లను ఏర్పాటు చేసి, మందులు, డ్రెస్సింగ్‌లు మరియు ఆహారాన్ని అందజేసేది. ఆసుపత్రులు బతికే అవకాశం ఉన్న రోగులతో నిండిపోతుండగా, మదర్ థెరీసా మరణిస్తున్న వారి కోసం ఆగస్టు 22, 1952న నిర్మల్ హృదయ్ ("ప్లేస్ ఆఫ్ ది ఇమ్మాక్యులేట్ హార్ట్") అనే ఇంటిని తెరిచారు.


నిరాశ్రయులైన పిల్లలు, అనాథ పిల్లల కోసం 1955లో, మదర్ థెరీసా నిర్మల శిశు భవన్‌ను ప్రారంభించారు. భారతదేశంలోని మురికివాడలలో, పెద్ద సంఖ్యలో ప్రజలు కుష్టు వ్యాధి బారిన పడ్డారు. ఆ సమయంలో, కుష్టు రోగులు వారి కుటుంబాల నుండి బహిష్కరించబడ్డారు. కుష్టు రోగుల పట్ల విస్తృతమైన భయం కారణంగా, నిర్లక్ష్యం చేయబడిన ఈ ప్రజలకు సహాయం చేయడానికి మదర్ థెరీసా ఒక మార్గాన్ని కనుగొనడానికి చాలా కష్టపడ్డారు. చివరికి, లెప్రసీ ఫండ్, లెప్రసీ డేలను ఏర్పాటు చేసి వ్యాధి గురించి ప్రజలకు అవగాహన కల్పించారు. కుష్టు రోగులకు వారి ఇళ్ల దగ్గర మందులు, బ్యాండేజీలను అందించడానికి అనేక మొబైల్ లెప్రసీ క్లినిక్‌లను (మొదటిది సెప్టెంబర్ 1957లో ప్రారంభించబడింది) స్థాపించారు. 1960ల మధ్య నాటికి, మదర్ థెరీసా కుష్టు రోగులు నివసించడానికి, పని చేయడానికి శాంతి నగర్ ("ది ప్లేస్ ఆఫ్ పీస్") అనే కుష్టు రోగి కాలనీని స్థాపించారు. తరువాత మిషనరీస్ ఆఫ్ ఛారిటీకి భారతదేశం వెలుపల సంస్థలను ఏర్పాటు చేయడానికి అనుమతి లభించింది. మొదటిది 1965లో వెనిజులాలో స్థాపించబడింది. కొద్ది కాలానికే ప్రపంచవ్యాప్తంగా మిషనరీస్ ఆఫ్ ఛారిటీ హౌస్‌లు ఏర్పడ్డాయి. మదర్ థెరీసా మిషనరీస్ ఆఫ్ ఛారిటీ ప్రపంచవ్యాప్తంగా అద్భుతమైన స్థాయిలో సేవలందించింది. 1980లలో మదర్ థెరీసా అప్పటికే తన 70వ ఏట న్యూయార్క్, శాన్ ఫ్రాన్సిస్కో, డెన్వర్ మరియు ఇథియోపియాలోని అడిస్ అబాబాలో ఎయిడ్స్ బాధితుల కోసం గిఫ్ట్ ఆఫ్ లవ్ హోమ్‌లను ప్రారంభించారు. 1996 నాటికి మిషనరీస్ ఆఫ్ ఛారిటీ 100 దేశాలలో 517 మిషన్లను కలిగి ఉంది. సిస్టర్ల సంఖ్య పన్నెండు నుండి వేలకు పెరిగింది.

**అవార్డులు- గుర్తింపు:**

ఆమె 1962లో పద్మశ్రీ, 1969లో అంతర్జాతీయ అవగాహన కోసం జవహర్‌లాల్ నెహ్రూ అవార్డునూ అందుకున్నారు. అదే సంవత్సరంలో శాంతి అంతర్జాతీయ అవగాహన కోసం రామన్ మెగసెసే అవార్డును అందుకున్నారు. అంతర్జాతీయంగా 1979లో శాంతి విభాగంలో ప్రతిష్టాత్మకమైన నోబెల్ అవార్డు అందుకున్నారు. 1980లో భారతదేశ అత్యున్నత పౌర పురస్కారం అయిన భారత రత్న బహుకరించబడింది. ఆమె పుట్టిన 100వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని, భారత ప్రభుత్వం ఆగస్టు 28, 2010న ఒక ప్రత్యేక ₹ 5 నాణేన్ని విడుదల చేసింది.

**స్ఫూర్తిదాయకం:**

87 సంవత్సరాల వయస్సులో ఆమె సెప్టెంబర్ 5, 1997న కోల్‌కతాలో మరణించారు. 2016వ సంవత్సరంలో ఆమెను సెయింట్ థెరీసాగా ప్రకటించారు. వినయం, దయ, దాతృత్వం కలగలిసిన ఒక పరిపూర్ణ మనిషి. పేద, నిస్సహాయ ప్రజలకు ఆమె చేసిన నిస్వార్థ సేవకు ఆమె పేరుగాంచారు. ఆమె తన జీవితమంతా భారతదేశ ప్రజలకు సేవ చేయడంలో గడిపారు. ఆమె చూపిన మార్గం ఎంతో మందికి స్ఫూర్తిదాయకం.



డివిబి శ్రీ హరిన్
9వ తరగతి విద్యార్థి
mr.dunga@rediffmail.com

# ప్రైవేటు స్కూళ్ల ఫీజుల దోపిడీని అరికట్టాలి

**గద్వాల నడిగడ్డ, ఆగస్టు 25 (జనం సాక్షి) :** జోగులాంబ గద్వాల జిల్లాలోని ప్రైవేట్ స్కూల్స్ ఫీజుల పేరుతో విచ్చలవిడిగా దోపిడి చేస్తున్నారని ప్రజావాణిలో జిల్లా కలెక్టర్ కు బీఆర్ఎస్వి ఆధ్వర్యంలో ఫిర్యాదు చేయడం జరిగిందనీ కురువ పుల్లయ్య అన్నారు. ఈ సందర్భంగా కురువ పల్లయ్య మాట్లాడుతూ సామాన్యుడి ఆదాయంలో 40 శాతం పిల్లల చదువులకే,ఫీజుల నియంత్రణ జీవో అమలు ఎక్కడ అని,విద్యా హక్కు చట్టానికి తూట్లు వేస్తున్నారని,ప్రైవేటు పాఠశాలల్లో ఫీజుల నియంత్రణతో పాటు పేద విద్యార్థులకు కార్పొరేట్ విద్య అందించే లక్ష్యంగా ప్రత్యేకంగా విద్యా హక్కు చట్టం తెచ్చిన జిల్లాలో ఎక్కడ అమలు కావడం లేదనీ,జిల్లాలో పుట్టగొడుగుల పుట్టుకొస్తున్న ప్రైవేట్ పాఠశాలలు ఈ చట్టాన్ని బేకతారు చేస్తున్నారాని,ఫీజులను అడ్డగోలుగా పెంచేస్తున్న, విద్యాధికారులు పాటించుకోవడం లేదన్నారు. విద్యార్థుల తల్లిదండ్రులపై ఫీజుల భారం రోజురోజుకు అధికమవుతుందనీ,ప్రైవేట్ పాఠశాలల్లో ఫీజులను నియంత్రించేందుకు ప్రభుత్వం జీవో 91 జారీ చేసి ఏళ్ళు గడుస్తున్న జిల్లాలో నియంత్రణ కొరబడిందన్నారు, రోజు కూలీ నుంచి ఉన్నత ఉద్యోగుల దాకా తమ పిల్లలను పేరున్న ప్రైవేట్




పాఠశాలల్లో చదివించాలని తపనపడడం సహజం అని,తల్లిదండ్రుల ఆరాటాన్ని యజమాన్యాలు సొమ్ము చేసుకోవడానికి ప్రయత్నిస్తున్నాయనీ, గడిచిన ఐదేళ్ల లో ఫీజుల మోత నాలుగు రెట్లు పెరిగిందన్నారు. గత ఏడాదితో పోలిస్తే ఫీజులను 20 నుంచి 30 శాతం పెంచారనీ, జిల్లాలోని ప్రైవేటు బడుల్లో సుమారు 40,000 వేల మందికి పైగా విద్యార్థులు చదువుతున్నారనీ, ఫీజులు నియంత్రణకు రాష్ట్ర ప్రభుత్వం తెచ్చిన జీవో 91 అమలు కావడం లేదనీ, దీని ప్రకారం రెండు కేటగిరిలో గ్రామీణ పట్టణ ప్రాంతాలను వేరు చేస్తూ 8,000 నుండి 12000 ఫీజులు నిర్వహించారన్నారు. కానీ ఈ ఫీజులను జిల్లాలోని ప్రైవేట్ పాఠశాలలు యాజమాన్యాలు పట్టించుకోవడం లేదనీ,పేద విద్యార్థులకు 25 శాతం ఉచిత సీట్లను జిల్లాలోని ఏ ఒక్క ప్రైవేటు పాఠశాల కేటాయించడం లేదనీ, ఎక్కడ లాటరీ పద్ధతిలో ప్రవేశాలు జరగడం లేదనీ, ప్రైవేటు కార్పొరేట్ స్థాయి పాఠశాలలు బహిరంగంగానే అడ్మిషన్ ఫీజు వసూలు చేస్తున్నాయనీ, ఇది నిబంధనలకు విరుద్ధమే, అయినా అడిగే వారు లేరనీ,పాఠశాల అభివృద్ధి సిబ్బంది సంక్షేమం క్రీడలు పరీక్ష ఫీజు సాంస్కృతి కార్యక్రమాల పేరిట యాజమాన్యాలు ఇష్టరాజ్యంగా ఫీజులు వసూలు చేస్తున్నాయనీ, జిల్లా ఏర్పడిన నాటి నుంచి ఇంతవరకు అధికారుల ఆధీనంలోని కమిటీ కూర్చొని చర్చించకపోవడం గమనార్హం. జిల్లాలోని అన్ని ప్రైవేట్ స్కూల్లో కూడా ఇదే పరిస్థితి ఉన్నదనీ, తక్షణమే ఫీజులను నియంత్రించాలని జిల్లా కలెక్టర్ కి బిఆర్ఎస్వి ఆధ్వర్యంలో ఫిర్యాదు చేయడం జరిగిందనీ కురువపల్లయ్య అన్నారు.ఈ కార్యక్రమంలో నాయకులు రంగస్వామి, నరసింహ, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

# కదం తొక్కిన ఆశావర్కర్లు..

- కలెక్టరేట్ ముందు ధర్నా




**వికారాబాద్ జిల్లా బ్యూరో, ఆగస్టు 25 (జనం సాక్షి) :** ఆశా వర్కర్ల సమస్యల సాధన కోసం కదం తొక్కారు. సోమవారం వికారాబాద్ జిల్లా కలెక్టరేట్ ముందు ధర్నా నిర్వహించారు. అనంతరం కలెక్టర్. జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారికి వినతి పత్రాలు అందజేశారు. వికారాబాద్ జిల్లా కలెక్టరేట్ ముందు ధర్న సిఐటియు ఆధ్వర్యంలో సిఐటియు జిల్లా అధ్యక్ష కార్యదర్శులు మాట్లాడుతూ పి రామకృష్ణ ఆర్ మైపాల్ మాట్లాడుతూ.ఆశా వర్కర్లు పనిచేయటం లేదనే వ్యతిరేకమైన విధానాన్ని రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వం పెంచిన పారితోషికాలు యధావిధిగా రాష్ట్రంలో అమలు చేయాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఫిక్స్ వేతనం 18 వేలు నిర్ణయించాలని కోరారు. 50 లక్షల ఇన్సూరెన్స్, రిటైర్మెంట్ బెనిఫిట్స్, పెన్షన్, ప్రమోషన్స్, మట్టి ఖర్చులు తదితర హామీలు వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేస్తూ నినాదాలు ఇవ్వడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఆశా వర్కర్ల యూనియన్ జిల్లా అధ్యక్షురాలు అమృత జిల్లా కార్యదర్శి మంగమ్మా. ఉమాదేవి యాదమ్మ అరుణ సుజాత పద్మ లక్ష్మీ అపురూప అంజమ్మ మహేశ్వరి నీలాదేవి మున్నీ బాయ్ తదితరులు ఆశాలు పాల్గొన్నారు.

# విద్యార్థులను లీడర్లుగా చేయడమే లక్ష్యం



**ఖైరతాబాద్, ఆగస్ట్ 25 (జనం సాక్షి) :** విద్యార్థులను లీడర్లుగా చేయాలనే లక్ష్యంతో స్కూల్ అఫ్ పోస్ట్ గ్రాడ్యుయేట్ స్టడీస్ విద్యా సంస్థను ఏర్పాటు చేసినట్లు ఎస్.కీ డైరెక్టర్ డాక్టర్ జి.రామేశ్వర్ రావు అన్నారు. సోమవారం గచ్చి బౌలిలోని హెూటల్ దసపల్లాలో జరిగిన 10టీవి ఎడ్యుకేషన్ విజనరీ సమావేశంలో జరిగిన కాఫీ టేబుల్ బుక్ ఆవిష్కరణ అనంతరం రామేశ్వర్ రావు 10టీవీ ప్రతినిధులతో మాట్లాడుతూ ఇంజ నీరింగ్ స్టాఫ్ కాలేజీ ఆఫ్ ఇండియాలో స్కూల్ అఫ్ పోస్ట్ గ్రాడ్యుయేట్ స్టడీస్ ఒక విభాగమని అన్నా రు. తెలంగాణ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టు విక్రమార్క, మాజీ ఐఏఎస్ డాక్టర్ జయప్రకాశ్ నారాయణ, మాజీ ఐపీఎస్ లక్ష్మీ నారాయణ, ప్ర ముఖ నటులు మురళీ మోహన్ చేతుల మీదుగా కాఫీ టేబుల్ బుక్ రామేశ్వర రావు అందుకున్నారు .కాలేజీలోని మైనింగ్, ఐటీ, పవర్ అండ్ ఎనర్జి, క్లయిమేట్ చేంజ్, సివిల్ ట్రాన్స్ పోర్టేషన్ ఇంజనీ రింగ్, మేనేజ్మెంట్ అండ్ టెక్నాలజీ తదితర విభా గాల్లో దేశంలో పనిచేస్తున్న ఇంజనీర్లకు శిక్షణ ఇచ్చి నట్లుగానే ఇదే సంస్థలో 2008లో ప్రారంభించిన స్కూల్ అఫ్ పోస్ట్ గ్రాడ్యుయేట్ స్టడీస్ లో మారు తున్న ప్రపంచానికి అనుగుణంగా విద్యార్థులను తీర్చిదిద్ది వారిని మార్కెటింగ్, ఫైనాన్స్, పవర్, ఐటీ, టెలి కమ్యూనికేషన్స్ తదితర రంగాల్లో ఒక లీడర్ లాగా, ఒక వ్యవస్థాపక నిర్వాహకులుగా, ఒక మార్గ దర్శు ల్లాగా తీర్చిదిద్దాలనుకుని పోస్ట్ గ్రాడ్యుయేట్ డిప్లొమా ఇన్ ఇన్ఫ్రాస్ట్రక్చర్ మేనేజిమెంట్, పోస్ట్ గ్రాడ్యుయేట్ డిప్లొమా ఇన్ జనరల్ మేనేజిమెంట్ కోర్సులను ప్రారంభించామన్నారు.

# ఒరిజినల్ పట్టాదారు పాసుబుక్ ఇస్తేనే యూరియా..

- వ్యవసాయ సహకార సంఘం అధికారుల కొర్రి
- బ్లాక్ మార్కెట్లో 400 రూపాయలకు బస్తా ఇస్తుండ్రు
- గోడౌన్ లో నిల్వ ఉన్న యూరియా రాతికి రాత్రి మాయం.. మిగిలింది ఇస్తుండ్రు
- జిల్లా వ్యాప్తంగా రైతుల ఆందోళన





**వికారాబాద్ జిల్లా బ్యూరో, ఆగస్టు 25 (జనం సాక్షి) :** అందరికీ అన్నం పెట్టే అన్నదాతలకు ఎంత కష్టమొచ్చింది.. బస్తా యూరియా కోసం దేహి అంటూ అధికారుల చుట్టూ చక్కర్లు కొడుతున్నారు. ఒంట్లో సత్తువనంత కూడగట్టుకుని గంటల తరబడి యూరియా కోసం బారులు తీసి వేచి చూస్తున్నారు. కడుపులో పేగులు నకనకలాడిన తాగడానికి చుక్క నీరు దొరకకపోయినా ఒక్క బస్తా యూరియా దొరుకుతే చాలు దేవుడా అంటూ కళ్ళల్లో వత్తులు పెట్టుకొని అధికారుల రాక కోసం ఎదురుచూస్తున్నారు. తీరా అధికారులు వచ్చి అడ్డగోలు కొర్రీలు పెట్టి యూరియా లేదంటున్నారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు యూరియా కోసం వేచి ఉండి యూరియా లేదంటే తెల్ల ముఖాలు వేసుకొని గునుక్కుంటూ వెళ్లిపోవడం తప్ప చేసేది ఏమీ లేదు. ఇది రోజు రైతులు పడుతున్న నరకయాతన. వివరాల్లోకి వెళితే వికారాబాద్ జిల్లాలో యూరియా కొరత ఏర్పడింది. సకాలంలో యూరియా రైతులకు అందించని కారణంగా జిల్లా వ్యాప్తంగా ఆయా మండలాలలో రైతులు రోడ్డెక్కి ఆందోళనకు దిగారు. సోమవారం నాడు మోమిన్ పేట. మర్పల్లి వికారాబాద్. ధరూర్ మండలాలలో రైతులు యూరియా కోసం ఆందోళన చేశారు. ఉదయం ఏడు గంటల నుంచి రైతులు ఏరియా కోసం వ్యవసాయ సహకార సంఘాల దగ్గర బారులు తీశారు. తీరా అధికారులు సవ్వాలక్ష కొర్రీలు పెట్టడంతో రైతులు ఆందోళన దిగి రాష్ట్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. గోడౌన్ నుంచి బ్లాక్ మార్కెట్ కు యూరియా తరలించిన తర్వాత కొంత మిగిల్చుకొని అధికారులు రైతుకు బస్తా చొప్పున ఇచ్చి అయిపోయిందని చేతులు దులుపుకుంటున్నట్లు రైతులు ఆరోపించారు.

# ప్రభుత్వ నియమావళి ఉల్లంఘిస్తే కఠిన చర్యలు

- నాణ్యత ప్రమాణాలు తప్పక పాటించాలి
- రాష్ట్ర ఎక్సైజ్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు



**వికారాబాద్ జిల్లా బ్యూరో, ఆగస్టు 25 (జనం సాక్షి) :** వికారాబాద్ జిల్లా పూడూరు మండలం కంకల్ గ్రామంలో బృందావనం స్పిరిట్స్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ డిస్టిలరీస్ ని రాష్ట్ర ఎక్సైజ్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు సోమవారము తనిఖీ చేశారు. హెూల్డింగ్ ట్యాంక్స్, బ్లెండింగ్ యూనిట్, బాటిల్ ఫిల్లింగ్, సీసీ కెమెరాలు లు కమాండ్ కంట్రోల్ సెంటర్ తో అనుసంధానం, ట్రాక్ అండ్ ట్రేస్ సిస్టం ను క్షుణ్ణంగా పరిశీలించారు. మద్యం తయారీ, ఉత్పత్తి, సరఫరా, లేబ్లింగ్, మద్యం తయారీకి చెందిన ముడి సరుకు, ఇతర సాంకేతికపరమైన తదితర అంశాలపై పూర్తి వివరాలను సంబంధిత అధికారులను అడిగి తెలుసుకున్నారు.మద్యం తయారీ, విక్రయాల్లో ప్రభుత్వ నియమావళిని కచ్చితంగా పాటించాలని, పర్యావరణానికి హాని కలగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని, కంపెనీ యాజమాన్యానికి ఆదేశించారు. ప్రజల ఆరోగ్యాన్ని దృష్టిలో పెట్టుకొని నాణ్యత ప్రమాణాలు తప్పక పాటించాలని స్పష్టం చేశారు.ఈ సందర్భంగా మంత్రి జూపల్లి మాట్లాడుతూ.. నిబంధనలకు అనుగుణంగా మద్యం తయ్యారీ చేస్తున్నరా లేదా అనే విషయాలు ఆరా తీసేందుకే కంపెనీలో ఆకస్మిక తనిఖీలు చేశామని రికార్డులు కూడా పరిశీలించామని అన్నారు. డిస్టిలరీలు, బేవరేజ్ లో లిక్కర్ తయారీకి ముడి సరుకు దగ్గర నుంచి బాటిల్ బయట వచ్చే వరకు ఆబ్కారీ శాఖ అధికారుల పర్యవేక్షణ ఎలా ఉంది? మద్యాన్ని భర్తీ చేసే క్రమంలో లేబ్లింగ్ ఎలా చేస్తున్నారు..? ముడి సరుకు, ఉత్పత్తి అవుతున్న మద్యం, అక్కడ నుంచి డిపోలకు సరఫరా అవుతున్న లిక్కర్ రికార్డులను పరిశీలించినట్లు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో ఎక్సైజ్ సూపరింటెండెంట్ విజయభాస్కర్, అసిస్టెంట్ కమీషనర్ డి శ్రీనివాస్, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# కాంగ్రెస్ ప్రభుత్వంలోనే పేదలకు సంక్షేమ పథకాలు

- కాంగ్రెస్ పార్టీ చేవెళ్ల నియోజకవర్గ ఇన్చార్జి భీమ్ భరత్

**మొయినాబాద్, ఆగస్టు 25 (జనం సాక్షి) :** కాంగ్రెస్ ప్రభుత్వంలోనే పేదలకు సంక్షేమ పథకాలు అందుతాయని కాంగ్రెస్ పార్టీ చేవెళ్ల నియోజకవర్గ ఇన్చార్జి భీమ్ భరత్ పేర్కొన్నారు. సోమవారం మండల పరిధిలోని రెడ్డిపల్లి గ్రామంలో కాంగ్రెస్ పార్టీ జెండా ఆవిష్కరణ చేసి అనంతరం అర్హులైన పేదలకు రేషన్ కార్డులు పంపిణీ చేశారు. ఇందిరమ్మ ఇండ్ల బిల్లులు మంజూరైన సందర్భంగా లబ్ధిదారులకు స్వీట్లు పంచుతూ... కాంగ్రెస్ పార్టీ చేపట్టిన సంక్షేమ పథకాలను గ్రామస్తులకు వివరిస్తూ హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన తర్వాత పేదలకు ఇందిరమ్మ ఇండ్లు, రేషన్ కార్డులు, సన్న బియ్యం పంపిణీ చేయడం జరిగిందన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం హయంలో డబుల్ బెడ్ రూమ్, రేషన్ కార్డులు ఏ ఒక్క పేదలకు పంచలేదని పేర్కొన్నారు. గ్రామాలలో ఇందిరమ్మ ఇండ్లు నాణ్యతతో నిర్మించుకొని కుటుంబ సభ్యులు ఆనందంగా ఉండాలన్నదే కాంగ్రెస్ ముఖ్య లక్ష్యమని అన్నారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు మాణయ్య, ఉపాధ్యక్షులు రవీందర్ రెడ్డి, జిల్లా యూత్ కాంగ్రెస్ కార్యదర్శి దయానంద్ గౌడ్, తోల్కట్ట మాజీ సర్పంచ్ సత్యనారాయణ, సర్దార్ నగర్ మార్కెట్ కమిటీ డైరెక్టర్లు జైపాల్ రెడ్డి, బాలకృష్ణారెడ్డి, సీనియర్ నాయకులు గన్నేపాక నర్సింగ్ రావు, బాకారం మాజీ సర్పంచ్ వెంకట్ రెడ్డి, గ్రామ మాజీ సర్పంచ్ వినీత కరుణాకర్ గౌడ్, ఎంపీటీసీ మోర శ్రీనివాస్, నాయకులు కార్యకర్తలు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.



# నిబంధనలు పట్టని నిర్మాణాలు

**హైడ్రా ప్రజావాణికి 48 ఫిర్యాదులు**



**హైదరాబాద్, ఆగస్టు 25 (జనంసాక్షి) :** కోర్టు ఆదేశాలున్నా బేఖాతరు చేస్తున్నారు... చట్టాలను ఉల్లంఘిస్తున్నారు... నిబంధనలను పట్టించుకోవట్లేదంటూ పలువురు హైడ్రా ప్రజావాణిలో ఫిర్యాదు చేశారు. ప్లాట్కు పక్కన రోడ్డున్నా.. పార్కున్నా.. కలిపేసుకుంటున్నారని వాపోతున్నారు. కోర్టు స్టేటస్ కో ఉన్నా.. గచ్చిబౌలిలో సంధ్యా కన్వెన్షన్ యజమాని శ్రీధర్ రావు పలు నిర్మాణాలు చేపడుతున్నారంటూ.. ఫెర్టిలైజర్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా ఎంప్లాయీస్ కోపరేటివ్ హౌసింగ్ సొసైటీలోని పలువురు ప్లాట్ యజమానులు ఫిర్యాదులో పేర్కొన్నారు. లే ఔట్ నామరూపాలు లేకుండా చేసి ఇష్టానుసారం నిర్మాణాలు చేపడుతున్నారంటూ వాపోయారు. ఎక్కడా ఎలాంటి నిర్మాణాలు చేపట్టకూడదని హైకోర్టు ఉత్తర్వులున్నా.. నిర్మాణాలు యథేచ్ఛగా కొనసాగిస్తున్నారంటూ ప్లాట్ యజమానులు ఫిర్యాదులో పేర్కొన్నారు. ఇదే సమయంలో తమకు అనుమతులున్నా నిర్మాణాలు చేయడానికి వీలు లేదని అభ్యంతరాలు వ్యక్తమౌతున్నాయని వాపోయారు. రహదారులు ఇష్టానుసారం నిర్మించుకుని తన వ్యాపార సామ్రాజ్యాన్ని విస్తరిస్తున్నారని ఫిర్యాదులో పేర్కొన్నారు. కాప్రా జవహర్నగర్ సరిహద్దులలో లే ఔట్ వేసి.. 33 అడుగుల రోడ్డును ఆక్రమించేశారని ఫిర్యాదు చేశారు. ఇలా ప్రజావాణికి 48 ఫిర్యాదులు రాగా.. పార్కులు, రహదారుల ఆక్రమణలే ఎక్కువ మొత్తంలో ఉన్నాయి. వీటిని హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ పరిశీలించి తదుపరి చర్యలకు సంబంధిత అధికారులను ఆదేశించారు.

# ప్రభుత్వ ఆసుపత్రిలో మెరుగైన వైద్యం అందించాలి



**యాచారం, ఆగస్టు 25 (జనం సాక్షి) :** పేద ప్రజలకు ప్రభుత్వ ఆసుపత్రిలో మెరుగైన వైద్యం అందించాలి అని భువనగిరి ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి, ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి అన్నారు. సోమవారం యాచారం మండల కేంద్రంలో ప్రభుత్వ ఆసుపత్రిలో రూ 3 లక్షల 50 వేల ఎంపీ నిధులతో వాటర్ ప్లాంట్ను ఎంపీ కిరణ్ కుమార్ రెడ్డి, ఎమ్మెల్యే రంగారెడ్డి కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కార్పొరేట్ హాస్పిటల్ కన్న ప్రభుత్వ ఆసుపత్రులను మెరుగుపరచడమే కాంగ్రెస్ ప్రభుత్వం కృషి చేస్తుందని తెలిపారు. గత ప్రభుత్వం కంటే ఈ రాష్ట్ర ప్రభుత్వం ప్రభుత్వ హాస్పిటల్ లకు నిధులు ఎక్కువ కేటాయించి పేద ప్రజల ఎంతోమంది ప్రాణాలను కాపాడిన గణత ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కృషి ఫలితమే అని అన్నారు. చుట్టుముట్టు గ్రామ ప్రజలందరూ సద్వినియోగం చేసుకోవాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో సూపర్డెంట్ ఏ ,నవీన్ కుమార్, వైద్యులు డాక్టర్ టి ప్రియాంక, కె మృదు ల, డాక్టర్ లలిత, నర్స్ భారతమ్మ, ఆంగోత్ స్వామి, డీఈవో వెంకటేష్, మాజీ ఎంపీపీ రాచర్ల వెంకటేశ్వర్లు, బి.ఎన్.రెడ్డి ట్రస్ట్ చైర్మన్ శేఖర్ రెడ్డి, పిఎసిఎస్ మాజీ వైస్ చైర్మన్ లిక్కి శ్రీనివాస్ రెడ్డి, రమావత్ శ్రీను నాయక్, ఆంగోత్ వెంకటేష్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు మస్కు నరసింహ, మార్కెట్ డైరెక్టర్ గులాం అక్బర్, డిసిసి అధికార ప్రతినిధి వరికుప్పల సుధాకర్, ఉప్పల్ భాస్కర్, బీసీ సెల్ మండల అధ్యక్షుడు వరికుప్పల తిరుమలేష్, గౌరారం వెంకటరెడ్డి, రెడ్డి వెంకట్ రెడ్డి బ్రదర్స్, పాశం జయప్రకాష్, లిక్కి సుధాకర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# కామారెడ్డిగూడలో టెన్షన్ టెన్షన్..

- నిందితుడు ఇంటిముందు సాత్విక బంధువుల ధర్నా
- మహేందర్ రెడ్డి కుటుంబ సభ్యులను తమకు అప్పగించాలని ఆందోళన
- ఉరితీస్తే కానీ ఇక్కడ నుంచి కదలం
- గ్రామంలో భారీగా మోహరించిన పోలీసులు



**వికారాబాద్ జిల్లా బ్యూరో, ఆగస్ట్ 25 (జనం సాక్షి) :** వికారాబాద్ జిల్లా కామారెడ్డి గూడలో హై టెన్షన్ చోటు చేసుకుంది. సాత్విక హత్య అనంతరం గ్రామంలో ఉద్రుత పరిస్థితి నెలకొంది. నిన్నటి నుంచి గ్రామంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు పి కెట్ ఏర్పాటు చేశారు. నిన్న వెలుగు చూసిన సాత్విక హత్య అనంతరం ఆమె శవం కామారెడ్డి గూడ కు రానందున సాత్విక బంధువులంతా నిందితుడు మహేందర్ రెడ్డి ఇంటి ముందు బైఠాయించారు. సాత్విక దహన సంస్కారాలు నిర్వహించడానికి ఆమె భర్త మహేందర్ రెడ్డి తో పాటు కుటుంబ సభ్యులందరికీ గ్రామంలోకి పోలీసులు తీసుకురావాలని వారు పట్టుబట్టారు. నిందితుడు మహేందర్ రెడ్డి కుటుంబ సభ్యులతో తమకు ప్రాణ హాని ఉందని తమ కుటుంబంలోని మరొకరు వారి చేతిలో బలికాకుండా నిందితులను తమకప్పగించాలని ధర్నా నిర్వహిస్తున్నారు. దీంతో గ్రామంలో ఉద్రుత పరిస్థితి నెలకొంది. స్వాత్విక కుటుంబ సభ్యులకు తోడు దహన సంస్కారాలకు వచ్చిన వివిధ గ్రామాల బంధువులు తోడు కావడంతో గ్రామంలో ఎప్పుడు ఏం జరుగుతుందో అనే పరిస్థితి నెలకొంది. ఇదిలా ఉంటే సాత్వికదీ కులదురంకర హత్యా మహేందర్ రెడ్డి అతడిని సహకరించిన వారిపై కేసు నమోదు చేసి కఠినంగా శిక్షించాలనిఐద్వా మహిళా సంఘం కెవిపిఎస్ కేఎన్పిఎస్ రైతు వ్యవసాయ కార్మిక సంఘాలు ప్రభుత్వానికి చేశారు. కామారెడ్డి గూడ గ్రామంలో ప్రజా సంఘాల ఆధ్వర్యంలో సాత్విక కుటుంబని పరామర్శించడం జరిగింది. ప్రభుత్వం కోటి రూపాయలు, 5ఎకరాల భూమి ఇవ్వాలని, రాష్ట్ర మహిళా కమిషన్ కామారెడ్డి గూడ గ్రామానికి వచ్చి బాధితులకు అండగా నిలవాలని ప్రభుత్వన్ని డిమాండ్ చేశారు.లేని ఎడల రాష్ట్ర ,జిల్లా వ్యాపితంగా ఆందోళనలు చేస్తామని ప్రభుత్వ హెచ్చరించారు చేశారు. ఈ కార్యక్రమంలో కే ఎన్ పి ఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షులు . చంద్రప్ప,ఐద్వా మహిళా సంఘం జిల్లా కార్యదర్శి అనసూయ, కెవిపిఎస్ జిల్లా కార్యదర్శి మల్కయ్య, రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు ఆర్ మహిపాల్, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు యు.బుగ్గప్ప, నర్సింలు,రాజు,శ్రీనివాస్ అనంత, కుటుంబ సభ్యులు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

జనంసాక్షి
www.janamsakshi.org
మంగళవారం
26 ఆగస్టు 2025

# సీపీఎస్ తిరుగుబాటు బావుటా..!

- బతుకు భద్రత కోసం ఉద్యోగుల పోరాటం
- ఉవ్వెత్తున ఎగసిపడనున్న నిరసనలు
- సెప్టెంబర్ 1న హైదరాబాద్‌లో పీఆర్టీయు సంఘం మహా ధర్నాకు సిద్ధం

**సంగారెడ్డి ప్రతినిధి, ఆగస్టు 25 (జనం సాక్షి) :** పింఛన్ అంటే ఉద్యోగి తన జీవితకాలం ప్రభుత్వానికి సేవలు అందించినందుకు గాను వారి జీవితానికి ప్రభుత్వం కల్పించే ఒక ఆర్థిక భరోసా.. వృద్ధాప్యంలో తన శక్తిని కోల్పోయిన అనంతరం ఒక ఉద్యోగిని ప్రభుత్వం ఆదుకొనే ఒక బాధ్యత.. అయితే, కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ఆ బాధ్యతని మరిచి. ఉద్యోగి యొక్క జీతం నుండి ప్రతి నెల 10 శాంతం జీతాన్ని షేర్ మార్కెట్లో పెట్టుబడి పెడుతూ కార్పొరేట్ శక్తులకు ప్రభుత్వ ధనాన్ని దోచి పెడుతూ.. పాత పెన్షన్ స్థానంలో కొత్తగా సీపీఎస్ (కంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీమ్) విధానాన్ని తీసుకొచ్చి, ఉద్యోగుల జీతాన్ని షేర్ మార్కెట్‌కు ధారాదత్తం చేసి తమకు పెన్షన్ లేకుండా చేయడం పై దేశ వ్యాప్తంగా ఉద్యోగులందరూ ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

### ఆర్థిక, ఆరోగ్య భద్రతపై ఉద్యోగుల ఆందోళన...

ఈ సీపీఎస్ విధానం వల్ల పదవీ విరమణ అనంతరం వృద్ధాప్యంలో తమ ఆర్థిక భద్రత,ఆరోగ్య భద్రత ని కోల్పోతున్నామని ఆందోళన ఉద్యోగ, ఉపాధ్యాయ వర్గాల్లో వెల్లడవుతుంది. పాత పింఛను విధానంలో ఉద్యోగ విరమణ తర్వాత రిటైర్డ్ ఉద్యోగి జీవితం ఆర్థిక భద్రత,ఆరోగ్య భద్రత తో సాఫీగా సాగిపోయేది. అయితే 2004 లో అమలులోకి వచ్చిన కొత్త పింఛను విధానం (సీపీఎస్)తో ఉద్యోగ ఉపాధ్యాయులకి తీవ్రనష్టం జరుగుతుందనే అభిప్రాయం సర్వత్రా వ్యక్తమవుతోంది. ఈ నేపథ్యంలో సీపీఎస్‌కు వ్యతిరేకంగా దేశ వ్యాప్తంగా అనేక తిరుగుబాటు నిరసనలు జరుగుతున్నాయి.

### పిఆర్టీయు మహా ధర్నాకు సిద్ధం..

నూతన పెన్షన్ విధానం అమలులోకి వచ్చిన సెప్టెంబర్ 1వ తేదీన ప్రతి సంవత్సరం రాష్ట్ర వ్యాప్తంగా జిల్లా కేంద్రాలలో పీఆర్ టీయూ ఉపాధ్యాయ సంఘం ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమాలు చేపడుతోంది. కానీ ఈ సంవత్సరం సెప్టెంబర్1న హైదరాబాదులోని ఇందిరా పార్క్ వద్ద ఉపాధ్యాయ ఎమ్మెల్సీ శ్రీపాల్ రెడ్డి మరియు పీఆర్ టీయూ రాష్ట్ర అధ్యక్షులు గుండు లక్ష్మణ్, ప్రధాన కార్యదర్శి దామోదర్ రెడ్డిల ఆధ్వర్యంలో పిఆర్టీయూ సంఘం ఉపాధ్యాయ సంఘం పిలుపుతో రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న ఉద్యోగ ఉపాధ్యాయులందరూ పెద్దఎత్తున తమ నిరసనజ్వాల ఉవ్వెత్తున ఎగసిపడెలా మహా ధర్నాకు




సిద్ధమయ్యారు.

### ఉద్యోగులతో ప్రభుత్వం చెలగాటం..

అష్టకష్టాలు పడి ప్రభుత్వ ఉద్యోగం సాధించి ఉన్నతశిఖరాలు ఎక్కినంత ఆనందాన్ని పొందితే అది కాస్త సీపీఎస్ విధానం వల్ల నీరు కారే పరిస్థితి నెలకొంది. 2004లో కేంద్ర ప్రభుత్వం కొత్త పెన్షన్ విధానాన్ని తీసుకు వచ్చింది. దీంతో రాష్ట్రవ్యాప్తంగా ఉన్న రెండున్నర లక్షల మంది ఉపాధ్యాయ, రెవెన్యూ, పోలీసు, కోర్టు, మున్సిపల్, పంచాయితీరాజ్ తదితర ఉద్యోగుల జీతాల నుంచి ప్రతి నెలా పదిశాతం నగదును తీసుకుని షేర్ మార్కెట్లో పెట్టి ఉద్యోగుల జీవితాలతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చెలగాటమాడుతున్నాయి. నూతన పెన్షన్ విధా నంతో ఉద్యోగులు పదవీ విరమణ పొందిన తర్వాత కనీసం పెన్షన్ వచ్చే పరిస్థితి లేదు. దీంతో ఉద్యోగులపై ఆధారపడి ఉన్న కుటుంబం జీవనోపాధి లేక కొట్టుమిట్టాడే పరిస్థితి నెలకొంది. ఆ ఉద్యోగికి ఎలాంటి ఆర్థిక భరోసా ఇచ్చే పరిస్థితి లేదు. ప్రభుత్వ ఉద్యోగులకు పూర్తిస్థాయిలో ప్రభుత్వాలు భద్రత కల్పించడం లేదంటూ ఆయా ఉద్యోగులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

### వృద్ధాప్య పింఛను కంటే తక్కువ



ప్రస్తుతం తక్కువ సర్వీసు తో ఉద్యోగ విరమణ పొందుతున్న ప్రభుత్వ ఉద్యోగులకు ప్రభుత్వం అందిస్తున్న వృద్ధాప్య ఆసరా పింఛను కంటే తక్కువ పింఛను వస్తుంది. అన్ని ప్రభుత్వ పథకాలని వదులుకుని ప్రభుత్వ ఉద్యోగంలో చేరితే విరమణ అనంతరం ఆసరా పించనుకంటే తక్కువ పింఛను తో ఉద్యోగుల కుంటుంబాలు రోడ్డున పడడం చాలా బాధాకరంగా ఉంది..

**సిద్దేశ్వర్, పిఆర్టియు మండల కార్యదర్శి**

### సీపీఎస్ విధానంపై పీఆర్‌టీయూ నిరంతర పోరాటాలు



సీపీఎస్ విధానాన్ని వ్యతిరేకిస్తూ ఇప్పటి వరకు రాష్ట్రవ్యాప్తంగా పీఆర్ టీయూ ఉపాధ్యాయ సంఘం ఇతర ఉపాధ్యాయ సంఘాలతో కలిసి (టిటిజేఏసీ) జాక్ గా ఏర్పడి సీపీఎస్ కి వ్యతిరేకంగా అనేక పోరాటాలు చేసింది. పీఆర్టీయు ఉపాధ్యాయ ఎం ఎల్ సీ లు అనేక సార్లు సీపీఎస్ రద్దు అంశాన్ని అసెంబ్లీలో లేవనెత్తి గత ప్రభుత్వం పై ఒత్తిడి పెంచి గ్రాట్యుటీ, మరియు ఫ్యామిలీ పెన్షన్‌లని సాధించగలిగారు. ప్రస్తుత ప్రభుత్వం పై కూడా తీవ్రఒత్తిడి తీసుకొచ్చి ఉపాధ్యాయుల ఆకాంక్షలకు అనుగుణంగా సీపీఎస్ విధానం రద్దు అయ్యి పాత పెన్షన్ అమలు అయ్యేంత వరకు ఉద్యమాన్ని కొనసాగిస్తాం.

**కె.చంద్రమౌళి, పిఆర్టీయు మునిపల్లి మండల అధ్యక్షులు**

### పీఎఫ్ఆర్‌డీఏ చట్టాన్ని సవరించాలి



ఈ చట్టంలో మార్పు చేస్తే ప్రభుత్వ ఉద్యోగులకోసం రాష్ట్ర ప్రభుత్వాలు చెల్లించిన సీపీఎస్ వాటా తిరిగి పొందే అవకాశం ఉంటుంది ఉద్యోగుల సీపీఎస్ డబ్బులు తిరిగి వారి ఖాతాలో జమ అయ్యే అవకాశం ఉంటుంది. పాత పెన్షన్ విధానాన్ని రాష్ట్రాలు అమలుచేయడంలో ప్రధాన అడ్డంకిగా ఉన్న పీఎఫ్ ఆర్డీఏ చట్టాన్ని కేంద్రప్రభుత్వం వెంటనే సవరించి రాష్ట్రాలు తమ ఉద్యోగులని పాత పెన్షన్ లోకి మార్చుకునే వెసులుబాటు కల్పించాలి.

**మాణయ్య, పిఆర్టియు జిల్లా అధ్యక్షులు**

## బాల్య వివాహాల నిర్మూలన ప్రతి ఒక్కరి బాధ్యత

- జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్




**నారాయణపేట జిల్లా బ్యూరో, ఆగస్టు 25 (జనం సాక్షి) :** బాల్య వివాహాల నిర్మూలన ప్రతి ఒక్కరి బాధ్య త అని జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్ అన్నారు. మహి ళాభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ - జిల్లా మహిళా సాధికారత కేంద్రం ఆధ్వర్యంలో సోమవా రం జిల్లా అధికారులతో నిర్వ హించిన సమావేశంలో బాల్య వివాహాలకు సంబంధించిన గోడ పత్రికను జిల్లా కలెక్టర్ జిల్లా అదనపు కలెక్టర్ (లోకల్ బాడీస్) సంచిత్ గంగ్వార్,జిల్లా అదనపు కలెక్టర్ (రెవె న్యూ) శ్రీను , ట్రైనింగ్ కలెక్టర్ ప్రణయ్ కుమార్ లతో కలిసి విడుదల చేశారు.బాలికలను రక్షిద్దాం-బాలికలను చదివిద్దాం అనే నినాదంతో బాలికా విద్యపై ప్రత్యేక శ్రద్ధ, లింగ సమానత్వం,బాల్య వివా హాల నిర్మూలనకు బాధ్యతా యుతంగా ప్రతి ఒక్కరు కృషి చేయాలనీ సూచించారు.ఈ కార్యక్రమంలో మహిళా భివృద్ధి శిశు సంక్షేమ శాఖ అధికారులు శ్రీలత, కరిష్మ, సాయి, నర్సింహులు, అనిత, నరసింహ, లక్ష్మీకాంత జిల్లా అధికారులు పాల్గొన్నారు.

## ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రజావాణి

- జిల్లా కలెక్టర్ పి. ప్రవీణ్య



**సంగారెడ్డి, ఆగస్టు 25 (జనం సాక్షి) :** ప్రజా సమస్యల పరిష్కారానికే ప్రజావాణి కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ పి. ప్రావీణ్య పేర్కొన్నారు. కలెక్టరేట్ కార్యాలయాల సముదాయ సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి 35 ఫిర్యాదులు అందాయి. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన ఫిర్యాదుదారులు తమ సమస్యలను కలెక్టర్‌తో పాటు, అదనపు కలెక్టర్లు చంద్రశేఖర్ , మాధురి ,నారాయణఖేడ్ సబ్ కలెక్టర్ ఉమా హారతి, డిఆర్ఓ పద్మజ రాణి , లకు విన్నవిస్తూ అర్జీలు సమర్పించారు. కాగా, ఫిర్యాదులను పెండింగ్‌లో పెట్టకుండా ఎప్పటికప్పుడు పరిశీలన జరుపుతూ, సమస్యలను సత్వరమే పరిష్కరించాలని కలెక్టర్ అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

## ప్రజావాణి ఫిర్యాదులపై ప్రత్యేక దృష్టి పెట్టాలి

- జిల్లా అధికారులను ఆదేశించిన జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి



**వనపర్తి బ్యూరో, ఆగస్టు 25 (జనంసాక్షి) :** ప్రజావాణిలో వచ్చే ఫిర్యాదులను నిర్లక్ష్యం చేయకుండా ఎప్పటికప్పుడు పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో అదనపు కలెక్టర్ రెవెన్యూ ఖీమ్యా నాయక్, అదనపు కలెక్టర్ స్థానిక సంస్థలు యాదయ్య, ఆర్డీఓ సుబ్రమణ్యంతో కలిసి ప్రజల నుండి అర్జీలు స్వీకరించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజావాణి సమస్యలపై ఎప్పటికప్పుడు స్పందిస్తూ, ఫిర్యాదుదారులకు తగిన సమాచారం అందించాల్సిన బాధ్యత అధికారులపై ఉందన్నారు. ముఖ్యమంత్రి ప్రజావాణి, మంత్రి ద్వారా ఈ జిల్లాకు సంబంధించిన ప్రజావాణి ఫిర్యాదులు, ప్రతి సోమవారం జిల్లా ప్రజావాణిలో వచ్చే ఫిర్యాదులను ఎప్పటికప్పుడు పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. ఈరోజు ప్రజావాణికి మొత్తం 45 ఫిర్యాదులు వచ్చాయి.ప్రజల ఫిర్యాదులు సాధ్యమైనంత త్వరగా పరిష్కరించేందుకు అధికారులు కృషి చేయాలని అధికారులను సూచించారు. ప్రజావాణి కార్యక్రమానికి అన్ని శాఖల జిల్లా అధికారులు, వీడియో కాన్ఫరెన్స్ ద్వారా మండల అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## స్థానిక సంస్థల ఎన్నికలకు బీజేపీ శ్రేణులు సిద్ధం

- బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు సబ్బిరెడ్డి వెంకటరెడ్డి

**వనపర్తి బ్యూరో, ఆగస్టు 25 (జనంసాక్షి) :** రాబోవు స్థానిక ఎన్నికలకు బిజెపి శ్రేణులు సిద్ధంగా ఉన్నారని,బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు సబ్బిరెడ్డి వెంకటరెడ్డి, అన్నారు. సోమవారం వనపర్తి మండలం చందాపూర్ గ్రామంలో రాబోయే స్థానిక ఎన్నికల దృష్ట్యా బిజెపి శ్రేణులను ఎన్నికలకు సన్నద్ధం చేయడంలో భాగంగా గ్రామ నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు సబ్బిరెడ్డి వెంకటరెడ్డి హాజరై, మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో స్థానిక సంస్థల ఎన్నికల గడువు ముగిసి రెండేళ్లు కావస్తున్నా కాంగ్రెస్ పార్టీకి, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి, స్థానిక ఎన్నికలకు వెళ్లే దమ్ము ధైర్యం లేదని, అమలుకు సాధ్యం కానీ 6 గ్యారంటీలు 420



హామీలు అమలు చేస్తామని ఎన్నికల్లో గెలిచారని, గద్దెనెక్కాక అమలులో మాత్రం పూర్తిగా వైఫల్యం చెందారని తీవ్రంగా విమర్శించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షులు రామన్నగారి వెంకటేశ్వర రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి పెద్దిరాజు, వనపర్తి మండల అధ్యక్షులు సంద వెంకటేష్ జిల్లా కౌన్సిల్ సభ్యులు పోలేమోని బాలరాజు, ప్రధాన కార్యదర్శి చిన్న నరసింహ, కార్యదర్శి సంపత్, గ్రామ నాయకులు రాఘవేందర్, రాజశేఖర్, రామకృష్ణ ,హరినాథ్ రెడ్డి, ఎల్ల స్వామి, బూత్ అధ్యక్షులు డాకేష్ ,సతీష్ ,నారాయణ తదితరులు పాల్గొన్నారు.

## వైద్య ఆరోగ్యశాఖలో ఖాళీలను భర్తీ చేయండి

**సంగారెడ్డి, ఆగస్టు 25 (జనం సాక్షి) :** వైద్య ఆరోగ్యశాఖలో ఖాళీలను భర్తీ చేయాలని పబ్లిక్ హెల్త్ అండ్ మెడికల్ ఎంప్లాయిస్ యూనియన్ 3194 టీ.జి



(ఐఎన్టియుసి) సంఘం అధ్యక్ష కార్యదర్శులు గండయ్య, ఈర్న భాస్కర్, కోశాధికారి రాములు జిల్లా కలెక్టర్ పి. ప్రావిణ్య కు వినతి పత్రం అందజేశారు. సోమవారం కలెక్టర్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణిలో కలెక్టర్ కు వినతి పత్రం అందజేశారు. అనంతరం ఐఎన్టియుసి యూనియన్ అధ్యక్షులు గండయ్య , ప్రధాన కార్యదర్శి ఈర్న భాస్కర్ మాట్లాడుతూ.. సంగారెడ్డి జిల్లాలోని డియం అండ్ హెచ్ఓ పరిధిలో నర్సింగ్ ఆఫీసర్స్, యంఎల్ హెచ్‌పి కంటింజెంట్ వర్కర్స్ మరియు వివిధ కాంట్రాక్ట్ పోస్టింగులు భర్తీ చేయాలని కోరారు. సంగారెడ్డి జిల్లా వైద్య ఆరోగ్యశాఖలో సుమారు 2 సంవత్సరాలుగా వివిధ విభాగాలలో పోస్టులు (నర్సింగ్ ఆఫీసర్స్, సపోర్టింగ్ స్టాఫ్, యంఎల్ హెచ్‌పి (ఫార్మాసిస్ట్), ప్రాథమిక ఆరోగ్య కేంద్రములలో ఖాళీగా ఉండగా 24 గంటలు పనిచేస్తున్న ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలో నర్సింగ్ ఆఫీసర్స్ (3) చొప్పున షిఫ్ట్ సిస్టం ఉండాలి కాని ఒక్కరు లేదా ఇద్దరు చొప్పున ఉండటముతో ప్రజలకు, గర్భిణీ స్త్రీలకు ప్రసూతి సేవలను అందించడంలో నర్సింగ్ స్టాఫ్ తీవ్ర ఇబ్బందులు పడాల్సి వస్తుందని వారన్నారు.

## క్రీడలు జీవితంలో భాగం కావాలి

- క్రీడల అభివృద్ధికి కృషి చేస్తా
- ఎమ్మెల్యే చిట్టెం పర్ణిక రెడ్డి



**నారాయణపేట జిల్లా బ్యూరో, ఆగస్టు 25 (జనం సాక్షి) :** క్రీడలు మానసిక శారీరక దారుఢ్యం పెంచే క్రీడ లు జీవితంలో భాగం కావాలని నారాయణపేట ఎమ్మెల్యే చిట్టెం పర్ణిక రెడ్డి అన్నారు. నారాయణపేట జిల్లా కేంద్రంలో సోమవారం మండల స్థాయి పాఠశాలల క్రికెట్ పోటీలు నిర్వహించారు.ఈకార్యక్రమానికి ముఖ్య అతిథిగా పాల్గొన్న ఎమ్మెల్యే మాట్లాడుతూ యువకులు, విద్యార్థుల శరీర దృఢత్వానికి ఉపయోగపడే ఆటలను యువకులు విద్యా ర్థులు ఉప యోగించుకోవాలని అన్నారు.అంతేకాకుండా క్రీడల్లో రాణిస్తే ఉద్యోగ అవకాశాలు లభిస్తాయని అన్నారు. అందుకు గాను చదువుతో పాటుక్రీడల్లో రాణించాలని సూచించారు.క్రీడల అభివృద్ధి కోసం తన వంతు కృషి చేస్తానని తెలిపారు.మిని స్టేడియంలో తొందరలోనే సింథటిక్ ట్రాక్ ఏర్పాటుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ ఆర్.సదాశివ రెడ్డి,డి వై ఎస్ ఓ వెంకటేష్,ఎం ఈ ఓ బాలాజీ,యాదయ్య శెట్టి,క్రికెట్ కోచ్ లు అజీమ్,రమణ,రవి కుమార్ ,మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ లు నాగరాజ్ సరాఫ్ ,బండి వేణుగోపాల్,కోట్ల రవీందర్ రెడ్డి,చెన్నారెడ్డి,అశోక్ రెడ్డి,శ్రీనివాసులు, క్రీడాకారులు పాల్గొన్నారు.

# అసైన్డ్ భూముల అక్రమాలపై చర్యలు తీసుకోవాలి

- లేకపోతే ఆందోళన
- తహశీల్దార్ శ్రీనివాస్‌కు బిజెపి వినతి పత్రం

**కృష్ణ, ఆగస్టు 25 (జనం సాక్షి) :** నారాయణపేట జిల్లా లోని కృష్ణ నది పరివాహక ప్రాంతం కృష్ణ మండలంలో జరిగిన అసైన్డ్ భూముల అక్రమాలపై వెంటనే చర్యలు తీసుకోవాలని లేకపోతే బిజెపి ఆధ్వర్యంలో ఆందోళన కార్యక్రమాలు చేపడతామని కృష్ణ మండల బిజెపి నాయకులు సోమవారం కృష్ణ మండలం తహశీల్దార్ శ్రీనివాస్ కు వినతి పత్రం సమర్పించారు.ఈ సందర్భంగా బిజెపి నాయకులు మాట్లాడుతూ మండలం పరిధిలోని మురహరి దొడ్డి, గురజాల తదితర గ్రామాల్లో 1988లో ప్రభుత్వం నిరుపేదలకు కేటాయించిన అసైన్డ్ భూముల్లో గతంలో అనేక అక్రమాలు చోటు చేసుకున్నాయన్నారు. గురజాల గ్రామంలో సర్వే నెంబర్ 24, మురహరి దొడ్డి గ్రామంలో సర్వే నంబర్ 169 లోని ప్రభుత్వం భూమిని 1987 ఇప్పటి రెవెన్యూ అధికారులతో కుమ్మక్కై డబ్బు పరపతి ఉపయోగించుకొని ఉమ్మడి ఆంధ్రకు చెందిన మండవ లక్ష్మీనారాయణ మాజీ ఐజి పోలీస్ అధికారి అక్రమ దారులు ఉపయోగించి రికార్డులన్నీ తారుమారు చేశారనీ అన్నారు. అసలు ఈ ప్రాంతానికే చెందనీ స్థానికేతులైన తన బినామీల పేరిట



పట్టాలు ఇప్పించారనీ తెలిపారు. అక్రమంగా యజమాన్య హక్కు ను కల్పించుకొని చట్ట విరుద్ధంగా ఈ ప్రభుత్వ భూమిని అనుభవిస్తూ అసలైన నిరుపేద రైతుల పొట్ట కొట్టి, కోట్లకు కోట్లు కూడగట్టుకున్నారనీ ఆరోపించారు. ఇదే కాకుండా ఓ అగ్రవర్ణాల కులస్తుడైన స్థానికేతరుడైన ఆంధ్రకు చెందిన యు పవన్ కుమార్ అనే వ్యక్తికి ఒకే మండలంలో రెండు వేరు, వేరు గ్రామాల్లో ప్రభుత్వ భూమి పొందడం ఆశ్చర్యకరంగా ఉందని అన్నారు, చట్ట విరుద్ధం వారు కనీసం కాస్తూలో కూడా లేరనీ కేవలం రికార్డులో మాత్రమే అక్రమంగా వారీ పేరు పొంది ఉన్నారు. అక్రమ వలస దారులకు స్థానిక పోలీసులు వత్తాసు పలకడమే కాకుండా తిరిగి అన్యాయానికి గురైన బాధిత రైతులపైనే అక్రమ కేసులు బనాయించి రైతులను జైలుకు పంపిస్తున్నారనీ మండి పడ్డారు.వీలైతే జైలుకు పంపించడం, లేదంటే ఎమ్మార్వో ముందు బైండోవర్ చేసి నిజమైన రైతులను కాస్తు నుంచి తప్పించుటకు స్థానిక కృష్ణ పోలీస్ స్టేషన్ పోలీస్ అధికారులే మాజీ ఐజి బినామిలకె వత్తాసు పలుకుతూ ఇబ్బందులు పడుతున్నారని అన్నారు.ఆ పోలీస్ అధికారుల చర్యలను మేము తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. ఈ అక్రమాలపై వెంటనే విచారణ చేపట్టి చర్యలు తీసుకుని అతి త్వరలో నిజమైన అర్హులైన ఆ నిరుపేద రైతులకు యజమాన్య హక్కు పట్టాదారు పాసు బుక్కులు జారి చేయాలని తగు న్యాయం చేకూర్చాలని కోరారు.లేకపోతే కలెక్టర్ దృష్టికి తీసుకుపోయి జిల్లా వ్యాప్త ఆందోళన చేపడతామని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో బిజెపి ఉమ్మడి మండల అధ్యక్షుడు నల్లే నర్సప్ప , జిల్లా నాయకులు మజ్జిగ సురేష్, మండల ప్రధాన కార్యదర్శి దండు, రాఘవేంద్ర, కరిమని తిమ్మన్న,ఉపాధ్యక్షుడు డికె.కిష్టప్ప,నాయకులు వడ్ల మారెప్ప, గుంతల హన్మంత్రాయ,గురువు మల్లేష్, సి.మహదేవ్,కట్ల తాయప్ప, జే నర్సింగప్ప,కే.ఆంజనేయులు,శక్తి సింగ్, బి.శంక్రప్ప,చిట్టి సురేష్,బి.శశిధర్,బుర్ర తిరుమలేష్, తదితరులు పాల్గొన్నారు.

## యూరియా కోసం తప్పని తిప్పలు



**చిన్నశంకరంపేట, ఆగస్టు 25 (జనం సాక్షి) :** మండలంలోని చందంపేట సొసైటీ వద్ద యూరియా కోసం గత వారం రోజులుగా రైతులకు తిప్పలు తప్పడం లేదు ఉదయం 6 గంటల నుంచి వేలాది మంది రైతులు సొసైటీ కేంద్రానికి యూరియా కోసం తరలివచ్చి లైన్లో నిలబడ్డారు ప్రభుత్వం ఓవైపు యూరియా కొరత లేదని అంటున్నారు ప్రభుత్వం అధికారులు ఇప్పటికైనా స్పందించి యూరియా కొరత లేకుండా చూడాలని రైతులు కోరుతున్నారు.

## ప్రజావాణి

### ప్రజా ఫిర్యాదులను త్వరితగతిన పరిష్కరించాలి..

- వరంగల్ జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద..



వరంగల్ ప్రతినిధి, ఆగష్టు 25 (జనంసాక్షి): ప్రజా ఫిర్యాదులను త్వరితగతిన పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద అధికారులను ఆదేశించారు. సోమవారం జిల్లా కలెక్టర్ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణిలో జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి ప్రజలు సమర్పించిన వినతులను కలెక్టర్ స్వయంగా స్వీకరించి పరిష్కార నిమిత్తం ఆయా శాఖల అధికారులకు అందజేశారు. ప్రజావాణి కార్యక్రమానికి 151 ఫిర్యాదులు రాగా, అధికంగా రెవెన్యూ సమస్యలు 58, జిడబ్ల్యూ ఎంసీ 30, గృహ నిర్మాణ శాఖ 12, సహకార శాఖ 7, పౌర సరఫరాల శాఖ 5, ఇతర శాఖలకు సంబంధించిన 39 ఫిర్యాదులు అందినట్లు కలెక్టర్ తెలిపారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. ప్రజా సమస్యల సత్వర పరిష్కారం కోసం ప్రజావాణి కార్యక్రమం నిర్వహిస్తామన్నారు. అర్జీలకు ప్రాధాన్యతనిస్తూ ఫిర్యాదులను వెంటవెంటనే పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. ప్రజా ఫిర్యాదులను సంబంధిత అధికారులు పెండింగ్‌లో పెట్టకుండా ఎప్పటికప్పుడు మానవీయ కోణంలో పరిశీలన జరుపుతూ, సమస్యలను పరిష్కరించాలని కలెక్టర్ అధికారులను సూచించారు. ఫిర్యాదులపై చేపట్టిన చర్యలను వివరిస్తూ ఫిర్యాదుదా రులకు సమాచారం తెలియజేయాలని సూచించారు. ఈ ప్రజావాణి కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్‌లు సంధ్యారాణి, డిఆర్ ఓ విజయలక్ష్మి, జెడ్పి సీఈఓ రామిరెడ్డి, డిఎఓ అనురాధ, డిబిసిడిఓ పుష్పలత, ఆర్డీవోలు సత్యపాల్ రెడ్డి, ఉమారాణి, వివిధ శాఖల జిల్లా అధికారులు, తహశీల్దార్లు, సెక్షన్ సూపరింటెండెంట్స్ తదితరులు పాల్గొన్నారు.

### దరఖాస్తుల పరిష్కారానికి అధికారులు కృషి చేయాలి..

- జయశంకర్ భూపాలపల్లి జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ



జయశంకర్ భూపాలపల్లి బ్యూరో, (జనంసాక్షి): ప్రజావాణి కార్యక్రమంలో వచ్చిన దరఖాస్తుల పరిష్కారానికి అధికారులు కృషి చేయాలని జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ ఆదేశించారు. సోమవారం ఐడిఓసి కార్యాలయంలో అన్ని శాఖల అధికారులతో ప్రజావాణి నిర్వహించి జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన ప్రజల నుండి దరఖాస్తులు స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజావాణిలో ప్రజలు వివిధ సమస్యలతో 53 దరఖాస్తులు అందజేశారని కలెక్టర్ తెలిపారు. ప్రజలు అందచేసిన వినతులను పారదర్శకంగా పరిష్కరించడానికి చర్యలు తీసుకోవాలని ఆయన అన్నారు. ప్రతి శాఖ అధికారి తమ శాఖకు సంబంధించి వచ్చిన దరఖాస్తులను ప్రాధాన్యతగా తీసుకుని, నిర్దిష్ట కాలవ్యవధిలో పరిష్కరించి నివేదిక అందచేయాలని కలెక్టర్ ఆదేశించారు. ప్రజావాణిలో వచ్చిన 53 దరఖాస్తుల పరిష్కారానికి అధికారులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సూచించారు. దరఖాస్తులు నిశితంగా పరిశీలించి పెండింగ్ ఉంచకుండా సత్వర పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. ప్రజావాణిలో వచ్చిన దరఖాస్తులను సంబంధిత శాఖల అధికారులకు తగు చర్యల నిమిత్తం ఎండార్స్ చేసినట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు అశోక్ కుమార్, విజయలక్ష్మి, ఆర్డిఓ రవి, అన్ని శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

### ప్రజావాణి ఫిర్యాదులను త్వరితగతిన పరిష్కరించాలి

- ములుగు జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్



ములుగు ప్రతినిధి, ఆగష్టు 25(జనంసాక్షి) : ప్రజా సమస్యల సత్వర పరిష్కారం కోసం నిర్వహిస్తున్న ప్రజావాణి కార్యక్రమంలో వచ్చే ఫిర్యాదులకు ప్రాధాన్యతనిస్తూ త్వరితగతిన పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి 51 దరఖాస్తులు రాగా అత్యధికంగా భూ సమస్యలు 20, గృహ నిర్మాణ శాఖ 10, పెన్షన్ 2, ఉపాధి కల్పన 2, ఇతర శాఖలకు సంబంధించినవి 17 ఫిర్యాదులు అందాయి. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన ఫిర్యాదుదారులు తమ సమస్యలను కలెక్టర్ కు విన్నవిస్తూ అర్జీలు సమర్పించారు. అర్జీలను స్వయంగా పరిశీలించిన కలెక్టర్ పెండింగ్ లో పెట్టకుండా ఎప్పటికప్పుడు మానవతా దృక్పథంతో పరిశీలన జరుపుతూ, సమస్యలను పరిష్కరించాలని అధికారులకు సూచించారు. ఫిర్యాదులపై చేపట్టిన చర్యలను వివరిస్తూ అర్జీదారులకు సమాచారం తెలియజేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు సిహెచ్ మహేందర్ జి, సంపత్ రావు, ఆర్డీఓ వెంకటేష్, డిఆర్డీఓ శ్రీనివాస్ రావు, వివిధ శాఖల జిల్లా అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

### ప్రజావాణి దరఖాస్తులను త్వరితగతిన పరిష్కరించాలి

- నిర్మల్ జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్



నిర్మల్ బ్యూరో, ఆగస్టు25 (జనంసాక్షి) : ప్రజావాణి దరఖాస్తులను త్వరితగతిన పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో కలెక్టర్ పాల్గొని ప్రజల నుంచి వచ్చిన ఫిర్యాదులను స్వయంగా స్వీకరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, ప్రతి దరఖాస్తును పరిశీలించి తక్షణమే స్పందించాలని అధికారులకు సూచించారు. మండలాల వారీగా పెండింగ్ లో ఉన్న ప్రజావాణి దరఖాస్తుల సమస్యలను వెంటనే పరిష్కరించాలన్నారు. ప్రజావాణి కార్యక్రమం అనంతరం అధికారులతో కలెక్టర్ మాట్లాడుతూ, వనమహోత్సవంలో భాగంగా మొక్కలు నాటే ప్రక్రియను త్వరితగతిన పూర్తి చేయాలని తెలిపారు. నాటిన మొక్కలకు సంబంధించిన వివరాలను వెంటవెంటనే ఆన్ లైన్ లో పొందుపరచాలని చెప్పారు. ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం ఎప్పటికప్పుడు వేగవంతంగా పూర్తి చేస్తూ ఉండాలన్నారు. ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారుల కుటుంబ సభ్యుల వివరాల నమోదు ప్రక్రియ వెంటనే పూర్తి చేయాలన్నారు. మండల ప్రత్యేక అధికారులు ఎప్పటికప్పుడు వారి వారి మండలాలను సందర్శిస్తూ, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, ప్రభుత్వ బడులు తనిఖీ చేయాలన్నారు. అనంతరం మట్టి గణపతులను పూజించే విధంగా అవగాహన కలిగించేలా అదనపు కలెక్టర్లతో కలిసి గోడ ప్రతులను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ప్లాస్టర్ ఆఫ్ పారిస్ విగ్రహాల వల్ల పర్యావరణానికి ఎంతో హాని కలుగుతుందని అన్నారు. ప్రజలందరూ మట్టి గణపతులను పూజించాలని చెప్పారు. దీని ద్వారా పర్యావరణాన్ని కాపాడిన వారిమి అవుతామని తెలిపారు. ఈ ప్రజావాణి కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్లు ఫైజాన్ అహ్మద్, కిషోర్ కుమార్, ఆర్డీవో రత్నకళ్యాణి, వివిధ శాఖల అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## ప్రశాంత వాతావరణంలో గణేష్ ఉత్సవాలను నిర్వహించాలి

- విద్యుత్ అధికారులు అప్రమత్తంగా ఉండాలి
- పండుగలను భక్తి భావంతో నిర్వహించు కోవాలి
- గణేష్ నవరాత్రి ఉత్సవాల వేడుకలకు పకడ్బందీ ఏర్పాట్లు
- ములుగు జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్



ములుగు ప్రతినిధి, ఆగష్టు 25(జనంసాక్షి) : గణేష్ నవరాత్రి ఉత్సవాల వేడుకలు ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలని జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ కోరారు. సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో రానున్న గణేష్ నవరాత్రి ఉత్సవాల నేపథ్యంలో ఉత్సవ కమిటీ సభ్యులతో, ఏర్పాట్లపై అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ గత సంవత్సర అనుభవాలను దృష్టిలో పెట్టుకొని ఈ సంవత్సరం ఏర్పాట్లు పకడ్బందీగా నిర్వహించాలని పేర్కొన్నారు. విద్యుత్, మున్సిపల్, పంచాయతీ, పోలీస్ సిబ్బంది సమన్వయంతో ములుగు జిల్లా కేంద్రం తో పాటు ఏటూరునాగారం లోని ముళ్ళకట్ట, రామన్న గూడెం, మంగపేట మండలాల్లో లో-లెవెల్ లో ఉన్న విద్యుత్ తీగలను పరిశీలించి తగు చర్యలు తీసుకోవాలన్నారు. ముఖ్యంగా గణేష్ నిమజ్జనానికి వెళ్లే రూట్లలో విద్యుత్ తీగల విషయంలో ఆ శాఖ సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు. రూట్ క్లియరెన్స్ సమర్పించాలని అన్నారు. వేడుకల కోసం లైటింగ్, శానిటేషన్, బ్లీచింగ్ వంటి పనులను మున్సిపల్, పంచాయతీ శాఖ ఆధ్వర్యంలో పక్కాగా చేపట్టాలని ఆదేశించారు. నిమజ్జన ప్రాంతాల్లో వైద్యాధికారులు మెడికల్ క్యాంపులు ఏర్పాటు చేయాలని అన్నారు. నిమజ్జన ప్రాంతాల్లో షిఫ్ట్ ల వారీగా ఈతగాళ్లను ఏర్పాటు చేయాలన్నారు. లైఫ్ జాకెట్స్ సిద్ధంగా ఉంచాలన్నారు. విద్యుత్, ఇర్రిగేషన్, అగ్నిమాపక, వైద్య శాఖ తదితర శాఖల అధికారులు తమకు కేటాయించిన విధులను సమర్ధవంతంగా నిర్వహించాలని ఆదేశించారు. చెరువుల వద్ద రద్దీ పెరిగే అవకాశం ఉన్నందున క్రేన్ల సంఖ్యను పెంచి ప్రశాంతంగా నిమజ్జనం జరిగేలా తగు ఏర్పాట్లు చేయాలని సంబంధిత అధికారులకు సూచించారు. మత్స్యశాఖ ఆధ్వర్యంలో గజ ఈతగాళ్లను అందుబాటులో ఉంచాలన్నారు. వైద్య ఆరోగ్యశాఖ చే ఆరోగ్య శిబిరాలు ఏర్పాటు చేయాలన్నారు. నవరాత్రి ఉత్సవాలను భక్తి భావంతో నిర్వహించుకునేలా ఏర్పాట్లను చేసుకోవాలని, పండుగను ప్రశాంతమైన వాతావరణంలో జరుపుకొని అధికారులకు ఉత్సవ కమిటీ నిర్వాహకులను కోరారు. ఈ సందర్భంగా ఎస్పీ శబరిష్ మాట్లాడుతూ ఈసారి గణేష్ విగ్రహాల ఏర్పాటు నిర్వాహకులు పోలీస్ వెబ్సైట్లో గణేష్ మండపం పూర్తి వివరాలు నమోదు చేయాలని, తద్వారా వారికి తగిన సేవలు అందుతాయని తెలిపారు. నిమజ్జన ప్రాంతాలైన చెరువుల వద్ద పకడ్బందీ ఏర్పాట్లు చేస్తున్నామని, ప్రత్యేకంగా రాత్రి సమయాల్లో మండపాల నిర్వాహకులు అందుబాటులో ఉండాలని సూచించారు. వాతావరణం కలుషితం కాకుండా ఉండేందుకు మట్టి వినాయకులు ఏర్పాటు చేసేందుకు ప్రోత్సహించాలని, డీజే సౌండ్ సిస్టం అనుమతించకూడదని, మండళ్లు ఏర్పాటు చేసిన చోట్ల, సౌండ్ సిస్టం, నిమజ్జన సమయంలో భక్తి భావనతో కూడిన పాటలను మాత్రమే వేసే విధంగా చూడాలని కోరారు. గత ఉత్సవాలు అనుభవాలు దృష్టిలో ఉంచుకొని ఎటువంటి శాంతిభద్రతల సమస్యలు తలెత్తకుండా ఉత్సవాలను భక్తి భావంతో నిర్వహించుకునే విధంగా ఉత్సవ కమిటీ సభ్యులు పోలీసువారితో సహకరించాలని కోరారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్లు సిహెచ్ మహేందర్ జి, సంపత్ రావు, ఆర్డీఓ వెంకటేష్, డి ఎస్ పి రవీందర్, ఉత్సవ కమిటీ ప్రతినిధులు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## అన్యాయంగా రాజేందర్‌ను ఇరికించారు

- ప్రిన్సిపాల్ కావాలనే పిల్లలతో చెప్పించారు
- పూర్తి విచారణ చేసి అసలు దోషులను శిక్షించాలి
- ధర్మ సమాజ్ పార్టీ, ఎమ్మార్పీఎస్ ఎంఎస్పి నేతల డిమాండ్



జయశంకర్ భూపాలపల్లి బ్యూరో, (జనంసాక్షి): జయశంకర్ భూపాలపల్లి జిల్లాకేంద్రంలోని అర్బన్ రెసిడెన్సియల్ స్కూల్ జరిగిన విషప్రయోగం ఘటనలో టీచర్ పెండెల రాజేందర్ ను కావాలనే అన్యాయంగా ఇరికించారని, ప్రిన్సిపాల్ కావాలనే తనకు అనుకూలంగా ఉన్న పిల్లలతో చెప్పించాడని, దీనిపై పూర్తి విచారణ చేసిన తరువాతనే అసలు దోషులను శిక్షించాలని ధర్మ సమాజ్ పార్టీ జిల్లా అధ్యక్షుడు కొత్తూరు రవీందర్, ఎమ్మార్పీఎస్ ఎంఎస్పి జిల్లా ఇంచార్జి అంబాల చంద్రమౌళిలు డిమాండ్ చేశారు. టీచర్ రాజేందర్ ను నిరాధారమైన ఆరోపణలతో అరెస్టు చేశారని, పూర్తి విచారణ జరిపి తగిన చర్యలు తీసుకోవాలని కోరుతూ బాధిత టీచర్ రాజేందర్ భార్య పెండెల పద్మ సోమవారం జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మకు వినతిపత్రం అందజేసింది. అనంతరం పెండెల పద్మ ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఆవరణలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ధర్మ సమాజ్ పార్టీ జిల్లా అధ్యక్షుడు కొత్తూరు రవీందర్, ఎమ్మార్పీఎస్ ఎంఎస్పి జిల్లా ఇంచార్జి అంబాల చంద్రమౌళిలు ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడుతూ అర్బన్ రెసిడెన్సియల్ స్కూల్ లో జరిగిన సంఘటనపై అధికారులు ఏకపక్షంగా వ్యవహరించారని అన్నారు. క్షేత్ర స్థాయిలో పూర్తి విచారణ చేయకుండానే టీచర్ రాజేందర్ ను అరెస్టు చేయడం సరికాదన్నారు. రెసిడెన్సియల్ స్కూల్ లో ప్రిన్సిపాల్ కు, ఉపాధ్యాయులకు విబేధాలు ఉన్నందున, వన్ సైడ్ ఆలోచించి నిర్ణయం తీసుకోకుండా, పూర్తిస్థాయిలో ఇరువర్గాలను విచారణ చేసి, అసలు నిందితులను పట్టుకోవాలని చెప్పారు. తొందరపాటు నిర్ణయాలతో రాజేందర్ ను శిక్షించి, ఆయన కుటుంబానికి అన్యాయం చేయకూడదని తెలిపారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు పూర్తిస్థాయిలో విచారించి అసలు దోషులను పట్టుకుని శిక్షించాలని వారు కోరారు. ఈ సమావేశంలో ధర్మ సమాజ్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు ఖండే రవి, జిల్లా నాయకులు స్వామినాథన్, మహేష్, రవీందర్, ఎమ్మార్పీఎస్ ఎంఎస్పి జిల్లా నాయకులు బొల్లి బాబు పాల్గొన్నారు.

## నట్టేట ముంచిన నకిలీ మొక్కజొన్న విత్తనాలు!

- పీసు తోడింది... మొక్కజొన్న కంకులు లేవు...
- కొంపముంచిన గోద్రెజ్ 105 నకిలీ విత్తనాలు
- రెండున్నర ఎకరాల్లో మొక్కజొన్న పంట వేస్తే తీవ్ర నష్టం...
- లబోదిబోమంటున్న రైతన్న...
- ఆదుకోవాలని బాధిత రైతు వేడుకోలు...



చెన్నారావుపేట, ఆగస్టు 25 (జనం సాక్షి): నకిలీ మొక్కజొన్న విత్తనాలు నట్టేట ముంచాయి. వేల రూపాయల పెట్టుబడులు పెట్టి మొక్కజొన్న పంటను వేసి సాగు చేస్తే నకిలీ మొక్కజొన్న విత్తనాలతో తీవ్ర నష్టం వాటిల్లింది. దీంతో బాధిత రైతు లబోదిబోమంటున్నాడు. వివరాల్లోకి వెళితే... చెన్నారావుపేట మండలంలోని బోడ మాణిక్యం తండా గ్రామానికి చెందిన భూక్య వాలు నాయక్ గోద్రెజ్ 105 కంపెనీకి చెందిన మొక్కజొన్న విత్తనాలను నర్సంపేటలోని పరమేశ్వర సీడ్స్ షాప్ లో రూ.8 వేల 500 వెచ్చించి 5 ప్యాకెట్లను కొనుగోలు చేసి తీసుకొచ్చాడు. జూన్ నెలలో తనకున్న 2న్నర ఎకరాల వ్యవసాయ భూమిలో మొక్కజొన్న విత్తనాలను వేసి సాగు చేశాడు. మొక్కజొన్న కర్రలు ఏపుగా పెరిగి పీసులు తోడాయి. కాని మొక్కజొన్న కర్రలకు కంకులు లేవు.. గింజలు లేవు... మొక్కజొన్న చేనంతా ఎండిపోతుంది. దీంతో బాధిత రైతు లబో దిబోమంటూ నర్సంపేట లోని పరమేశ్వర సీడ్స్ యజమానిని నిలదీశాడు. దీంతో అతను గోద్రెజ్ 105 విత్తన కంపెనీ సేల్స్ ఆఫీసర్ కు సమాచారం అందించాడు. సేల్స్ ఆఫీసర్ ఐదు రోజుల క్రితం వచ్చి పంటను పరిశీలించి వెళ్లిపోయాడు. కాని ఇప్పటివరకు స్పందించడం లేదని ఆవేదన వ్యక్తం చేశాడు. మొక్కజొన్న పంట సాగు చేయడానికి రూ.80 వేల వరకు పెట్టుబడి పెట్టానని ఆందోళన చెందుతున్నాడు. వ్యవసాయ శాఖ అధికారులు మొక్కజొన్న పంటను పరిశీలించి నకిలీ మొక్కజొన్న విత్తనాలను అంటగట్టిన పరమేశ్వర సీడ్స్ షాపు యజమాని, గోద్రెజ్ 105 నకిలీ మొక్కజొన్న విత్తన కంపెనీ పై తగిన చర్యలు తీసుకొని తనకు నష్టపరిహారం అదేవిధంగా చూసి న్యాయం చేయాలని బాధిత రైతు భూక్య వాలు నాయక్ వేడుకుంటున్నాడు.

## గణపతి నవరాత్రులను సామరస్యంతో జరుపుకోవాలి

- మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్



మంచిర్యాల ప్రతినిధి ఆగస్టు 25 (జనంసాక్షి) : ఈ నెల 27వ తేదీన వినాయక చవితి పురస్కరించుకొని ప్రజలంతా గణపతి నవరాత్రి ఉత్సవాలను ప్రశాంత వాతావరణంలో సామరస్యంతో జరుపుకోవాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. సోమవారం మంచిర్యాల జిల్లాలోని నస్పూర్ లో గల సమీకృత జిల్లా కార్యాలయాల భవన సమావేశ మందిరంలో డిసిపి ఎ.భాస్కర్, బెల్లంపల్లి సబ్ కలెక్టర్ మనోజ్ లతో కలిసి వివిధ శాఖల జిల్లా అధికారులు, మున్సిపల్, పంచాయితీ, పోలీస్, విద్యుత్ ఇతర సంబంధిత శాఖల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ...జిల్లాలో గణపతి నవరాత్రి ఉత్సవాలను ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలని తెలిపారు. వినాయక మండపాల ఏర్పాటు కొరకు పోలీస్ శాఖ అనుమతి తప్పనిసరిగా పొందాలని, అనుమతి పొందిన గణపతి మండపాలకు ఉచిత విద్యుత్ సౌకర్యం అందించడం జరుగుతుందని తెలిపారు. విద్యుత్ లైన్లు, ట్రాన్స్ఫార్మర్ల సమీపంలో మండపాలను నిర్మించవద్దని, రక్షణతో కూడిన వైరింగ్ వ్యవస్థను వినియోగించాలని, షార్ట్ సర్క్యూట్ లను నివారించేందుకు తగు చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఇన్వర్టర్లు, జనరేటర్లను ఉపయోగిస్తున్నప్పుడు జాగ్రత్త వహించాలని, విద్యుత్ సిబ్బందితో వైరింగ్ తనిఖీ చేయించుకోవాలని, ఇందు కొరకు టోల్ ఫ్రీ నం.1912లో సంప్రదించాలని తెలిపారు. గణేష్ మండపాల ఏర్పాటుకు సంబంధించి మండపం ఎత్తు, వెడల్పు, ఏర్పాటు చేసిన ప్రదేశం వివరాలను సమర్పించినట్లయితే నిమజ్జనం రోజున రూట్ మ్యాప్ రూపొందించేందుకు ఉపయోగపడుతుందని తెలిపారు. అగ్ని ప్రమాదాలతో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా అగ్నిమాపక సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని, నిమజ్జనం రోజున అబ్కారీ మధ్య నిషేధ శాఖ ఆధ్వర్యంలో డ్రై డే నిర్వహించాలని, వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో వైద్యులు, సిబ్బంది, అంబులెన్స్ అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. నీటిపారుదల శాఖ ఆధ్వర్యంలో నిమజ్జనం కార్యక్రమాన్ని నిర్వహించేందుకు గాను చెరువులు, గోదావరి నది, ఇతర నిమజ్జన ప్రాంతాలను సిద్ధం చేయాలని తెలిపారు. జిల్లా పౌర సంబంధాల శాఖ ఆధ్వర్యంలో సమాచారాన్ని ఎప్పటికప్పుడు అందించాలని, మున్సిపల్, పంచాయితీ శాఖల ఆధ్వర్యంలో పారిశుధ్య నిర్వహణ పకడ్బందీగా చేపట్టాలని తెలిపారు. నిమజ్జనం రోజున ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా మత్స్యశాఖ ఆధ్వర్యంలో గజ ఈతగాళ్లను అందుబాటులో ఉంచాలని తెలిపారు. ఇందారం సమీపంలోని గోదావరి వంతెన వద్ద సింగరేణి ఆధ్వర్యంలో నిమజ్జనానికి అవసరమైన లైట్లు, క్రేన్లు ఇతర ఏర్పాట చేయాలని తెలిపారు. డి.సి.పి. మాట్లాడుతూ ...గత సంవత్సరం 2 వేల 400 విగ్రహాల ఏర్పాటుకు అనుమతులు జారీ చేయడం జరిగిందని, ఈసారి మండపాల సంఖ్య పెరిగే అవకాశం ఉందని తెలిపారు. ఎలాంటి గొడవలు, ప్రాణ నష్టం జరగకుండా నిఘా నిర్వహిస్తామని, మండపాల ఏర్పాటుకు పోలీసు శాఖ అనుమతులు తప్పనిసరిగా తీసుకోవాలని తెలిపారు. మండపాలలో రాత్రిపూట నిర్వాహకులు తప్పనిసరిగా అందుబాటులో ఉండాలని, భారీ విగ్రహాల వద్ద సి. సి. కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని తెలిపారు.



## రైతులకు యూరియా అందించని ప్రభుత్వం గద్దె దిగాలి

- గిర్నిబావిలో రాస్తారోకో..

వరంగల్ ప్రతినిధి, ఆగస్టు 25 (జనంసాక్షి): రాష్ట్ర రైతాంగానికి సకాలంలో పంటలకు యూరియా అందించని అసమర్ధ కాంగ్రెస్ పార్టీకి తెలంగాణ రాష్ట్రాన్ని పరిపాలించే హక్కు లేదని బిఆర్ఎస్ మండల పార్టీ అధ్యక్షులు సుకినే రాజేశ్వరరావు పాలకుల తీరును దివ్య దుయ్య బట్టారు. సోమవారం వరంగల్ జిల్లా దుగ్గొండి మండలంలోని గిర్ని బావిబావి సెంటర్లో బిఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో రైతులకు యూరియా అందించాలని ధర్నా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మోసపూరిత హామీలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం రైతులను మోసం చేసిందన్నారు. రైతులకు సరిపడా యూరి అందించే వరకు బారాస పార్టీ రైతులకు అండగా ఉంటుందని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా మాజీ జడ్పీ వైస్ చైర్మన్ ఆకుల శ్రీనివాస, మాజీ ఎంపీపీ కట్ల కొమల భద్రయ్య, క్లస్టర్ ఇంచార్జిలు కంచరకుంట్ల శ్రీనివాస్ రెడ్డి, శంకేసి కమలాకర్, గుండెకారి రంగారావు, తదితరులు పాల్గొన్నారు.

## గంజాయిపై ఉక్కుపాదం

- వ్యవసాయ భూమిలో 95 గంజాయి మొక్కలు స్వాధీనం



ఆదిలాబాద్ ప్రతినిధి (జనంసాక్షి) : జిల్లాలో ఎస్పీ గంజాయిపై ఉక్కు పాదం మోపుతున్నారు. సోమవారం నార్నూర్ పోలీస్ స్టేషన్ జిల్లా పోలీసు అధికారికి వచ్చిన సమాచారం మేరకు సిసిఎస్ బృందం నార్నర్ పోలీసులు సంయుక్తంగా నార్నూర్ మండలంలోని సుంగాపూర్ గ్రామ శివారులో గాంజాయ్ పండిస్తున్నారనే విశ్వసనీయ సమాచారం మేరకు పంటచేళ్లలో తనిఖీ చేయగా, నార్నూర్ మండలం సుంగాపూర్ గ్రామ నివాసి కొడప దేవురావు అనే వ్యక్తి వ్యవసాయ భూమిలో చట్ట వ్యతిరేకంగా పండిస్తున్న 95 గంజాయి మొక్కలు స్వాధీనం చేసుకుని అతనిపై నార్నూర్ పోలీస్ స్టేషన్ లో ఎన్ డిపిఎస్ కేసు నమోదు చేశారని జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ తెలిపారు. ఈ సందర్భంగా సోమవారం స్థానిక పోలీస్ కార్యాలయం నుండి ఒక ప్రకటన విడుదల చేస్తూ ఎస్పీ మాట్లాడుతూ వ్యవసాయ భూమిలో చట్ట వ్యతిరేకంగా గంజాయి మొక్కలను పండిస్తున్న వ్యక్తి పై నార్నర్ పోలీస్ స్టేషన్ కేసు నమోదు చేసి రిమాండ్ కు తరలిస్తున్నట్లు తెలిపారు. ఆదిలాబాద్ జిల్లాను గంజాయి రహిత జిల్లాగా నిర్మించడానికి జిల్లా పోలీసు యంత్రాంగం అహర్నిశలు విధులను



నిర్వర్తిస్తుందని, గంజాయిని జిల్లాలో రూపుమాపడానికి అనుక్షణం జిల్లా పోలీస్ యంత్రాంగం కృషి చేస్తుంటారని తెలిపారు. ఎట్టి పరిస్థితుల్లోనూ గంజాయి జిల్లాలో లభ్యమవ్వకుండా పటిష్టమైన చర్యలను చేపడుతున్నట్లు తెలిపారు. గంజాయి పండించడం, వ్యాపారం చేయడం, సేవించడం, రవాణా చేయడం చట్టరీత్యా నేరం నిబంధనలు ఉల్లంఘించిన వారిపై కఠిన చర్యలు తీసుకోబడతాయని హెచ్చరించారు. లభ్యమైన 95 గాంజాయ్ మొక్కల విలువ బహిరంగ మార్కెట్లో ఒక మొక్క పదివేల చొప్పున మొత్తం 9.5 లక్షల విలువ చేస్తుందని తెలిపారు. వాటి బరువు 12.4 కిలోలుగా ఉంటుంది. సంఘటన స్థలంలో వ్యవసాయ అధికారిచే ధ్రువీకరించి పంచనామ నిర్వహించి కేసు దర్యాప్తును చేయడం జరిగిందని తెలిపారు. గంజాయి పై ఉక్కు పాదం మోపుతున్నట్లు గంజాయి పై ప్రత్యేక బృందాలు ఏర్పాటు చేసి జిల్లాలో గంజాయి లేకుండా చర్యలను చేపడుతున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో నార్నర్ సీఐ పి ప్రభాకర్, సిసిఎస్ ఇన్స్పెక్టర్ పి చంద్రశేఖర్, నార్నూర్ ఎస్సై కే అఖిల్, సిసిఎస్ సిబ్బంది, పోలీస్ స్టేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

జనంసాక్షి
www.janamsakshi.org
మంగళవారం
26 ఆగస్టు 2025

## పెండింగ్ ప్రజావాణి ఫిర్యాదులను వారం రోజుల్లో పరిష్కరించాలి

- **జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్**



**సూర్యాపేట ప్రతినిధి, ఆగస్టు 25 (జనంసాక్షి) :** పెండింగ్‌లో ఉన్న ప్రజావాణి ఫిర్యాదులను వారం రోజుల్లో పరిష్కరించాలని లేదంటే తగు చర్యలు తీసుకుంటామని జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ హెచ్చరించారు. ప్రజావాణి కార్యక్రమంలో భాగంగా సోమవారం కలెక్టరేట్‌లో ప్రజల వద్ద నుండి ఫిర్యాదులను స్వీకరించారు. ఫిర్యాదుల పరిష్కారం అనంతరం జిల్లా అధికారులతో నిర్వహించిన సమావేశంలో జిల్లా కలెక్టర్ వివిధ అంశాలను సమీక్షిస్తూ కొన్ని శాఖల్లో ఎక్కువ రోజుల నుండి ప్రజావాణి ఫిర్యాదులు పెండింగ్ లో ఉన్నాయని, అలాంటి శాఖల అధికారులు వారం రోజుల్లో పెండింగ్ ఫిర్యాదులన్నింటినీ పరిష్కరించాలని, లేనట్లయితే తగు చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. జిల్లా అధికారులు సమస్యల పరిష్కారంతో పాటు, ప్రభుత్వ పథకాల సక్రమ అమలుకు క్షేత్రస్థాయిలో విస్తృతంగా పర్యటించాలని, తనకు ప్రతిరోజు నివేదికలు సమర్పించాలని ఆదేశించారు. భూములకు సంబంధించి 38 ఫిర్యాదులు, ఎంపీడీవోలకు 11, జిల్లా, ఇతర అధికారులకు 47 ఫిర్యాదులు, మొత్తం 96 ఫిర్యాదులు వచ్చాయని తెలిపారు. వీటన్నింటిని సంబంధిత శాఖల అధికారులకు పంపడం జరిగిందని జాగ్రత్తగా పరిశీలించి జాప్యం లేకుండా వేగంగా పరిష్కరించినందుకు అధికారులు చర్యలు తీసుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ పి.రాంబాబు, డిఆర్డిఓ పిడి వివి.అప్పారావు, డిఎఫ్ఓ సతీష్ కుమార్, జిల్లా వ్యవసాయ అధికారి శ్రీధర్ రెడ్డి ,జిల్లా అధికారులు ప్రజల నుండి ఫిర్యాదులను స్వీకరించారు.

## పురాతన బంగారు నాణేలు అమ్ముతామని మోసం

- **రూ.20 లక్షల దోచుకున్న నిందితులు**
- **నలుగురు నిందితులను అరెస్టు చేసిన చివ్వెంల పోలీసులు**
- **రూ.13.25 లక్షల నగదు స్వాధీనం**
- **సూర్యాపేట డీఎస్పీ ప్రసన్నకుమార్**



**సూర్యాపేట ప్రతినిధి, ఆగస్టు 25 (జనంసాక్షి) :** సూర్యాపేట డిఎస్పీకార్యాలయంలో సోమవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో కేసు వివరాలను డీఎస్పీ ప్రసన్నకుమార్ వెల్లడించారు.పురాతన బంగారు నాణేలు అమ్ముతామని నమ్మబలికి రూ.20 లక్షలు మోసపూరితంగా దోచుకున్న నలుగురు నిందితులను అరెస్ట్ చేసి వారి వద్ద నుండి రూ.13.25 లక్షల నగదు ఆధారాలను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు.తుమ్మల పెన్ పహాడ్ గ్రామానికి చెందిన, దురాజుపల్లి గ్రామ శివారులో హెూటల్ నిర్వహిస్తున్న నిమ్మనగోటి వెంకటేశ్వర్లు అనే వ్యాపారిని నిందితులు ఏ1 పశుపుల గణేష్, ఏ2 ఓర్సు చంటి ఇరువురు కలిసి పాత పరిచయం ఉన్న హెూటల్ యజమాని వెంకటేశ్వర్లు వద్దకు వెళ్లి తమ వద్ద పాత బంగారు నాణేలు ఉన్నాయని చెప్పారన్నారు.తక్కువ ధరకు అమ్ముతామని 20 లక్షలకు బేరం కుదుర్చుకుని ఈ నెల 10న రూ.5 లక్షల బయనాగా, ఆ మరునాడు రూ.15 లక్షల తీసుకున్నట్లు తెలిపారు. డబ్బులు కట్టిన తర్వాత నాణేల అడగగా ఇవ్వలేదని,విచిత్రమైన వీడియోలు పంపి గుర్తు తెలియని వ్యక్తులు తమ వద్ద డబ్బు దోచుకెళ్లారని చెప్పారన్నారు.మోసం గుర్తించిన హెూటల్ యజమాని చివ్వెంల పోలీస్ స్టేషన్ నందు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేయడం జరిగిందన్నారు.దర్యాప్తులో భాగంగా సోమవారం నలుగురు నిందితులను దురాజ్‌పల్లి గ్రామ శివారులో అదుపులోకి తీసుకోవడం జరిగిందని చెప్పారు.వీరి నుండి రూ.13.25 లక్షల నగదు రికవరీ చేశామన్నారు. మొత్తం 9 మందిపై కేసు నమోదైందని, వీరిలో నలుగురు నిందితులను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు. నిందితులు పురాతన కాలం నాటి కుండలో బంగారు నాణేలు లభించాయని అబద్ధపు కథను సృష్టించి, తక్కువ ధరకే వాటిని అమ్ముతామని నమ్మబలికారని అన్నారు.ఈ నెల 10న రూ.5 లక్షలు, 11న రూ.15 లక్షలు వసూలు చేశారన్నారు.అనంతరం రెండు కోళ్ళను కోసి వాటి రక్తంతో గాయాలున్నట్లుగా నకిలీ వీడియో తీసి బాధితుడికి పంపి, గుర్తు తెలియని వ్యక్తులు డబ్బులు దోచుకుపోయారని నమ్మబలికారని పేర్కొన్నారు. అదనంగా భయపెడుతూ ఫోన్‌పే ద్వారా రూ.10 వేలు వసూలు చేశారన్నారు. పసుపుల గణేష్ రూ.12.50 లక్షలు, ఓర్సు చంటి రూ.6లక్షలు, ముద్దంగుల వెంకన్న ఒక లక్ష, పసుపుల సత్యం 50 వేల రూపాయలు పంచుకున్నారని తెలిపారు.పోలీసులు నిందితులు గణేష్ వద్ద రూ.9.80 లక్షలు, చంటి వద్ద రూ.3.20 లక్షలు, వెంకన్న వద్ద రూ.25 వేలు, అలాగే నకిలీ వీడియో తయారు చేయడానికి ఉపయోగించిన మొబైల్ ఫోన్ ను సాక్షుల సమక్షంలో పంచనామా ద్వారా స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. డీఎస్పీ ప్రసన్న కుమార్ ఆదేశాల మేరకు సూర్యాపేట రూరల్ సీఐ రాజశేఖర్ పర్యవేక్షణలో చివ్వెంల ఎస్ఐ మహేశ్వర్, సిబ్బంది ఈ కేసు ఆపరేషన్ ను విజయవంతంగా నిర్వహించారు.పురాతన నాణేలు, ఖజానా, త్వరగా డబ్బులు వస్తాయంటూ ఎవరైనా నమ్మబలికితే ప్రజలు మోసపోవద్దని సూచించారు. ఇటువంటి అనుమానాస్పద ఆఫర్లు వచ్చినప్పుడు వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు.

## రాజీవ్ స్వగృహ ఫ్లాట్ కొరకు 2 లక్షలు చెల్లించి పేరు రిజిస్టర్ చేసుకోవాలి

- **జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి**



**ఖమ్మం, ఆగస్టు 25 (జనం సాక్షి) :** రాజీవ్ స్వగృహ జలజ టౌన్ షిప్ లో ఫ్లాట్ కొరకు ఆసక్తి గల ఉద్యోగులు ఆగస్టు 30 లోపు 2 లక్షల రూపాయలు చెల్లించి పేరు రిజిస్టర్ చేసుకోవాలని జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి అన్నారు. జిల్లా కలెక్టర్, అదనపు కలెక్టర్ డాక్టర్ పి. శ్రీజ, రాజీవ్ స్వగృహ సీఈ భాస్కర్ రెడ్డి లతో కలిసి కలెక్టరేట్ సమావేశ మందిరంలో రాజీవ్ స్వగృహ జలజ టౌన్ షిప్ పై సోమవారం సంబంధిత అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి మాట్లాడుత ఖమ్మం జిల్లాలో రాజీవ్ స్వగృహ జలజ టౌన్ షిప్ ప్రాజెక్టు 9 ఎకరాల 22 గుంటలలో నిర్మించిన 8 టవర్లలో అసంపూర్తిగా ఉన్న 576 ఫ్లాట్ లను ప్రభుత్వ ఉద్యోగులకు కేటాయించాలని ప్రభుత్వం నిర్ణయించిన నేపథ్యంలో నోటిఫికేషన్ జారీ చేసి సమావేశం నిర్వహించామని, గజం భూమి 1150 రూపాయల ధర నిర్ణయించామని అన్నారు. జలజ టౌన్ షిప్‌లో ఉన్న 8 టవర్లు ఉద్యోగులకు లాటరీ పద్ధతిన అందించడానికి ప్రభుత్వం నిర్ణయం తీసుకుందని అన్నారు. సొంత ఇళ్ళు కావాలని ఆసక్తి ఉన్న ప్రభుత్వ ఉద్యోగులు ఈ లాటరీలో పాల్గొని తమ కలను నెరవేర్చుకోవాలని కలెక్టర్ సూచించారు. రివర్ వ్యూ తో టవర్స్ బాగా ఉన్నాయని, ఖమ్మం నగరంలో అభివృద్ధి త్వరగా జరిగే ప్రాంతంలో ఈ టవర్లు ఉన్నాయని తెలిపారు. ఖమ్మం దేవరపల్లి జాతీయ రహదారి వల్ల రోడ్డు కనెక్టివిటీ పెరుగుతుందని, మున్నేరు నదిపై రిటైనింగ్ వాల్ నిర్మాణంతో వరద ముంపు ఇకపై ఉండదని అన్నారు. టౌన్ షిప్ వద్ద 60 అడుగుల రోడ్డు, జలజ టౌన్ షిప్ కు అన్ని రకాల అనుమతులు ఉన్నాయని తెలిపారు. ప్రభుత్వ ఉద్యోగులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని ఆసక్తి గలవారు ఫ్లాట్ పొందవచ్చని అన్నారు. రాజీవ్ స్వగృహ సీఈ భాస్కర్ రెడ్డి మాట్లాడుతూలి జలజ టౌన్ షిప్ లో 9.22 ఎకరాల విస్తీర్ణంలో 8 టవర్ లలో మొత్తం 576 ప్లాట్స్ నిర్మించడం జరిగిందని అన్నారు. చదరపు గజానికి 1150 రూపాయల ధర నిర్ణయించామని అన్నారు. భవన నిర్మాణ నాణ్యతలో ఎటువంటి లోపాలు లేవని అన్నారు. జలజ టౌన్ షిప్ లోని ప్లాట్లు ప్రభుత్వ ఉద్యోగులకు విక్రయించాలని ప్రభుత్వం నిర్ణయించిందని, ఆసక్తి గల ఉద్యోగులు ఫ్లాట్ కోసం రెండు లక్షల రూపాయలు చెల్లించి సెప్టెంబర్ 8న జరిగే లాటరీలో పాల్గొన్నాలని అన్నారు. ఈ సమావేశంలో డి.ఆర్.ఓ. ఏ. పద్మశ్రీ, డిఆర్డీవో సన్యాసయ్య, జిల్లా అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## టేకులపల్లిలో సైబర్ నేరగాళ్ల అరెస్ట్



టేకులపల్లి, ఆగస్టు 25 (జనంసాక్షి) : సైబర్ నేరాలకు టేకులపల్లి మండల యువకులు పాల్పడుతూ రూ. 8.5 కోట్లు లావాదేవీలు జరపడంతో గత రెండు రోజుల క్రితం %చీజ్రా% (నేషనల్ సైబర్ క్రైమ్ రిపోర్టింగ్ పోర్టల్) ద్వారా జిల్లా సైబర్ సెక్యూరిటీ బ్యూరోకు అందిన ఫిర్యాదుల మేరకు టేకులపల్లి పోలీసులు, జిల్లా సైబర్ క్రైమ్ పోలీసులు సంయుక్తంగా ఆదివారం( 24.08.2025) మధ్యాహ్నం 2.30 గంటల సమయంలో టేకులపల్లి ప్రభుత్వ జూనియర్ కళాశాల నందు ఉన్న 13 మంది వ్యక్తులను అదుపులోకి తీసుకోవడం జరిగింది. దీంతో టేకులపల్లి మండల ప్రజలు ఒక్కసారిగా ఉల్కి పడ్డారు. రాష్ట్రంలోనే సైబర్ నేరాల్లో అతిపెద్ద రెండవ కేసుగా నమోదు కావడం విశేషం. దీనికి సంబంధించిన వివరాలను భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఎస్పీ రోహిత్ రాజ్ వివరాలను సోమవారం వెల్లడించారు.టేకులపల్లి మండల కేంద్రంలో మీ-సేవ కేంద్రాన్ని నడుపుతున్న బోడా శ్రీధర్ అనే వ్యక్తికి టెలిగ్రామ్ యాప్ ద్వారా పరిచయమైన సైబర్ నేరగాళ్లు ఇతరులకు నగదును బదిలీ చేస్తే కమీషన్ ఇస్తామని చెప్పడంతో ఇతనితో పాటు టేకులపల్లి మండలానికి చెందిన మరో 12 మంది చదువుకున్న యువకులు నకిలీ పత్రాలతో 60 కరెంట్ అకౌంట్లను తెరిచి ఇతరుల బ్యాంకు ఖాతాలలోకి నగదును పంపిస్తూ కమీషన్లు పొందుతూ సైబర్ నేరాలకు పాల్పడుతున్నారు. గత ఆరు నెలలుగా మొత్తం 8.5 కోట్ల రూపాయల లావాదేవీలు జరిగినట్లుగా గుర్తించడం జరిగింది. వీరి వద్ద నుండి 12 సెల్ఫోన్లను, ఒక బ్యాంకు పాస్ బుక్ ను స్వాదీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు తెలిపారు. దేశవ్యాప్తంగా వీరి బ్యాంక్ ఖాతాలపై 108 ఫిర్యాదులు అందాయని తెలిపారు. సైబర్ నేరాలకు పాల్పడుతూ పట్టుబడిన యువకులు టేకులపల్లి మండలానికి చెందిన వారిలో బోడ శ్రీధర్( టేకులపల్లి), బోడ రాజేష్ (రాంపురం) , బోడ రాజన్న (టేకులపల్లి), బానోత్ జగదీష్ (సింగ్య తండ), తేజావత్ నరేష్ (బిల్లుడు తండా), పోలె పొంగు పవన్ కళ్యాణ్ (టేకులపల్లి), భూక్య వీరన్న (బద్దు తండ), జాటోత్ నరేష్ (పాత తండా), బోడ జంపన్న (టేకులపల్లి), బోడ రాజారాం (రాంపురం తండా), భూక్య ప్రవీణ్ (బద్దు తండ) , మాలోతు ప్రవీణ్ (మద్దిరాల తండా), ఉరిమెళ్ళ భరత్ కృష్ణ (టేకులపల్లి) పట్టుబడిన ఈ 13 మంది వ్యక్తులను జ్యుడీషియల్ రిమాండ్ నిమిత్తం ఇల్లందు కోర్టుకు తరలించారు. సైబర్ నేరగాళ్లను టేకులపల్లి పోలీసు అధికారులు టేకులపల్లి సీఐ బత్తుల సత్యనారాయణ, టేకులపల్లి ఎస్సై ఏ. రాజేందర్, సైబర్ క్రైమ్ సీఐ. ఎస్ జితేందర్, సిబ్బందిని ఎస్పీ అభినందించారు.

## మొయినాబాద్‌లో వ్యవసాయ మార్కెట్‌ను ఏర్పాటు చేసేందుకు కృషి చేయాలి



**మొయినాబాద్, ఆగస్టు 25 (జనం సాక్షి) :** నగర శివారు మొయినాబాద్‌లో వ్యవసాయ మార్కెట్ ను ఏర్పాటు చేసేందుకు కృషి చేయాలని రంగారెడ్డి జిల్లా కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు సర్దార్ నగర్ మార్కెట్ కమిటీ డైరెక్టర్ బొక్క బాలకృష్ణరెడ్డి, వైస్ చైర్మన్ జంగయ్య, అభిప్రాయపడ్డారు. అదే విధంగా మొయినాబాద్ లో మేకల మండీ ఏర్పాటు కోసం కూడా ప్రతిపాదనలు సిద్ధం చేసినట్లు తెలిపారు. ప్రభుత్వానికి నివేదికను అందజేయడం జరుగుతుందని చెప్పారు. సోమవారం మొయినాబాద్ తహసీల్దార్ కార్యాలయం సమీపంలో ఉన్న ప్రభుత్వ స్థలాన్ని పరిశీలించారు. నగర శివారు ప్రాంతం కావడంతో మొయినాబాద్ లో వ్యవసాయ మార్కెట్ ను ఏర్పాటు చేయడం ద్వారా స్థానిక ప్రజలకు ఉపాధి అవకాశాలతో పాటు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని పేర్కొన్నారు. అనంతరం మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం వ్యవసాయానికి అధిక ప్రాధాన్యత ఇస్తున్నట్లు తెలిపారు. షాబాద్, చేవెళ్ల మండలాల్లో వ్యవసాయ మార్కెట్లు ఉన్నాయని... కానీ మొయినాబాద్‌లో మాత్రం లేదని పేర్కొన్నారు. ఈ విషయంలో ప్రభుత్వం కూడా చొరవ చూపి ఏర్పాటు చేసే విధంగా కృషి చేయాలని కోరారు. నగర శివారు ప్రాంతం కావడంతో ఇక్కడ ఏర్పాటు చేయడం ద్వారా ప్రజలకు మరింత సౌలభ్యంగా ఉంటుందని అభిప్రాయపడ్డారు.ఈ కార్యక్రమంలో డైరెక్టర్లు కొత్త జైపాల్ రెడ్డి, పాటి శ్రీనివాస్ రెడ్డి, సత్యనారాయణ, శ్రీరాంరెడ్డి, కావాలి రమేష్ పాల్గొన్నారు.

## వికలాంగులకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలి



**నంగునూరు, ఆగస్టు 25 (జనం సాక్షి) :** ఎన్నికల ముందు సీఎం రేవంత్ రెడ్డి వికలాంగులకు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని వికలాంగుల సంక్షేమ సంఘం జిల్లా మాజీ అధ్యక్షుడు కట్కూరి యాదగిరి డిమాండ్ చేశారు. ఎన్నికల సమయంలో అలవి కాని హామీలను ఇచ్చి కాంగ్రెస్ ప్రభుత్వం నేడు వాటిని గాలికి వదిలి చేతకాని పాలనను సాగిస్తోందని విమర్శించారు. సిద్దిపేట జిల్లా నంగునూరు మండల కేంద్రంలోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో బీఆర్ఎస్ నాయకులు ఆరెపల్లి రాజయ్య, దేవులపల్లి కనకయ్య లతో కలిసి ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ ఎన్నికల వేళలో వికలాంగులకు పెన్షన్ రూ.4 వేల రూ.6 వేలకు పెంచుతామని చెప్పి అధికారంలోకి వచ్చిన తర్వాత మాట తప్పారని ఆరోపించారు. వికలాంగులకు ఇచ్చిన ఏ ఒక్క హామీని కూడా అమలు చేయలేదని మండిపడ్డారు. సిఎం రేవంత్ రెడ్డి వికలాంగులకు ఇచ్చిన ప్రతి హామీని వెంటనే అమలు చేయాలని లేని పక్షంలో వికలాంగులతో కలిసి సీఎం కార్యాలయాన్ని ముట్టడిస్తామని ఆయన హెచ్చరించారు.

## వ్యక్తిగత పరిశుభ్రత పాటిస్తే వ్యాధులు దరిచేరవు

**నంగునూరు, ఆగస్టు 25 (జనం సాక్షి) :** పరిసరాల పరిశుభ్రతతో పాటు వ్యక్తిగత శుభ్రత పాటిస్తే ఎలాంటి వ్యాధులు దరిచేరవు అని రాజగోపాలపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రం డాక్టర్ ఉదయ్ కుమార్ అన్నారు. సోమవారం నంగునూరు మండలం పాలమాకుల షెడ్యూల్ కులాల అభివృద్ధి శాఖ వసతి గృహాన్ని ఆయన సందర్శించి విద్యార్థుల ఆరోగ్య పరిస్థితిని తెలుసుకున్నారు. ఈ సందర్భంగా విద్యార్థులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. ప్రస్తుత సీజన్‌లో జ్వరాలు వస్తే వెంటనే దగ్గరలో ఉన్న ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తరలించాలని సూచించారు.



డాక్టర్ వెంట హెచ్ ఈ ఓ స్వామి, వార్డెన్ గణేశ్, ఏఎన్ఎం పద్మ, హెల్త్ అసిస్టెంట్ మహేందర్‌లు ఉన్నారు.

## ప్లాట్లు కోల్పోతున్న తమకు న్యాయం చేయాలని బాధితుల వినతి



**చేవెళ్ల, ఆగస్టు 25 (జనంసాక్షి) :** బీజాపూర్ రహదారి విస్తరణలో భాగంగా చేవెళ్లలో నిర్మిస్తున్న బైపాస్ రోడ్డులో ప్లాట్లు కోల్పోతున్న తమకు పరిహారం ఇచ్చి న్యాయం చేయాలంటూ బాధితులు సోమవారం చేవెళ్ల ఆర్డిఓ కార్యాలయంలో ప్రజావాణిలో వినతిపత్రం ఇచ్చారు. సర్వేనెంబర్ 89,90లలో 2016లో లక్ష్మీ నగర్ పేరిట వెంచర్ చేయగా తాము ప్లాట్లు కొనుగోలు చేసినట్లు వారు తెలిపారు. 2018లో బీజాపూర్ రహదారి విస్తరణ కోసం నోటిఫికేషన్ జారీ చేశారని పేర్కొన్నారు. తాము కొనుగోలు చేసిన ప్లాట్లు బైపాస్ రహదారి కోసం సేకరిస్తున్నప్పటికి పరిహారం మాత్రం అందలేదన్నారు. ఎనిమిదెళ్లుగా పరిహారం కోసం ఎదురుచూస్తున్నట్లు బాధితులు తెలిపారు. ప్రస్తుత ప్రభుత్వ మార్కెట్ విలువ ప్రకారం పరిహారం చెల్లించి న్యాయం చేయాలని బాధితులు కోరుతూ వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో బాధితులు భూపాల్ రెడ్డి, బస్వరాజ్, సందీప్ కుమార్, వేణు, సుదర్శన్ రెడ్డి, శివకుమార్, రాజేందర్ రెడ్డి, గోవర్ధన్, సుదర్శన్ రెడ్డి, ప్రతాప్ రెడ్డి, లక్ష్మణ్, ఫర్హాన్, జంగారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# రాష్ట్రాన్ని బంగారు తెలంగాణగా మారుస్తాం

- **బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రామ్ చందర్ రావు**



**నిజామాబాద్ జిల్లా బ్యూరో, ఆగస్టు 25 (జనం సాక్షి) :** తెలంగాణ రాష్ట్రం ఏర్పడ్డాక బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీలు అధికారంలో ఉండి ఏమాత్రం తెలంగాణ అభివృద్ధికి నోచుకోవడం లేదని, బిజెపి పార్టీతోనే కొట్లాడి తెచ్చుకున్న తెలంగాణను బంగారు తెలంగాణగా మార్చి తీరుతామని బిజెపి రాష్ట్ర అధ్యక్షులు రామచంద్ర రావు అన్నారు. సోమవారం నిజామాబాద్ జిల్లా కేంద్రంలోని ఓ ప్రైవేట్ ఫంక్షన్ హాల్‌లో బూత్‌స్థాయి సభ్యుల సమ్మేళనం కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా హాజరై ప్రసంగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతు బంధును రాష్ట్ర ప్రభుత్వం మరిచిపోయిందని విమర్శించారు. కేంద్రంలో ఉన్న బిజెపి ప్రభుత్వం దేశవ్యాప్తంగా రైతులకు రూ. 6 వేలు చెల్లిస్తూ వస్తోందన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వస్తే మార్పు తీసుకువస్తామని అధికారంలోకి వచ్చిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి విద్యార్థులను, నిరుద్యోగులను మోసం చేస్తోందన్నారు. ఇక ఇందిరమ్మ ఇండ్లు ప్రజలకు ఎప్పుడు ఇస్తారో వారికి స్పష్టత లేదని అన్నారు. అబద్దాల ప్రచారంలో కాంగ్రెస్ పార్టీ తల్లి లాంటిదని, ఇది ఓట్ చోరీ కాదు రాహుల్ గాంధీ బ్రెయిన్ చోరీ అంటూ తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు. బీజేపీ బిసిలకు 46 శాతం రిజర్వేషన్ ఇస్తుందని, కానీ రాష్ట్రంలో అధికారంలో ఉన్న కాంగ్రెస్ పార్టీ 42 శాతం రిజర్వేషన్లు అని చెబుతూ అందులో ముస్లింలకు 10 శాతం ఇస్తోంది. అంటే 32 శాతమే ఇస్తున్నట్లు బీసీలను మభ్యపెట్టె కుట్ర పన్నుతుందన్నారు. కాంగ్రెస్, బీఆర్ఎస్ కలిసి బీజేపీ పై తప్పుడు ప్రచారం చేస్తోందని, వీటన్నిటిని తిప్పి కొట్టాల్సిన సమయం అవసరం బిజెపి శ్రేణులపైనే ఉందన్నారు. కాంగ్రెస్ పార్టీ స్థానిక సంస్థల ఎన్నికల్లో ఓడిపోతుందనే భయంతోనే స్థానిక సంస్థలఎన్నికలు పెట్టడం లేదన్నారు. తెలంగాణలో బీఆర్ఎస్ ను చూశాం కాంగ్రెస్ ను చూశాం. ఒక్కసారి బిజెపికి అవకాశం ఇవ్వండి అంటూ ప్రజలకు పిలుపునిచ్చారు. రాష్ట్ర వ్యాప్తంగా అత్యధికంగా సిట్టింగ్ ఎమ్మెల్యే లు బీజేపీ వైపు చూస్తున్నారని ఆయన అన్నారు. అదేవిధంగా నిజామాబాద్ ఎంపీ ధర్మపురి అరవింద్ మాట్లాడుతూ పార్లమెంట్ ఎన్నికల్లో ఓట్ శాతం పెరిగిన జిల్లా ఇందూరు అని, అత్యధికంగా ఓటింగ్ శాతం పెంచిన పార్లమెంట్ పరిధిలోని ఓటర్లకు తాను జీవితాంతం రుణపడి ఉంటానని ఇదే ఈరోజు తన జన్మదినం సందర్భంగా ఓటర్లు ఇచ్చిన బహుమతిగా స్వీకరిస్తానని ఆయన అన్నారు. తాను మోడీ భక్తున్ని అందుకే పొగరుగా ఉంటానని స్పష్టం చేశారు. అలాగే రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో బీజేపీ మొట్టమొదటి జడ్పి చైర్మన్, కార్పొరేషన్ మేయర్ నిజామాబాద్ నుంచే గెలిపిస్తానని ధీమా వ్యక్తం చేశారు. ఓట్ చోరీ పేరుతో కాంగ్రెస్ కుట్ర చేస్తోందని, 30 శాతం మహిళలకు రిజర్వేషన్ చేసింది మన ప్రధాని మోడీనే అని గుర్తు చేశారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం దైవర్షన్ పాలిటిక్స్ చేస్తోందని విమర్శించారు.

## సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలి



**సూర్యాపేట ప్రతినిధి, ఆగస్టు 25 (జనంసాక్షి) :** త్రాగునీరు, శానిటేషన్‌పై ప్రత్యేక శ్రద్ధ తీసుకొని కార్యాచరణ రూపొందించాలని జిల్లా కలెక్టర్ తేజాస్ నంద్ లాల్ పవర్ అన్నారు. సోమవారం కలెక్టరేట్‌లో నీరు, పారిశుద్ధ్య మిషన్ జిల్లా కమిటీ సమావేశం జిల్లా కలెక్టర్, కమిటీ చైర్మన్ అధ్యక్షతన జరిగింది. స్వచ్ఛ భారత్ మిషన్, త్రాగునీరు, పారిశుద్ధ్యం, హెల్త్, విద్యాసంస్థల్లో టాయిలెట్స్, తాగునీరు, శానిటేషన్, మిషన్ భగీరథ టాప్ కనెక్షన్స్ ప్రణాళిక తయారు చేయుట, వనమహెూత్సవం గురించి కమిటీ సమావేశంలో చర్చించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి అధికారి తమకు సంబంధించిన పనులను బాధ్యతాయుతంగా నిర్వహించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. జిల్లా పంచాయతీ సిబ్బంది గ్రామాలలో వర్షాలు పడి తగ్గినందువలన సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఉన్నందువలన దోమలు ఎక్కడ ఎక్కువ ఉన్నాయో అక్కడ స్పెషల్ డ్రైవ్ కింద వారం రోజులపాటు ఫాగింగ్, స్ప్రే మెషిన్ల ద్వారా శానిటేషన్ పనులు చేపట్టాలని అన్నారు. కార్యక్రమంలో డిఆర్డిఏ పిడి వి వి అప్పారావు, డీఎఫ్ఓ సతీష్, డీఈఓ అశోక్, డిపిఓ యాదగిరి, ఎస్సీ కార్పొరేషన్ సంక్షేమ అధికారి దయానందరాణి తదితరులు పాల్గొన్నారు.

### మట్టి వినాయక విగ్రహాలనే పూజించాలి

పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ తమ వంతు కృషి చేయాలని జిల్లా కలెక్టర్ తేజాస్ నంద్ లాల్ పవార్ అన్నారు. సోమవారం కలెక్టరేట్‌లో వినాయక చవితి సందర్భంగా నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో పాల్గొన్నారు.





## ఇన్‌స్టాలో స్క్రోల్ చేసేవారికి జాబ్!..



**జనంసాక్షి:**ఎక్కడైనా మంచి ఉద్యోగం తెచ్చుకోవాలంటే రాత పరీక్షలు ఇంటర్వ్యూలు వంటివి ఉంటాయి. కానీ ఇన్‌స్టాగ్రామ్, యూట్యూబ్‌లో ఎక్కువ సమయం గడిపే వాళ్ళకే ఉద్యోగం అంటూ..మాంక్ ఎంటర్‌టైన్‌మెంట్ కో ఫౌండర్, సీఈఓ 'విరాజ్ శేత్' పేర్కొన్నారు. దీనికి సంబంధించిన ఒక సోషల్ మీడియా పోస్ట్ సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది.విరాజ్ శేత్ ఇటీవలి సోషల్ మీడియాలో ఒక పోస్ట్ చేశారు. ఇందులో "డూమ్–స్క్రోలర్" కోసం, అంటే సోషల్ మీడియాలో ఎక్కువ సమయం గడిపే వ్యక్తి కోసం చూస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ ఉద్యోగం పొందాలనుకునే అభ్యర్థి రోజుకు కనీసం ఆరు గంటలు ఇన్‌స్టా, యూట్యూబ్‌లో స్క్రోలింగ్ చేస్తుండాలి. (డూమ్–స్క్రోలర్లు అంటే.. ఫోన్ స్క్రీన్ స్క్రోల్ చేస్తూ ఉండేవారు).నైపుణ్యాల విషయానికి వస్తే.. హిందీ, ఇంగ్లీష్ భాషలలో పట్టు తప్పనిసరిగా ఉండాలని పేర్కొన్నారు. సోషల్ మీడియాపై మంచి పట్టును కలిగి ఉండాలి. క్రియేటర్ కల్చర్ మీద ఆసక్తి ఉండాలని విరాజ్ శేత్ వెల్లడించారు. ఎక్సెల్ ఉపయోగించడం కూడా బాగా తెలుసుండాలని చెప్పారు. ఉద్యోగం చేయాల్సిన ప్రదేశం ముంబై అని, ఇది ఫుల్ టైమ్ జాబ్ అని పేర్కొన్నారు.ప్రస్తుతం సోషల్ మీడియాలో ఈ పోస్ట్ వైరల్ అవ్వడంతో.. నెటిజన్లు తమదైన రీతిలో కామెంట్ల వర్షం కురిపిస్తున్నారు. ఇన్‌స్టాలో ఎక్కువ టైమ్ కేటాయించేవారికి కూడా ఉద్యోగాలు ఉన్నాయా అంటూ కొందరు ఆశ్చర్య పోతున్నారు. సోషల్ మీడియాలో స్క్రోల్ చేయడం చెడు వ్యసనం కాదని మా అమ్మతో చెబుతాను, అని ఇంకొకరు కామెంట్ చేశారు. ఇంకొకరు నేను 19 గంటలు సమయం కేటాయిస్తాను, ఇది సరిపోతుందా అని అన్నారు.

# లాభాల్లో మార్కెట్లు

**ముంబయి,జనంసాక్షి:** అంతర్జాతీయ మార్కెట్ల సానుకూల సంకేతాలతో దేశీయ మార్కెట్లు సోమవారం రాణించాయి. ఐటీ షేర్లలో కొనుగోళ్లు సూచీలను ముందుకు నడిపించాయి.దీంతో సెన్సెక్స్ 300 పాయింట్లకు పైగా లాభపడగా.. నిఫ్టీ 25వేల మార్క్‌కు మరింత చేరువైంది. ఈ ఉదయం 81,501 పాయింట్ల వద్ద లాభాలతో ప్రారంభమైన సెన్సెక్స్ ఆరంభంలో కాస్త ఒడుదొడుకులకు లోనైంది. కానీ, దిగ్గజ రంగాల షేర్లలో కొనుగోళ్ల అండతో పుంజుకున్న సూచీ.. ఒక దశలో 81,799 వద్ద ఇంట్రాడే గరిష్ఠాన్ని తాకింది. ఆఖర్లో మదుపర్లు లాభాల స్వీకరణకు మొగ్గుచూపడంతో మళ్లీ ఒత్తిడికి



గురైనప్పటికీ.. లాభాలను నిలబెట్టుకోగలిగింది. నేటి మార్కెట్ సెషన్‌లో సెన్సెక్స్ 329.05 పాయింట్ల లాభంతో 81,635.91 వద్ద స్థిరపడింది. అటు నిఫ్టీ 24,894–25,021 మధ్య కదలాడింది. చివరకు 97.65 పాయింట్లు పెరిగి 24,967.75 వద్ద ముగిసింది.డాలర్‌తో రూపాయి మారకం విలువ 6 పైసలు తగ్గి 87.58 వద్ద స్థిరపడింది. సెప్టెంబరులో అమెరికా ఫెడ్ రిజర్వ్ వడ్డీ రేట్ల కోత అంచనాలతో ఐటీ రంగ సూచీ 2.3శాతం మేర రాణించింది. రియాల్టీ 0.7శాతం, లోహ రంగ సూచీ 0.6శాతం మేర పెరిగాయి. నిఫ్టీలో ఇన్ఫోసిస్, టీసీఎస్, హెచ్‌సీఎల్ టెక్నాలజీస్, విప్రో, హిందాల్కో ఇండస్ట్రీస్ షేర్లు లాభపడ్డాయి. అపోలో హాస్పిటల్స్, నెస్లే ఇండియా, భారత్ ఎలక్ట్రానిక్స్, అదానీ ఎంటర్‌ప్రైజెస్, ఎస్‌బీఐ లైఫ్ షేర్లు నష్టపోయాయి.

## ఓపెన్‌ఏఐలో జాబ్స్

### భారత్‌లో మొదటి ఆఫీస్



**జనంసాక్షి:**ఓపెన్‌ఏఐ ప్రపంచవ్యాప్తంగా తన ఉనికిని విస్తరించడంలో భాగంగా.. భారతదేశంలో తన మొదటి కార్యాలయాన్ని ప్రారభించడానికి సిద్ధమైంది. ఇప్పుడు జాబ్స్ కోసం కూడా నోటిఫికేషన్ జారీ చేసింది.ఇందులో మూడు ఉద్యోగాలు ఉన్నట్లు స్పష్టం చేసింది. ఓపెన్‌ఏఐలో జాబ్స్ అకౌంట్ డైరెక్టర్, డిజిటల్ నేటివ్స్ అకౌంట్ డైరెక్టర్, లార్జ్ ఎంటర్‌ప్రైస్ అకౌంట్ డైరెక్టర్, స్ట్రాటజీస్ ఈ ఉద్యోగాలు ఢిల్లీ, ముంబై లేదా బెంగళూరులో ఉండవచ్చు. ఆసక్తికలిగిన అభ్యర్థులు ఓపెన్‌ఏఐ కెరీర్ పేజీలో అప్లై చేసుకోవచ్చు.మా మొదటి ఆఫీస్ ప్రారభించడం, దీనికోసం స్థానికంగా ఒక టీమ్ ఏర్పాటు చేసుకోవడం అనేది.. లేటెస్ట్ ఏఐను మరింత అందుబాటులోకి తీసుకురావడం. భారతదేశంలో ఏఐను నిర్మించడానికి మా నిబద్ధతతో మొదటి అడుగు అని.. ఓపెన్ ఏఐ సీఈఓ సామ్ ఆల్ట్‌మాన్ ప్రకటనలో తెలిపారు. అంతే కాకుండా.. సెప్టెంబర్‌లో భారతదేశాన్ని సందర్శించడానికి తాను ఉత్సాహంగా ఉన్నానని అన్నారు. భారతదేశంలో ఆఫీస్ ప్రారభించడం అనేది.. ప్రభుత్వ ఇండియాఏఐ మిషన్‌కు ఓపెన్‌ఏఐ మద్దతులో భాగం. కంపెనీ ఇప్పటికే లక్షలాది మంది విద్యార్థులు, విద్యావేత్తలు, డెవలపర్లు, నిపుణులకు మెరుగైన సేవలందించడంలో సహాయపడుతుంది. ఇప్పుడు ఇక్కడ ఆఫీస్ ప్రారంభించి మరింత అందుబాటులో ఉండనుంది. ఇందులో భాగంగానే ఉద్యోగులను నియమించుకోవడానికి సంస్థ సిద్ధమైంది.

# రెండు కొత్త గోల్డ్ ఫండ్స్

### రూ. 1,000 నుంచి ఇన్వెస్ట్ చేయొచ్చు..

**జనంసాక్షి:**ఏంజెల్ వన్ అసెట్ మేనేజ్‌మెంట్ కంపెనీ కొత్తగా గోల్డ్ ఈటీఎఫ్, గోల్డ్ ఈటీఎఫ్ ఫండ్ ఆఫ్ ఫండ్‌లను (ఎఫ్‌వోఎఫ్) ప్రవేశపెట్టింది. గోల్డ్ ఈటీఎఫ్ సెప్టెంబర్ 2తో, ఎఫ్‌వోఎఫ్ సెప్టెంబర్ 3తో ముగుస్తుంది. దేశీయంగా పసిడి ధరలను ట్రాక్ చేసే ఈ ఫండ్స్.. పుత్తడిలో సులభతరంగా ఇన్వెస్ట్ చేసే సాధనాలుగా ఉపయోగపడతాయి.ఈటీఎఫ్‌లో రూ. 1,000 నుంచి ఇన్వెస్ట్ చేయొచ్చు. డీమ్యాట్ లేకుండానే పసిడిలో ఇన్వెస్ట్ చేసేందుకు ఫండ్ ఆఫ్ ఫండ్ ఉపయోగపడుతుంది. ఇందులో రోజుకు రూ. 250 నుంచి సిప్ రూపంలో ఇన్వెస్ట్ చేయొచ్చు. మ్యూచువల్ ఫండ్స్ అసోసియేషన్ యాంఫీ ప్రకారం దేశీయంగా పసిడి ఆధారిత ఎక్స్ఛేంజ్ ట్రేడెడ్ ఫండ్స్ మార్కెట్, 2024 జూలైలో రూ. 34,455 కోట్లుగా ఉండగా 2025 జూలై నాటికి రూ. 67,634 కోట్లకు పెరిగింది. దేశీయంగా అత్యంత నాణ్యమైన యాభై కంపెనీల్లో ఇన్వెస్ట్ చేసేందుకు వీలుగా నిఫ్టీ500 క్వాలిటీ 50 ఇండెక్స్ ఫండ్‌ను యాక్సిస్ మ్యూచువల్ ఫండ్ ప్రవేశపెట్టింది. ఇందులో సెప్టెంబర్ 4 వరకు ఇన్వెస్ట్ చేయొచ్చు. నిఫ్టీ 500 నుంచి ఎంపిక చేసిన యాభై స్టాక్స్ ఈ సూచీలో ఉంటాయి.ఈక్విటీపై అత్యధిక రాబడులు, తక్కువ రుణభారం, స్థిరమైన ఆదాయ వృద్ధిలాంటి అంశాలను స్టాక్స్ ఎంపికలో పరిగణనలోకి తీసుకుంటారు. ఇందులో కనీసం రూ. 100 నుంచి ఇన్వెస్ట్ చేయొచ్చు. 2025 జూలైతో ముగిసిన 15 ఏళ్ల వ్యవధిలో నిఫ్టీ 50 వార్షికంగా 12.1 శాతం వృద్ధి చెందగా, నిఫ్టీ 500 క్వాలిటీ 50 ఇండెక్స్ 15. 6 శాతం వృద్ధి రేటు సాధించినట్లు సంస్థ తెలిపింది.

# ట్యాక్స్ లేదన్నారు.. రూ.8లక్షలకే పన్ను కట్టమంటున్నారే..



**జనంసాక్షి:**"పన్నెండు లక్షలు దాటకపోతే ట్యాక్స్ లేదన్నారు. రూ. 8 లక్షల ఆదాయానికే పన్ను కట్టమంటున్నారు" అని విసుక్కున్నాడు వీరభద్రం తన కన్సల్టెంటు మీద. "మనం కడుతున్నది 2025 మార్చి 31 నాటికి సంబంధించినది సార్" అని కన్సల్టెంట్ చెప్పారు. "అంటే?" .. ఎదురు ప్రశ్న వేశాడు వీరభద్రం.పార్లమెంటులో ఆర్థిక మంత్రి ప్రసంగం, బిల్లు పాస్ అయిన వైనం 2026 మార్చి 31తో పూర్తయ్యే సంవత్సరానికి వర్తిస్తుందని ఎన్నో ఉదాహరణలతో చూపించిన తర్వాత, అశక్తుడై, ప్రతిఘటనతోనే ఒప్పుకున్నాడు వీరభద్రం. నికర ఆదాయంలో నుంచి బేసిక్ లిమిట్ తీసివేసి, మిగతా మొత్తంలో నుంచి మొదటి రూ. 3 లక్షలకు నిల్ అని లెక్క కట్టారు గోవిందరావుగారు. నా చేత ఎక్కువ పన్ను కట్టిస్తున్నారని వాపోయారు. ఎన్నో ఉదాహరణలను చూసిన తర్వాత కూడా "ఇదంతా మాకు ఏం అర్థం అవుతుంది లెండి. మీరెంత అంటే అంతే" అని మర్యాదగా వత్తాసు పలికారు."లాస్ట్ ఇయర్ ఇంత పన్ను కట్టలేదు. ఈసారి ఎక్కువ కడుతున్నాం" అని హెచ్చరిక చేశాడు హరనాథం. ఆయన ఇచ్చిన ఫీజు రూ. 2,000కు మరో రెండు గంటలు వెచ్చించక తప్పదని నిర్ణయించుకున్నాడు కన్సల్టెంటు కామేశం గారు.గత ఆర్థిక సంవత్సరం, అంతక్రితం ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన జీతం, ఇంటద్దె, ఫిక్సిడ్ డిపాజిట్లపై వడ్డీ, సేవింగ్స్ అకౌంట్‌పై వడ్డీ, మ్యుచువల్ ఫండ్ వ్యవహారాలు, 80సీ సేవింగ్స్, 80డీ మెడిక్లెయిం, 80జీ డొనేషన్లు.. అన్నీ చెక్ చేసి, నికర ఆదాయం, పన్ను శ్లాబులు, పన్ను రేట్లు, పన్ను భారం, సెస్సు, సర్‌చార్జీ.. ఏదీ వదిలిపెట్టకుండా వివరించారు. చివరికి కన్విన్స్ అయ్యాడు హరనాథం."నాకు నమ్మకం ఉంది. మీరెందుకు తప్పు చేస్తారు" అని ఓ కితాబిచ్చి కదిలాడు. వెళ్తూ.. వెళ్తూ.. "మా బావమరిదికి నాకు ఆదాయం ఇంచు మించు సమానమే. వాడేమీ కట్టలేదన్నాడు. అందుకనే అడిగాను" అంటూ సాగదీశాడు. "కొత్త పద్ధతో, పాత పద్ధతో.. ఏది తక్కువైతే అది తగలెట్టండి" అని వ్యంగ్యంగా అన్నాడు వామనరావు. "అయ్యా ఏది తక్కువైతే అదే కట్టించండి" అని వేడుకున్నాడు వెంకటేశం. "పాఠక మహాశయులైన మిమ్మల్ని మేము వేడుకుంటున్నాం. కంపేర్ చేసి, కన్విన్స్ కండి".. ఇది మా విన్నపం.నిజమే మాస్టారు!! మీరు నైబర్‌తో, ఓనర్‌తో, మీ ఇంట్లో అద్దెకున్న వారితో, అన్నతో, తమ్ముడితో, వియ్యంకుడితో, మార్నింగ్ వాక్ ఫ్రెండుతో, యోగా కొలీగ్‌తో, మీ డాక్టర్‌గారి దగ్గరకొచ్చే పేషంటు ఫ్రెండుతో కంపేర్ చేసుకోవద్దండి. అందరి లెక్కలు ఒకలాగా ఉండవు. తేడాలుంటాయి. కాబట్టి, ఎంచక్కా మీరు మీ ఇన్‌కంతో మాత్రమే కంపేర్ చేసుకోండి. 2024 మార్చి 31కి సంబంధించిన ఆదాయం, అలాగే 2025 మార్చి 31కి వచ్చిన ఆదాయంఇలా కంపేర్ చేయడానికి మీరు ఎవర్ని అడగనక్కర్లేదు. ఆధారపడక్కర్లేదు. మీరే చేసుకోవచ్చు. దాని ప్రకారం ఫాలో అవ్వండి. మీరే కన్విన్స్ అవుతారు. ఇంతలో పరుగెత్తుకుంటూ వచ్చాడు హరనాథం గారి బామ్మర్ది పరంధామయ్య, "మా బావగారు నన్ను దెప్పి పొడుస్తున్నారు. మనం తప్పు చేశామా అని" అంటూ. అప్పుడు కన్సల్టెంటు కామేశం తన వృత్తి రహస్యాలను చెప్పాడు. "ఏమీ తప్పు చేయలేదండి. ఒక విషయం చెబుతా. ఇవన్నీ ప్రీఫిక్సిడ్ రిటర్నులు. మేము 26ఏఎస్ మొదలైన సమాచారాన్ని కరెక్టుగా ఎంటర్ చేస్తాం. ఆటోమేటిక్‌గా పోర్టల్ సమాచారాన్ని తీసుకుంటుంది. కొత్త పద్ధతా, పాత పద్ధతా అనేది చెబుతాం. పన్ను భారం లెక్కించబడుతుంది. ఎటువంటి తప్పులు జరగవు. ఆదాయం ఎంట్రీ, డిడక్షన్లు ఎంట్రీ, తప్పుగా రాస్తే తప్పు. లెక్కింపులో ఏ పొరపాటు జరగదు. చాలా కరెక్టుగా సాఫ్ట్‌వేర్ ఉంటుంది. అందుకుని తప్పులు జరగవు. అయితే, మీలాంటివాళ్లు ఎక్సెల్ షీటులో మాన్యువల్‌గా చేసి, కంపేర్ చేసి, కన్విన్స్ అవ్వొచ్చు" అని వివరించాడు. ఇది విని చిద్విలాసంగా బైల్దేరాడు పరంధామయ్య.

## గుడ్ల ధరలు

| హైదరాబాద్ | వరంగల్ |
|---|---|
| ₹ 4.95 | ₹ 4.97 |

**బంగారం ధరలు** (10 గ్రాములు)
హైదరాబాద్

| | |
|---|---|
| ₹ 93,050 | ₹ 1,01,510 |
| (22 క్యారెట్లు) | (24 క్యారెట్లు) |

**వెండి ధరలు (కేజీ)**
హైదరాబాద్
₹ 1,31,000

# అంధకారం నుంచి వెలుగువైపు..

## ఉక్రెయిన్‌లో యుద్ధ గాయాలను నయం చేస్తోన్న ఆర్ట్ ఆఫ్ లివింగ్



**కీవ్,జనంసాక్షి:**:రష్యా–ఉక్రెయిన్ యుద్ధం దెబ్బతీసిన మానసిక వేదన నుంచి బయటపడేందుకు ఆర్ట్ ఆఫ్ లివింగ్ ఫౌండేషన్ ముందుకొచ్చింది. గురుదేవ్ శ్రీ శ్రీ రవిశంకర్ ఆధ్వర్యంలో జరుగుతున్న ట్రామా రిలీఫ్, ధ్యానం,శ్వాసాభ్యాస కార్యక్రమాలు వేలాది మంది సైనికులు, స్థలచ్యుతులు, పిల్లలకు కొత్త ఆశను అందిస్తున్నాయి.సైనికులకు నిర్వహించిన మొదటి శిక్షణ శిబిరాలు హృదయాన్ని కలచివేశాయి. "వారి చేతులు, కాళ్లు గాయాలతో నిండిపోయాయి. కళ్లలో భయం, ఖాళీతనం స్పష్టంగా కన్పించాయి" అని ఒక ఆర్ట్ ఆఫ్ లివింగ్ ఉపాధ్యాయుడు తెలిపారు. అయితే శ్వాసాభ్యాసాలు నేర్చుకున్న తర్వాత సైనికులు "ప్రశాంతత, భద్రత, స్థిరత్వం"ను అనుభవించినట్లు చెప్పారు.ఉక్రెయిన్ సైనిక నాయకత్వం గురుదేవ్ పనిని అధికారికంగా గుర్తించింది. బెటాలియన్ కమాండర్ స్వయంగా గురుదేవ్‌కు గౌరవ పురస్కారం అందజేస్తూ, "బాంబులు పడితే మేము పోరాడాము, కానీ మాలోని ఖాళీతనం, కోపం, ద్వేషం గురించి ఎవరూ మాట్లాడలేదు. ఆర్ట్ ఆఫ్ లివింగ్ కోర్సుల తర్వాత మా జీవితాలు మారాయి. గాయాలతో ఉన్నవారే ఇప్పుడు భవిష్యత్తు కోసం ప్రణాళికలు వేస్తున్నారు" అని పేర్కొన్నారు.అంతేకాక, నాయకత్వ శిక్షణలు కూడా సైన్యానికి సహాయపడ్డాయి. "అత్యంత ప్రమాదకర పరిస్థితుల్లో వ్యూహాత్మక నిర్ణయాలు తీసుకునే సామర్థ్యాన్ని ఈ శిక్షణ పెంచింది" అని సైన్యం అభినందించింది.2014 నుండి సైన్యంలో మోరల్ అండ్ సైకాలజికల్ సపోర్ట్ విభాగంలో పనిచేస్తున్న నటాలియా ఒక సంఘటనను గుర్తు చేసుకున్నారు. చిన్న గుంతల్లో దాక్కున్న సైనికుల్లో ఒకరు భయంతో కదలలేకపోయిన పరిస్థితిని వివరించారు. "అప్పుడు అతనికి విజయ శ్వాస గుర్తొచ్చింది. అది అతని ప్రాణం మాత్రమే కాకుండా మరో నలుగురి ప్రాణాలను రక్షించింది" అని ఆమె తెలిపారు.2022 నుండి ఇప్పటి వరకు 8,000 మందికి పైగా సైనికులు, స్థలచ్యుతులు, ఆక్రమిత ప్రాంతాల పిల్లలు ఆర్ట్ ఆఫ్ లివింగ్ కార్యక్రమాల ద్వారా లబ్ధి పొందారు. వాలంటీర్లు ప్రమాదాలను లెక్క చేయకుండా సేవ చేస్తున్నారు. "అత్యవసరంగా అవసరమైన వారికి తోడుగా ఉండటం మాకు గౌరవం" అని ఒక ఇన్స్ట్రక్టర్ చెప్పారు.యుద్ధం ఎన్నో ప్రాణాలు, కలలను తీసుకుపోయినా, గురుదేవ్ అందిస్తున్నది శాంతి, ఆశ, తిరిగి నిర్మించుకునే శక్తి. "శాంతి అంటే సంఘర్షణ లేకపోవడం కాదు, కరుణ ఉనికిలో ఉండడం" అని ఆయన అన్నారు.ఉక్రెయిన్‌లో చీకటి నడుమ వెలుగుకి మార్గం చూపుతున్న ఆ కరుణ ఇప్పుడు వేలాది హృదయాలకు ఆధారమవుతోంది.

## మోదీ డిగ్రీ వివరాలు బహిర్గతం చేయాల్సిన అవసరం లేదు

వివరాలను బహిర్గతం చేయాలన్న డిమాండ్ పెరిగింది. ఈ క్రమంలోనే 2016లో కేంద్ర సమాచార కమిషన్.. మోదీ డిగ్రీ రికార్డులను తనిఖీకి అనుమతిస్తూ ఆదేశాలు జారీ చేసింది.అయితే ఆదేశాలను సవాల్ చేస్తూ హైకోర్టును ఆశ్రయించింది ఢిల్లీ యూనివర్సిటీ. ఈరోజు(సోమవారం, ఆగస్టు 25వ తేదీ) సీఐసీ ఆదేశాలను కొట్టేసింది. వ్యక్తిగత గోప్యత హక్కు అనేది తెలుసుకునే హక్కు కంటే మిన్న అని ఈ సందర్భంగా ఢిల్లీ హైకోర్టు స్పష్టం చేసింది. యూనివర్సిటీ విద్యార్థుల రికార్డులు,.. ఆర్టీఐ చట్టం కింద బహిర్గతం చేయాల్సిన అవసరం లేదని తేల్చింది.మోదీ డిగ్రీ వివరాలను కోర్టుకు అందించేందుకు యూనివర్సిటీ సిద్ధంగా ఉన్నా, అవి అపరిచితులతో పంచుకోవడం గోప్యత ఉల్లంఘన అవుతుందని ఢిల్లీ యూనివర్సిటీ తరఫున వాదించిన సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా అభిప్రాయపడ్డారు. దీంతో ఏకీభవించిన హైకోర్టు.. సీఐసీ ఆదేశాలను నిలిపివేస్తూ తీర్పునిచ్చింది.

## భారత్‌లో క్యాన్సర్ ఔషధాలు ప్రారంభించిన జీఎస్‌కే..



**జనంసాక్షి:**భారతదేశంలో తన ఆంకాలజీ ఔషధాలను ప్రారంభిస్తున్నట్లు జీఎస్‌కే కంపెనీ అధికారికంగా ప్రకటించింది. భారతీయ మహిళల్లో పెరుగుతున్న ఎండోమెట్రియల్, అండాశయ క్యాన్సర్లను పరిష్కరించడానికి జెంపెర్లి (డోస్టార్లిమాబ్), జెజులా (నిరాపారిబ్)లను ప్రవేశపెడుతున్నట్లు చెప్పింది.జెంపెర్లి.. ఇమ్యునోథెరపీ డీఎంఎంఆర్ / ఎంఎస్ఐ–హెచ్ అధునాతన ఎండోమెట్రియల్ క్యాన్సర్ చికిత్స కోసం భారతదేశంలో మొదటగా ఆమోదించబడిన పీడీ–1 ఇమ్యునోథెరపీగా గుర్తించబడింది. ఇది గార్నెట్ ట్రయల్ ఆధారంగా 45.5% ప్రతిస్పందన రేటు నమోదు చేసింది. 24 నెలల వరకు స్థిరమైన ప్రయోజనాలను చూపించినట్లు కంపెనీ తెలిపింది. ఇది క్యాన్సర్ చికిత్సలో కీమోథెరపీకి ప్రత్యామ్నాయాన్ని అందిస్తుంది.

**జెజులా.. అండాశయ క్యాన్సర్ ఔషధం**

ఇది బయోమార్కర్ విధానాల్లో మోనోథెరపీ నిర్వహణ కోసం భారతదేశంలో ఆమోదించబడిన ఏకైక రోజువారీ పీఏఆర్‌పీ ఇన్‌హిబిటర్ చికిత్స. అధిక–ప్రమాదం ఉన్న రోగుల్లో ఉపశమనాన్ని అందించడానికి ప్రైమా ట్రయల్‌లో మెరుగైన ఫలితాలు అందించింది. 2045 నాటికి భారతదేశంలో ఎండోమెట్రియల్, అండాశయ క్యాన్సర్ కేసులు వరుసగా 78%, 69% పెరుగుతాయని అంచనా. మహిళల క్యాన్సర్ సంరక్షణలో ముఖ్యంగా 50 ఏళ్లు పైబడిన రోగులకు జీఎస్‌కే అందిస్తున్న చికిత్సలు ఎంతో తోడ్పడుతాయని కంపెనీ పేర్కొంది. రోగులకు సహాయం అందించేందుకు జీఎస్‌కే 'ఫీనిక్స్' అనే పేషెంట్ అసిస్టెన్స్ ప్రోగ్రామ్‌ను ప్రారంభిస్తున్నట్లు తెలిపింది. భారత్‌లో ఈ చికిత్సలు కీలకంగా మారుతాయని జీఎస్‌కే ఇండియా ఎండీ భూషణ్ అక్షికర్ అన్నారు. జెంపెర్లి, జెజులా గైనకాలజికల్ క్యాన్సర్ చికిత్సకు ఎంతో తోడ్పడుతాయని చెప్పారు.


## కోడలి వివాహేతరం సంబంధం.. రాగి ముద్దలో విషం పెట్టి..!



**కర్ణాటక,జనంసాక్షి:** అక్రమ సంబంధాల మోజులో మానవత్వం మృగ్యమవుతోంది. ప్రియుని కోసం రాగి ముద్దలో విషం కలిపి అత్తను హత్య చేసిన ఘటన చిక్కమగళూరు జిల్లా అజ్జంపుర తాలూకా తడగ గ్రామంలో జరిగింది.అశ్విని అనే వివాహిత తన అత్త దేవీరమ్మ (75) హతమార్చింది. వివరాలు.. అశ్వినికి ఆంజనేయ అనే వ్యక్తితో ఆక్రమ సంబంధం ఏర్పడింది. ఇది తెలిసి అత్త ఆమెను తీవ్రంగా మందలించింది. ఇటీవల అశ్విని ఇంట్లో నగలను తీసుకుని ప్రియునికి అప్పగించింది.ఇది తెలిసి కోడలిని అత్త నిలదీసింది. తమకు అడ్డుగా ఉన్న దేవీరమ్మను అడ్డు తొలగించాలని అశ్విని నిశ్చయించుకుంది. గురువారం రాత్రి రాగిముద్దలో పురుగుల మందును కలిపి అత్తకు ఇచ్చింది. అది ఆరగించిన దేవీరమ్మ తెల్లవారినా నిద్రలేవలేదు. అనారోగ్యంతో ఆమె మృతి చెందినట్లు అశ్విని అందరికీ చెప్పింది. అయితే తల్లి చావుపై దేవీరమ్మ కూతురికి అనుమానం వచ్చి పోలీసులకు ఫిర్యాదు చేసింది. పోలీసులు అశ్విని పిలిచి తమదైన శైలిలో విచారించగా నిజం ఒప్పుకొంది. ప్రియుడు ఆంజనేయను కూడా అరెస్టు చేశారు. 100 గ్రాముల బంగారం, రూ.50 వేల నగదును అశ్విని స్వాహా చేసిందని బంధువులు తెలిపారు.

## ట్రక్కు డ్రైవర్‌కు క్షమాభిక్ష కోసం 15 లక్షల సంతకాలు

- అమెరికన్ల నుంచి తీవ్ర వ్యతిరేకత
- ఇమిగ్రేషన్ విధానాలపై చర్చ



**ఫ్లోరిడా,జనంసాక్షి:** అమెరికాలో ముగ్గురు మృతికి కారణమైన ట్రక్కు డ్రైవర్ హర్జిందర్ సింగ్ కేసు వివాదాస్పదమవుతోంది. అతనికి క్షమాభిక్ష కోసం వేసిన ఆన్‌లైన్ పిటిషన్ ఇప్పుడు వైరల్ అవుతోంది. హర్జిందర్ సింగ్‌కు మద్దతుగా 15 లక్షల మందికి పైగా సంతకాలు చేశారు. అయితే.. హత్యానేరం ఎదుర్కొంటున్న వ్యక్తికి క్షమాభిక్ష కోరడంపై స్థానికంగా వ్యతిరేకత వ్యక్తమవుతోంది. ఇది ఇమిగ్రేషన్ సంబంధింత విధానాలపై చర్చకు దారి తీసింది.ఫ్లోరిడాలోని ఫోర్ట్ పియర్స్‌లో భారతీయ డ్రైవర్ 28 ఏళ్ల హర్జిందర్ సింగ్ తప్పుడు యూ–టర్న్ తీసుకోవడంతో అతను నడుపుతున్న ట్రక్కు.. మినీ వ్యాన్‌ను ఢీకొంది. దీంతో అందులో ఉన్న ముగ్గురు మరణించారు. ఆగస్టు 12న ఈ ప్రమాదం జరిగింది. సింగ్ 2018లో అక్రమంగా అమెరికాలోకి ప్రవేశించి కాలిఫోర్నియాలో వాణిజ్య డ్రైవింగ్ లైసెన్స్ పొందాడని ఆరోపణలున్నాయి.అయితే ఈ ప్రమాదం కేసులో గతవారం అతన్ని కాలిఫోర్నియాలోని స్టాక్‌టన్‌లో అరెస్టు చేసి ఫ్లోరిడాకు తిరిగి అప్పగించారు. ఈ ప్రమాదం తరువాత పత్రాలు లేని వలసదారుల వల్ల ప్రమాదాల గురించి ఆందోళన తలెత్తింది. వాణిజ్య ట్రక్ డ్రైవర్లకు వర్కర్ వీసాలు జారీకి అమెరికా ప్రభుత్వం తాత్కాలిక విరామం ప్రకటించింది. అయితే.. హర్జిందర్ సింగ్‌ను విడుదల చేయాలంటూ ఆన్‌లైన్‌లో పిటిషన్ వేశారు. అది ఒక విషాదకరమైన ప్రమాదమని, ఉద్దేశపూర్వకమైన చర్యకాదని పిటిషన్‌లో పేర్కొన్నారు.దీంతో ఆ పిటిషన్‌కు ఎక్కడలేని ఆదరణ లభించింది. ఆయనకు క్షమాభిక్ష పెట్టాలంటూ 15లక్షల మందికి పైగా సంతకాలు చేశారు. దీనిపై స్థానికంగా వ్యతిరేకత వస్తోంది. ముగ్గురు అమెరికన్ పౌరుల మరణానికి కారణమైన వ్యక్తిని విడుదల చేయాలని కోరుకుంటున్నవారి ఇమ్మిగ్రేషన్ స్థితిని తనిఖీ చేయాలంటూ డిమాండ్ మొదలైంది. ప్రమాదానికి కారణమైన వ్యక్తి తెల్లవాడైతే, చనిపోయినవారు భారతీయులైతే వారు ఇలాంటి పిటిషన్‌పై సంతకం చేయరని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ముగ్గురిని హత్య చేసిన వ్యక్తికి శిక్ష పడకూడదని కోరుకోవడం హాస్యాస్పదమంటున్నారు. అతనికి మద్దతు ఇస్తున్నవారిని బహిష్కరించాలని కోరుతూ మరో పిటిషన్ ప్రారంభించారు. అమెరికా ఇలాంటి నిర్లక్ష్యాన్ని సహించబోదని, దానిని సమర్థించే వారికి ఆశ్రయం ఇవ్వబోదని పిటిషన్‌లో పేర్కొన్నారు.

## పుర్రె రహస్యం గుట్టురట్టు?

- ఢిల్లీ నుంచి తెచ్చిన ముసుగు మనిషి
- ఓ ముఠా అప్పగించింది
- సిట్ విచారణలో చిన్నయ్య వెల్లడి?



**కర్ణాటక,జనంసాక్షి:** ధర్మస్థలలో వందలాది శవాలను పూడ్చిపెట్టినట్లు చెప్పిన ముసుగు మనిషి చిన్నయ్య నుంచి ఒక్కొక్క విషయం వెలుగులోకి వస్తున్నాయి.అతడు మొదట్లో తీసుకువచ్చిన పుర్రె ఎక్కడిది అనే ప్రశ్నకు సమాధానం లభించింది. చిన్నయ్యను సిట్ అధికారులు విచారణ కోసం 10 రోజులపాటు కస్టడీకి తీసుకున్నారు. శనివారం నుంచి ప్రశ్నలతో సతమతం చేస్తున్నారు. పుర్రెను ఢిల్లీ నుంచి తీసుకువచ్చినట్లు చెప్పాడని తెలిసింది. కుట్ర చేసిన ముఠా తనను ఢిల్లీకి తీసుకువెళ్లి అక్కడ ప్రముఖ వ్యక్తులను కలిసి పుర్రె ఇచ్చారన్నాడు. పుర్రెను ముందు పెట్టుకుని కోర్టు నుంచి భద్రత తీసుకున్నానని చెప్పాడని సమాచారం. పుర్రె దొరికినది ధర్మస్థలలో తవ్వకాలు జరిగిన చోట కాదని ఫోరెన్సిక్ నివేదికలో వెల్లడైంది.పుర్రెలో ఉన్న మట్టిని బట్టి ఆ అంచనాకు వచ్చారు. ఆపై చిన్నయ్యను గట్టిగా ప్రశ్నించగా పుర్రె ను వేరే చోట నుంచి తీసుకువచ్చినట్లు తెలిపాడు. ఇతరులు చెప్పినట్లు నేను చేశానని, కానీ సూత్రధారి వేరేవారని నోరువిప్పాడు. సదరు ముఠా నుంచి నుంచి రూ.2 లక్షలు నగదు తీసుకుని నాటకమాడినట్లు చెప్పాడు. 2023 డిసెంబరులో ఆ గ్యాంగ్ తనను సంప్రదించి ఈ వ్యవహారం నడపాలని కోరింది. ఈ అసత్య ప్రచారం చేసే గ్యాంగ్‌లో మహేశ్‌శెట్టి తిమరోడి, గిరీశ్ మట్టణ్ణవర్‌లు ఉన్నట్లు తెలిపాడు. చిన్నయ్య మరింత విచారించి సమాచారం సేకరించడంలో తలమునకలయ్యారు. కూతురు అనన్య భట్ అదృశ్యమైందని, ఆమె ఆచూకీ కనిపెట్టాలని, వీలు కాకపోతే కనీసం అస్థికలనైనా ఇవ్వాలని ధర్మస్థలలో రభస చేసిన వృద్ధురాలు సుజాత భట్‌ను ఇంట్లోనే త్వరలో విచారించాలని సిట్ అధికారులు నిర్ణయించారు. బెంగళూరు బనశంకరిలో ఆమె నివాసానికి గట్టి పోలీస్ భద్రత కల్పించారు. ఒకటి రెండు రోజుల్లో ఇంటికి వెళ్లి ప్రశ్నిస్తారు. ఆమె చెప్పేది నిజమా, అబద్ధమా తదితరాలను ఆరా తీస్తారు. మాస్కుమ్యాన్ చూపించిన 17 ప్రదేశాల్లో తన కుమార్తె అనన్యభట్ ను పూడ్చిన స్థలం ఉందని సుజాత భట్ ఆరోపించింది.గతంలో మిస్సింగ్ ఫిర్యాదు ఇస్తే ధర్మస్థల పోలీసులు అస్సలు పట్టించుకోలేదని తీవ్ర ఆరోపణలు చేయడం చాలా ప్రచారమైంది. ఈమె వ్యాఖ్యలతో ధర్మస్థల కేసు బలపడుతుందనే సమయంలో ఆమెకు పిల్లలు లేరని తేలింది. ఈ విషయమై ప్రశ్నించగా.. మణిపాల్‌లో తన తాత ఆస్తి ఉండేది. ఆ ఆస్తిని తమ కుటుంబసభ్యులు ధర్మస్థల ధర్మాధికారులకు ఇచ్చారని, దీంతో నేను ఈ విధంగా అబద్ధం చెప్పానన్నారు. తరువాత ఆ మాటలు తనవి కాదని ప్రకటించింది. ఇలా నిత్యం విరుద్ధ ప్రకటనలు ఆమె ఎందుకు చేస్తోందో పోలీసులకు అంతుబట్టడం లేదు. పూర్తి వివరాలు కావాలని, విచారణకు రావాలని సిట్ నోటీసులు పంపగా ఆమె విచారణకు రాలేదు. రెండు మూడు రోజుల్లో ఇంటికెళ్లి విచారించాలని తీర్మానించారు.

**యూట్యూబర్ సమీర్ విచారణ**

శివాజీనగర: ధర్మస్థల మీద అభూత కల్పనలతో వీడియోలు చేశాడనే కేసులో బళ్లారి యుట్యూబర్ సమీర్ ఆదివారం బెళ్తంగడి పోలీస్ స్టేషన్‌కు విచారణకు హాజరయ్యాడు. ఉదయం 10–30 గంటలకు వస్తానని చెప్పి, మధ్యాహ్నం 1 గంటకు న్యాయవాదితో కలిసి వచ్చాడు. ధర్మస్థల దేవాలయం విరుద్ధంగా అప ప్రచారం చేసినందుకు, పలు వర్గాలను రెచ్చగొట్టేలా ప్రచారం చేశాడని అతనిపై పలు కేసులు నమోదయ్యాయి. ఓ కేసులో కోర్టులో ముందస్తు బెయిలు తెచ్చుకున్నాడు. ధర్మస్థలలో తనకు ప్రాణ బెదిరింపు ఉందని సమీర్ చెప్పుకొన్నాడు. సిట్ అధికారులు అదుపులోకి తీసుకుని విచారణ ప్రారంభించారు.

జనంసాక్షి
www.janamsakshi.org
మంగళవారం
26 ఆగస్టు 2025

# కర్మచారీల భద్రత, సంక్షేమానికి కృషి

- నిజామాబాద్ జిల్లా కలెక్టర్ టి.వినయ్ కృష్ణారెడ్డి




**నిజామాబాద్ జిల్లా బ్యూరో ఆగస్టు 25 (జనం సాక్షి) :** అనునిత్యం ప్రజల ఆరోగ్యాలను పరిరక్షించే విధుల్లో నిమగ్నమై ఉండే పారిశుధ్య కార్మికుల భద్రతా, సంక్షేమానికి కృషి చేయాలని నిజామాబాద్ జిల్లా కలెక్టర్ టి.వినయ్ కృష్ణారెడ్డి సూచించారు. సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలోని మినీ కాన్ఫరెన్స్ హాల్ లో సోమవారం కలెక్టర్ అధ్యక్షతన మాన్యువల్ స్కావెంజర్స్ సర్వే కమిటీ సమావేశం నిర్వహించారు. పారిశుధ్య కార్మికులకు అమలవుతున్న సంక్షేమ కార్యక్రమాలపై సమీక్ష జరిపారు. ఆయా శాఖల ద్వారా పారిశుధ్య కార్మికులకు అమలవుతున్న పథకాలు, ప్రయోజనాల గురించి కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. జిల్లాలో ఎక్కడ కూడా మాన్యువల్ స్కావెంజర్స్ లేరని, 1993 నిషేధ చట్టం పకడ్బందీగా అమలవుతోందని జిల్లా సాంఘిక సంక్షేమ శాఖ అధికారి రజిత కలెక్టర్ దృష్టికి తెచ్చారు. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగిస్తూ, పారిశుధ్య కార్మికుల సేవలను వినియోగించుకోవడం జరుగుతోందని అన్నారు. జిల్లాలోని నిజామాబాద్ నగరపాలక సంస్థతో పాటు బోధన్, ఆర్మూర్, భీంగల్ మున్సిపాలిటీలు, 545 గ్రామ పంచాయతీల పరిధిలో పారిశుధ్య కార్మికులు ఇంటింటి చెత్తను సేకరించి, వాహనాల ద్వారా డంప్ యార్డులకు తరలిస్తున్నారని అన్నారు. కాగా, సఫాయి కర్మచారీలు, పారిశుధ్య కార్మికులకు సంక్షేమ కార్యక్రమాలను అమలు చేయడంతో పాటు అర్హులైన వారి పిల్లలకు ప్రీ-మెట్రిక్ స్కాలర్షిప్ అమలయ్యేలా చూడాలని కలెక్టర్ ఆదేశించారు. ప్రమాదవశాత్తు పారిశుధ్య కార్మికులు మరణిస్తే బాధిత కుటుంబాలకు నష్టపరిహారం అందేలా చొరవ చూపాలన్నారు. మాన్యువల్ స్కావెంజర్ నిషేధ చట్టం గురించి ప్రజల్లో అవగాహన పెంపొందించేందుకు విస్తృతంగా కృషి చేయాలన్నారు. అపరిశుభ్ర వాతావరణంలో విధులు నిర్వర్తించే పారిశుధ్య కార్మికుల ఆరోగ్య భద్రతకు, వారి సంక్షేమానికి పెద్దపీట వేయాలని సూచించారు. కార్మికులకు కనీస వేతనాలు అమలయ్యేలా పర్యవేక్షణ జరపాలని, బీమా సౌకర్యం, పీ.ఎఫ్, ఈఎస్ఐ వంటి సదుపాయాలు వర్తించేలా చూడాలన్నారు. సఫాయి కర్మచారీలు అందరూ ఆన్లైన్ పోర్టల్ లో రిజిస్ట్రేషన్ చేసుకునేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ అంకిత్, నగర పాలక సంస్థ అదనపు కమిషనర్ రవిబాబు, సీ.పీ.ఓ రతన్, వివిధ శాఖల అధికారులు, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

# కేంద్ర మంత్రి బండి సంజయ్‌పై అనుచిత వాఖ్యలు దుర్మార్గం

- కరీంనగర్ ప్రజలకు మహేష్ కుమార్ గౌడ్ బహిరంగ క్షమాపణ చెప్పాలని డిమాండ్.
- బీజేపి నాయకులు, మాజీ మేయర్ సునీల్ రావు



**కరీంనగర్ జిల్లా బ్యూరో, ఆగస్టు 25 (జనంసాక్షి):** టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ చేస్తున్న జనహిత పాదయాత్రకు ప్రజా స్పందన లేకపోవడం హాస్యాస్పదమని, బీజేపీ నాయకుడు, మాజీ మేయర్ యాదగిరి సునీల్ రావు విమర్శించారు. కరీంనగర్‌లోని ఓ ఫంక్షన్ హాల్‌లో సోమవారం జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, ప్రజా సమస్యలను తెలుసుకునేందుకు నాయకులు ఎండలో యాత్రలు చేసి ప్రజలను కలుస్తారని, కానీ మహేష్ కుమార్ గౌడ్ చీకటి పడిన తర్వాత యాత్ర చేయడం విడ్డూరంగా ఉందని, ఇది ఏ రకమైన యాత్రో అర్థం కావడం లేదని ఎద్దేవా చేశారు. ప్రజలను కలవకుండా, కేవలం వాకింగ్‌లా యాత్ర చేస్తూ కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్‌పై అనుచిత వ్యాఖ్యలు చేయడం దుర్మార్గమని ఆయన మండిపడ్డారు. ఈ వ్యాఖ్యలను జిల్లా బీజేపీ నాయకత్వం, హిందూ సోదరులు తీవ్రంగా ఖండిస్తున్నారని తెలిపారు. కాంగ్రెస్ పార్టీ హామీలను నెరవేర్చకపోవడంతో ప్రజలు నిలదీస్తారనే భయంతో పోలీసు బందోబస్తు పెట్టి, చీకటి పడిన తర్వాత యాత్ర చేయడం సిగ్గుచేటని విమర్శించారు. మహేష్ కుమార్ గౌడ్ రెండు నాలుకలతో మాట్లాడుతున్నారని, గతంలో బండి సంజయ్‌ను బీజేపీ అధ్యక్ష పదవి నుంచి తొలగించారని చేసిన వ్యాఖ్యలు రాజకీయ లబ్ధి కోసమేనని ఆరోపించారు. బండి సంజయ్ దొంగ ఓట్లతో గెలిచారని, కరీంనగర్ ప్రజలను అవమానిస్తూ మహేష్ కుమార్ చేసిన వ్యాఖ్యలు శోచనీయమని, వెంటనే ఆయన బహిరంగ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. రెండు లక్షలకు పైగా మెజారిటీతో గెలిచిన బండి సంజయ్‌పై ఇలాంటి వ్యాఖ్యలు చేయడం అన్యాయమని, ఎంఐఎం ఓట్ల కోసం ద్వంద నీతి ప్రదర్శించే నాయకులు కాదని, ఎన్నికల సమయంలో మసీదుల వద్ద ఓట్లు అడుక్కునేది కాంగ్రెస్ నాయకులేనని ఆయన దుయ్యబట్టారు. హిందువులను కించపరిచి, మైనారిటీ ఓట్ల కోసం ప్రయత్నించడం కాంగ్రెస్ తీరని, దేవాలయాలు నిర్మించి, ప్రజా సమస్యలను పరిష్కరించడం బండి సంజయ్ నైజమని అన్నారు. మహేష్ కుమార్ గౌడ్ ఎన్నడూ ప్రజాక్షేత్రంలో గెలవలేదని, కరీంనగర్ ప్రజలను అవమానిస్తూ దొంగ ఓట్లతో గెలిచారని చెప్పడం నీచమైన చర్య అని, దీనికి క్షమాపణ చెప్పాలని ఆయన డిమాండ్ చేశారు. ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 21 నెలలు గడిచినా, కేంద్ర సహకారం లేకుండా ఒక్క గ్రామ పంచాయతీకి లేదా మున్సిపాలిటీకి నిధులు ఇచ్చారా అని ప్రశ్నించారు. ఎన్ఆర్ఐజీఎస్, స్వచ్ఛ్ భారత్ తప్ప ఎలాంటి నిధులు ఇచ్చారో బహిరంగంగా ప్రకటించాలని డిమాండ్ చేశారు. గ్రామ పంచాయతీలు, మున్సిపాలిటీలు అభివృద్ధి లేక నిర్వీర్యమయ్యాయని, బ్లీచింగ్ పౌడర్, చీపుర్లు కొనేందుకు కూడా నిధులు లేవని ఆయన విమర్శించారు. దొంగ ఓట్లతో గెలిచే శక్తి బీజేపీకి ఉంటే కాంగ్రెస్ అధికారంలోకి ఎలా వచ్చేదని, మాట్లాడే ముందు కనీస ఇంగిత జ్ఞానం ఉండాలని ఆయన మండిపడ్డారు. ఈ సమావేశంలో బీజేపీ మాజీ కార్పొరేటర్లు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# మట్టి గణపయ్యలే బెటర్

- సహజ సిద్ధమైన మట్టి వినాయకుడిని పూజించాలి
- భక్తులు పర్యావరణాన్ని పరిరక్షించాలి
- పీవోపీ విగ్రహాలతో హానికరం.. ప్రమాదకరం
- పర్యావరణ ప్రేమికుడు వర్దినేని రవీందర్ రావు



**హుజురాబాద్, ఆగస్టు 25 (జనం సాక్షి) :** పూజల్లో ప్రథమ పూజ అందుకునే అధినాయకుడు గణనాథుడు. వినాయక చవితి వచ్చిదంటే చాలు పిల్లల నుంచి పెద్దల వరకు ఉత్సాహంగా విగ్రహాలు ఏర్పాటు చేసి పూజిస్తారు. వర్షాలు సుభిక్షంగా కురిసి పంటలు బాగా పండాలని, ప్రజలంతా సంతోషంగా జీవించాలని, కోరిన కోర్కెలు నెరవేరాలని గణపయ్యను భక్తులు భక్తిశ్రద్ధలతో పూజిస్తారు. పట్టణాలు, గ్రామాల్లో వాడవాడలా వినాయక విగ్రహాలు ఏర్పాటు చేసి చలువ పందిళ్లు వేసి రంగు కాగితాలు, విద్యుద్దీపా లతో ఆధ్యాత్మిక భావాలతో తొమ్మిది రోజుల పాటు పెద్దలు, పిల్లలు సైతం పల్లెల్లో ఉత్సాహంగా చేసుకునే చవితి పండుగ ఉత్సవాలు ఈ నెల 27 నుంచి ప్రారంభం కానున్నాయి. ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించి విగ్రహాలను నిమజ్జనం చేస్తారు.

**పీవోపీ విగ్రహాలతో హానికరం :**
వినాయక చవితి పండగ వస్తే గ్రామాలు, పట్టణాల్లో పీఓపీతో తయారు చేసిన వివిధ ఆకృతుల్లో ఉన్న అతి పెద్ద విగ్రహాలు తీసుకొచ్చి ప్రత్యేక పూజలు నిర్వహించే వారు. ఈ విగ్రహాలను చెరువుల్లో నిమజ్జనం చేయడంతో ఆ నీటిని పశువులు, మూగజీవాలు తాగి అనారోగ్యం పాలవుతు న్నాయి. అందుకోసం మట్టి విగ్రహాలు ఏర్పాటు చేసి పూజిస్తే మంచిదని సోషల్ మీడియా, వివిధ చానళ్లు, స్వచ్చంద సేవా సంస్థలు, పర్యావరణ ప్రేమికులు, సామాజిక వేత్తలు ప్రచారం చేస్తున్నారు. భాద్రపద మాసం శుక్ల పక్షం చతుర్థి రోజు జరుపుకునే వినాయచవితి హిందువులకు ఎంతో విశిష్టమైంది. పురాణాల ప్రకారం గణేశుడు మట్టితో చేసిన ప్రతిమ రూపంలోనే దర్శినమిస్తాడు. మట్టి గణపతిని పూజిస్తే అనేక యుగాలు ఫలితాలు పొందుతారని పండితుల అభిప్రాయం. మట్టి గణపతితో పాజిటివ్ ఎనర్జీ లభిస్తోంది. మట్టితో చేసిన వినాయకుడిని పూజిస్తే పర్యావరణానికి మేలు చేయడమే కాకుండా పూజాఫలం కూడా లభిస్తుందని పండితులు చెబుతున్నారు.

**మట్టి విగ్రహాలనే పూజిద్దాం.. పర్యావరణాన్ని కాపాడుదాం :**
**పర్యావరణ ప్రేమికుడు వర్దినేని రవీందర్ రావు**



వినాయక విగ్రహాలు ఏర్పాటు చేయడంలో అనవసరమైన అడంబరాలు వద్దు. భారీ విగ్ర హాలు, ప్లాస్టర్ ఆఫ్ ప్యారిస్, రంగుల రసాయనాలతో చేసిన విగ్రహాలతో పర్యావరణానికి ముప్పు వాటిల్లుతుంది. రసాయన విగ్రహాలు నిమజ్జనం చేస్తే జలచరాలు మృత్యువాత పడతాయి. చిన్న మట్టి విగ్రహం ఏర్పాటు చేసి పూజించినా ఫలితం ఉంటుంది. పూజల పేరుతో ఇతర జీవరాసుల మనుగ డకు హాని కలిగించే పనిచేయవద్దు.



## మిడ్ మానేర్ నిర్వాసితుల సమస్యలు పరిష్కరించాలి

**రాజన్న సిరిసిల్ల జిల్లా ప్రతినిధి (జనంసాక్షి) :** మిడ్ మానేరు నిర్వాసితుల పెండింగ్ సమస్యలు పరిష్కరించాలని సోమవారము వేములవాడ అర్బన్ మండలం భాజపా అధ్యక్షుడు బుర్ర శేఖర్ గౌడ్ ఆధ్వర్యంలో భాజపా నాయకులు కార్యకర్తలు నంది కమాన్ నుండి తాసిల్దార్ కార్యాలయం వరకు బైక్ ర్యాలీ నిర్వహించారు. అనంతరం అర్బన్ తాసిల్దార్ కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వం నిర్వాసితులకు ఇస్తామని చెప్పిన రూ ఐదు లక్షల 4 వేలు వెంటనే ప్రకటించాలన్నారు. ఇండ్ల నష్టపరిహారం రానివారికి,పట్టా ప్యాకేజీలు రానివారికి,యువతి యువకులకు పట్టా ప్యాకేజ్ వెంటనే అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో బిజెపి రాష్ట్ర నాయకులు ఎర్రం మహేష్, కుమ్మరి శంకర్, ఏరెడ్డి రాజిరెడ్డి తో పాటు మరో 50 మంది పాల్గొన్నారు.





# ధర్మోరాలో ఇద్దరి మర్డర్

**నిజామాబాద్ జిల్లా బ్యూరో ఆగస్టు 25 (జనం సాక్షి) :** నిజామాబాద్ జిల్లా మాక్లూర్ మండలం ధర్మోరా (ఏ ) గ్రామంలో ఇద్దరు వ్యక్తులను అతిదారుణ హత్య చేశారు. ఈ సంఘటన ఆదివారం అర్ధరాత్రి జరిగింది. ఘటనకు సంబందించిన పూర్తి వివరాలు నిజామాబాద్ నార్త్ రూరల్ సీఐ శ్రీనివాస్ వెల్లడించారు. నిజామాబాద్ నగరంలోని గౌతమ్ నగర్ కు చెందిన జీలకర్ర ప్రసాద్ పలు చోరీ కేసులలో నిందితుడు. జీలకర్ర ప్రసాద్ అతని స్నేహితుడు ఆదివారం రాత్రి మాక్లూర్ మండలం ధర్మోరా గ్రామంలో తనకు పరిచయం ఉన్న మహిళ ఇంటికి వెళ్లారు. అక్కడ మహిళ సంబంధీకులకు జీలకర్ర ప్రసాద్ కు మధ్య గొడవ జరిగింది. దీంతో రాడ్లు కట్టెలతో పరస్పరం దాడులు చేసుకున్నారు. ఈ దాడిలో జీలకర్ర ప్రసాద్ అక్కడికక్కడే మృతి చెందాడు. అతడి స్నేహితుడిని నిజామాబాద్ ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. హత్యకు గల కారణాలను పోలీసులు అన్వేషిస్తున్నారు. ఘటన స్థలాన్ని నిజామాబాద్ నార్త్ రూరల్ సీఐ శ్రీనివాస్‌తో పాటు మాక్లూర్ ఎస్ఐ రాజశేఖర్‌లు పరిశీలించారు. గ్రామంలో పోలీస్ పికెటింగ్ ఏర్పాటు చేశారు. హత్యకు వివాహేతర సంబంధమే కారణమా లేక మరేదైనా ఉందా అనే అంశంపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. జీలకర్ర ప్రసాద్ పై చోరీ కేసులతో పాటు ఇతర కేసులు ఉన్నాయి. గతంలో పోలీసులు అరెస్ట్ చేసి జైలుకు పంపగా ఎస్కార్ట్ కళ్లు గప్పి పరారీ అయ్యాడు. ఈ కారణంగా ఇద్దరు పోలీసులు కూడా సస్పెన్షన్‌కు గురయ్యారు. నగరంలో మోస్ట్ వాంటెడ్ దొంగగా ప్రసిద్ధి చెందిన జీలకర్ర ప్రసాద్ హత్యకు గురికావడం కలకలం రేపుతోంది.

# బీఆర్ఎస్‌లోకి విజయభారతి చేరిక

### బిఆర్ఎస్ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించిన కేటీఆర్



**ఆర్మూర్, ఆగస్టు 25 ( జనంసాక్షి) :** హైదరాబాద్‌లోని తెలంగాణ భవనంలో బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు కేటీఆర్ సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరిన ఆలూర్ గంగారెడ్డి కూతురు విజయభారతీ అధికార పార్టీకి గళం కలిపారు.ఆగస్టు 25న తెలంగాణ భవనంలో జరిగిన ఆర్మూర్ నియోజకవర్గ బిఆర్ఎస్ పార్టీ చేరికల సమావేశంలో విజయభారతీ సొంత గూటికి చేరుకున్నట్లు కేటీఆర్ తెలిపారు. కేటీఆర్ విజయభారత్ కి బిఆర్ఎస్ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.ఈ కార్యక్రమానికి పెద్ద సంఖ్యలో కాంగ్రెస్,బీజేపీ నేతలతో పాటు కార్యకర్తలు కూడా హాజరుగా పార్టీ ఐక్యతకు ప్రతీక అన్నారు. విజయభారతీ ఆర్మూర్ నుంచి హైదరాబాద్ వరకు 300కు పైగా వాహనాలతో భారీ ర్యాలీ విజయవంతంగా నిర్వహించబడింది. ఈ ర్యాలీ స్థానిక రాజకీయ ప్రభావం మరియు ప్రజాదరణ తీవ్రతను స్పష్టంగా చాటింది. బీఆర్ఎస్ నాయకత్వంలోని విజయభారతీ, జీవన్ రెడ్డి కలిసి రాష్ట్ర ప్రజల సమస్యలపై కృషి చేస్తామని స్పష్టం చేశారు.విజయభారతీ మాట్లాడుతూ కేసీఆర్ పట్ల ప్రజల గుండెల్లో ఉన్న అచంచల ప్రేమ కొనసాగుతున్నది.త్వరలో తెలంగాణలో మరొకసారి కేసీఆర్ సర్కారు ఉండాలని ప్రజలు కోరుతున్నారు. కేంద్ర ప్రభుత్వ విధానాల వల్ల రాష్ట్ర ప్రజలు అనేక నష్టాలు అనుభవించారు. హామీలు నెరవేర్చకపోవడంతో నిరాశ దీని కారణం అన్నారు. ఈ భారీ స్థాయిలో జరిగిన ఆర్మూర్ సంఘటన, విజయభారతీ రాజకీయ అవకాశాలు మరింత పటిష్టం అయ్యాయనే అర్థం అవుతుంది. బీఆర్ఎస్ ఆకర్షణ మరింత పెరిగి, రాబోయే ఎన్నికల్లో అధికార పతకం కోసంగా విజయభారతీ కీలక పాత్ర వహించనుందని పార్టీ వర్గాలు భావిస్తున్నాయి. ఐక్యతతో కూడిన బీఆర్ఎస్ శక్తివంతమైన రాజకీయ బలంగా వెలుగొందుతున్నది.ఈ పరిణామం కాంగ్రెస్,బీజేపీకి పెద్ద షాక్ ఇచ్చింది.రాజకీయ వాతావరణంలో ఈ బీఆర్ఎస్ చేరికల దశ శక్తివంతమైన మార్పుల సంకేతంగా భావిస్తున్నారు. విజయభారతీ బీఆర్ఎస్‌లో చేరడంతో పార్టీ గెలుపు దిశగా మరింత బలవర్ధనమవుతుంది. కేటీఆర్ నాయకత్వంలో బీఆర్ఎస్ పరిపక్వ దశకు చేరుకునే వేదన ఇదని పార్శ్వచర్యాలు సూచిస్తున్నాయి. ఆర్మూర్ ప్రజలు కూడా ఈ రాజకీయ పరిణామాన్ని పండగ వాతావరణంగా ప్రతికులిస్తున్నారు. ఈ కార్యక్రమంలో నిజాంబాద్ జిల్లా అధ్యక్షులు మాజీ ఎమ్మెల్యే జీవన్ రెడ్డి, సబిత రెడ్డి,ఆయుష్య,దాదన్న గారి విట్టల్ రావు, అరవింద్ రెడ్డి, వైస్ ఎంపీపీ మోతే చిన్నారెడ్డి, మోహన్ రెడ్డి,ముఖ్య నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## ఆలూరు తహసిల్దార్ కార్యాలయాన్ని తనిఖీ చేసిన సబ్ కలెక్టర్



**ఆర్మూర్, ఆగస్టు 25 (జనంసాక్షి):** ఆలూర్ తహసిల్దార్ కార్యాలయాన్ని సబ్ కలెక్టర్ అభి జ్ఞాన్ మాల్వియా సోమవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆలూర్ తహసిల్దార్ కార్యాలయంలో కులం, ఆదాయం, రేషన్ కార్డుల మంజూరి కోసం డబ్బులు వసూలు చేస్తున్నట్లు వివిధ పత్రికల్లో వచ్చిన వార్తలపై ఆయన స్పందిం చారు. జిల్లా కలెక్టర్ వినయ్ కృష్ణారెడ్డి ఆదేశాల మేరకు సబ్ కలెక్టర్ ఆలూర్ తహసిల్దార్ కార్యాలయాన్ని తనిఖీ చేసి ఉద్యోగుల రిజిస్టర్‌ను పరిశీలించారు. మండలంలోని గ్రామాల నుంచి వివిధ సర్టిఫికెట్లకు వచ్చే వారికి కాలవ్యవధి నిర్ణయించి సత్వరం సర్టిఫికెట్లు జారీ చేయాలని ఆదేశించాడు. సర్టిఫికెట్ల జారీలో జాప్యం చేయవద్దని చెప్పారు. రెవెన్యూ సదస్సులలో రైతుల నుంచి స్వీకరించిన దరఖాస్తులను గ్రామాలకు వెళ్లి విచారణ చేసి పరిష్కరించాలన్నారు. విచారణ కోసం వెళ్ళినప్పుడు వాట్సాప్‌లోని మ్యాపు ద్వారా లొకేషన్‌ను పంపించాలని చెప్పారు. లొకేషన్ పంపించినట్లయితే గ్రామాలలోని రైతుల వద్దకు విచారణకు వెళ్లారా లేదా అన్నది తెలుస్తుందన్నారు. కార్యాలయంలో సర్టిఫికెట్ల జారీ కోసం డబ్బులు వసూలు చేస్తున్న విషయాన్ని తహసిల్దార్ రమేష్ ను అడిగి తెలుసు కున్నారు. డబ్బులు వసూలు చేసిన ఉద్యోగులపై చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు. ఆయన వెంట ఆర్ఐ అరవింద్ ఉన్నారు.

## ర్యాగింగ్‌కు పాల్పడిన వైద్య విద్యార్థులపై కేసు

### నిజామాబాద్ పోలీస్ కమిషనర్ సాయి చైతన్య

**నిజామాబాద్ జిల్లా బ్యూరో (జనం సాక్షి) :** నిజామాబాద్ ప్రభుత్వ వైద్య కళాశాలలో ఎంబీబీఎస్ చివరి సంవత్సరం విద్యార్థులైన ఐదుగురిపై ర్యాగింగ్ ఆరోపణలతో స్థానిక ఒకటవ టౌన్ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైందని పోలీస్ కమిషనర్ సాయి చైతన్య తెలిపారు. ఎంబీబీఎస్ నాల్గవ సంవత్సరం విద్యార్థి గౌరవరం రాహుల్ రెడ్డిపై శనివారం కళాశాలలో సీనియర్లైన సాయిరాం పవన్, శ్రావణ్ %××%, సాత్విక్, హృదయ్ పాల్, అభినవ్ పెద్ది ఆదిత్యలు చేతులతో కొట్టి, "కాలేజీలో ఎలా తిరుగుతావో, ఎలా పాస్ అవుతావో చూస్తాం" అంటూ బెదిరించారు. రాహుల్ రెడ్డి స్నేహితులతో హాస్టల్‌కు వెళ్లగా, అక్కడ సుమారు 15 మంది సీనియర్లు గోడకు కుర్చీ వేయించి, సెల్యూట్ చేయించి, అతని బయోడేటాను పలుమార్లు చెప్పించారు. బట్టలు విప్పి స్నేహితుల ముందు తిప్పిస్తామని, ఆపడానికి వస్తే వారిని కూడా కొడతామని బెదిరించారు. ఈ బెదిరింపుల నుంచి తప్పించుకుని రాహుల్ రెడ్డి హాస్టల్ నుంచి పారిపోయి ఇంటికి చేరుకుని, ప్రాణ రక్షణ కోసం స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించినట్లు సీపీ తెలిపారు. ర్యాగింగ్‌లో పాల్గొన్నా, సహకరించినా శిక్షార్హమని సాయి చైతన్య హెచ్చరించారు.

## నేటి వరకు 1100 మెట్రిక్ టన్నుల యూరియా సరఫరా

### వ్యవసాయ సహాయ సంచాలకు ఎన్.అంజని



**మంథని, (జనంసాక్షి) :** పెద్దపల్లి జిల్లా మంథని మండలానికి, గత సంవత్సరంలో ఆగస్టు 25-2024 వరకు 2278 మెట్రిక్ టన్నులు వచ్చిందని ఈ సంవత్సరంలో ఈరోజు వరకి 3375 మెట్రిక్ టన్నులు యూరియా సరఫరా చేయడం జరిగింది అనగా 1100 మెట్రిక్ టన్నులు అధికంగా సరఫరా చేయడమైనది అని మంథని అగ్రికల్చర్ ఏడిఏ ఎన్. అంజని తెలిపారు. ఈ అధికంగా సరఫరా చేసిన మెట్రిక్ టన్నులు రైతులు ముందస్తుగా కొనుగోలు చేసి వారి వారి పొలాల్లో ఇండ్లలో పెట్టుకొని ఉన్నారు. యూరియా రావట్లేదని రోజు మండలానికి వచ్చి యూరియా లేదు అని భయాందోళనకి గురికావద్దు అని రైతులను కోరారు. మన మంథని మండలానికి అత్యధికంగా యూరియా సరఫరా చేయడం అయినది, ఈ వారంలో రాష్ట్ర ప్రభుత్వం యూరియాని రైల్వే రేకుల ద్వారా తెప్పించనుంది కావున రైతులు ఆందోళన చెందవద్దని కోరారు. దీనితో పాటు ఆర్ఎఫ్‌సిఎల్ యూరియా ప్లాంట్ మూసివేయడం వలన, యూరియా సరఫరాలో కొంచెం అంతరాయం కలగడం జరిగింది. ఏది ఏమైనా గానీ యూరియా నిల్వలు అన్నిచోట్ల అన్ని డీలర్ షాపులలో అందుబాటులో ఉంది.అవసరం మేరకు మాత్రమే యూరియాని తీసుకోగలరని రైతులకు ఆమె విజ్ఞప్తి చేశారు.

## పొలంలో పడి రైతు మృతి



**ముస్తాబాద్ ఆగస్టు 25 (జనం సాక్షి):** ముస్తాబాద్ మండలం పోతుగల్ గ్రామానికి చెందిన కొప్పు శివరాజు సం 45 అనే రైతు కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం రోజు మాదిరిగానే శివరాజు ఉదయం పొలానికి నీళ్లు పెట్టడానికి వెళ్లి పొలంలో ఒడ్డు మీద నుండి తిరుగుతూ పొలంలో ముక్కు ముడుచుకపడి అక్కడికక్కడే మృతి చెందినట్లు తండ్రి కిష్టయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ మహేష్ తెలిపారు పోస్టుమార్టం కు తరలించారు మృతుడికి భార్య మనమ్మ, కూతురు, కుమారుడు ఉన్నారు.

# ప్రవక్త మార్గం.. అనుసరణీయం

- ఆగస్టు 25 నుండి సెప్టెంబర్ 25 వరకు "ప్రవక్త జన్మదిన మాసోత్సవాలు"
- 60 రోజుల పాటు వివిధ కార్యక్రమాలు
- జమాతే ఇస్లామీ హింద్ (జేఐహెచ్) నిర్వామీ



**కరీంనగర్ బ్యూరో, ఆగస్టు 25 (జనంసాక్షి) :** జమాతే ఇస్లామీ హింద్ (జేఐహెచ్) కరీంనగర్ ఆధ్వర్యం పర్వవరో మహ్మద్ (స) జన్మదిన మాసము పురస్కరించకు కారుణ్య మూర్తి ముహమ్మద్ (స) ఉద్యమం ఆగస్టు 25 నుంచి సెప్టెంబర్ 25 వరకు ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా మాసోత్సవాలు నిర్వహిస్తున్నట్టు నిర్వాహకులు మొహమ్మద్ నయీముద్దీన్ పేర్కొన్నారు. సోమవారం నగరంలోని జమాతే ఇస్లామీ హింద్ (జేఐహెచ్) కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఉత్తమ సమాజం, సామాజిక రుగ్మతలను, రూపుమాపడం, ఇహ పరలోకాల సాఫల్యం కోసం ప్రవక్త మహ్మద్ (స) బోధనలు ఎంతో దోహదపడుతాయని చెప్పారు. ప్రవక్త కేవలం ముస్లింలకే హితబోధ చేయలేదని, మానవులందరికీ ఆయన మార్గనిర్దేశం చేశారన్నారు. సమసమాజం ఆయన చేసిన కృషి అందరికీ అనుసరణీమన్నారు. ప్రవక్త బోధనలను సమాజంలో విస్తరింపజేసేందుకు జమాతే ఇస్లామీ హింద్ విశేష కృషి చేస్తున్నదని అన్నారు. ప్రవక్త చరిత్ర, బోధనలు, సమాజం కోసం చేసిన కార్యక్రమాలను మరింత విస్తరించేందుకు జమాతే ఇస్లామీ హింద్ విశేష కృషి చేస్తున్నదని అన్నారు. ప్రవక్త చరిత్ర, బోధనలు, సమాజం కోసం చేసిన కార్యక్రమాలను మరింత విస్తరించేందుకు జేఐహెచ్ ఆధ్వర్యంలో క్యాడర్ మీట్, వివిధ పాఠశాలలు, కాలేజీల్లో పోటీలు నిర్వహించడంతో పాటు చెడు నిర్మూలనన అనే అంశంపై ప్రజలకు పెద్ద ఎత్తున అవగాహన కల్పించేందుకు నిర్ణయించినట్టు వివరించారు. ఈ కార్యక్రమంలో జమాతే ఇస్లామీ హింద్ జిల్లా అధ్యక్షుడు సోహెబ్ అహ్మద్ ఖాన్, ప్రధాన కార్యదర్శి షేక్ ఇసాఖ్ అలీ, కో కన్వీనర్ అమ్మర్ లతీఫి తదితరులు పాల్గొన్నారు.

# కరీంనగర్‌లో ఉద్యోగుల ఉద్యమ జంగ్ సైరన్ పోస్టర్ ఆవిష్కరణ



**కరీంనగర్ జిల్లా బ్యూరో, ఆగస్టు 25 (జనంసాక్షి):** కరీంనగర్ జిల్లా కేంద్రంలో సోమవారం టీజీఈ జేఏసీ ఆధ్వర్యంలో ఉద్యోగుల ఉద్యమ జంగ్ సైరన్ పోస్టర్ ఆవిష్కరణ కార్యక్రమం ఘనంగా జరిగింది. ఎంప్లాయిస్ జేఏసీ చైర్మన్, టీఎన్జీవో జిల్లా అధ్యక్షులు దారం శ్రీనివాస్ రెడ్డి, టీజీవో జిల్లా అధ్యక్షులు, జేఏసీ కన్వీనర్ మడిపల్లి కాళీ చరణ్ గౌడ్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించబడింది. ఈ సందర్భంగా దారం శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ, రాష్ట్ర టీజీఈ జేఏసీ పిలుపు మేరకు సెప్టెంబర్ 1, 2025న పెన్షన్ విద్రోహ దినంగా పాటిస్తూ, జిల్లా కలెక్టరేట్ ముందు ఉద్యోగులు నల్ల బ్యాడ్జీలు ధరించి విధులకు హాజరు కావాలని పిలుపునిచ్చారు. సెప్టెంబర్ 9న టీఎన్జీవోస్ కమ్యూనిటీ హాల్‌లో మధ్యాహ్నం 3 గంటలకు ఉద్యోగుల చైతన్య సదస్సు, అక్టోబర్ 12న చలో హైదరాబాద్ కార్యాచరణకు ఉద్యోగులు సిద్ధం కావాలని కోరారు. 1-9-2004 తర్వాత ఉద్యోగంలో చేరినవారికి పెన్షన్ లేకపోవడం అన్యాయమని, పెన్షన్ దయాదాక్షిణ్యం కాదని, అది ఉద్యోగుల సాంఘిక, ఆర్థిక భద్రత, 30-35 సంవత్సరాల సేవ తర్వాత గౌరవ జీవన హక్కు అని, ఈ విషయాన్ని సుప్రీంకోర్టు కూడా స్పష్టం చేసినప్పటికీ ఉద్యోగుల హక్కులు కాలరాయబడుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. జీపీఎఫ్, ఇన్సూరెన్స్, మెడికల్ బిల్లులు, హౌస్ బిల్డింగ్ లోన్లు, ఐదు డీఏలు, హెల్త్ స్కీమ్, పీఆర్సీ పెండింగ్‌లో ఉన్నాయని ఆయన విమర్శించారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజలకు చేర్చేది, ఎండవానల్లో పగలురాత్రి కష్టపడేది ఉద్యోగులేనని, అయినా వారి గోడు ప్రభుత్వానికి వినిపించడం లేదని, ప్రజలకు అసౌకర్యం కలిగితే బాధ్యత ప్రజాప్రతినిధులదేనని హెచ్చరించారు. అవినీతి ఆరోపణలపై స్పందిస్తూ, ఒకరి తప్పిదం వల్ల మొత్తం ఉద్యోగులను అవినీతిపరులుగా ముద్రవేయడం అన్యాయమని, అవినీతిని అరికట్టడానికి నిరోధక శాఖ, రాజ్యాంగ సంస్థలు ఉన్నాయని గుర్తు చేశారు. బయోమెట్రిక్, ఫేస్ రికగ్నిషన్ అటెండెన్స్ విధానంపై అనుమానాలు వేసి హక్కులను కత్తిరించడం సహించేది కాదని, ఉద్యోగుల సంక్షేమం ప్రభుత్వ ధర్మమని, డిమాండ్లను వెంటనే నెరవేర్చాలని కోరారు. ప్రజాస్వామ్యంలో ఉద్యోగులు కీలక శక్తిగా రాజకీయ నాయకుల భవిష్యత్తును నిర్ణయిస్తారని, అన్యాయంపై మౌనంగా ఉండబోమని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో టీఎన్జీవో జిల్లా కార్యదర్శి సంగెం లక్ష్మణరావు, గేజిటెడ్ అధికారుల జిల్లా కార్యదర్శి అరవింద్ రెడ్డి, కేంద్ర సంఘం నాయకులు గూడ ప్రభాకర్ రెడ్డి, రాగి శ్రీనివాస్, సర్దార్ హర్మేందర్ సింగ్, జిల్లా నాయకులు కిరణ్ కుమార్ రెడ్డి, రమేష్ గౌడ్, శారద, సునీత, పట్టణ అధ్యక్షుడు రాజేష్ భరద్వాజ్, సుస్మిత, శైలజ, రాజేశ్వరరావు, జేఏసీ నాయకులు పాల్గొన్నారు.

# ఆశాలకు వేతనం 18 వేలు చెల్లించాలి






- జిల్లా కలెక్టరేట్ ఎదుట ఆశా వర్కర్ల ఆందోళన
- జిల్లా కలెక్టర్‌కు వినతిపత్రం ఇచ్చిన ఆశాలు

**హైదరాబాద్, (జనంసాక్షి) :** ఆశా వర్కర్స్ యూనియన్ (సిఐటియు) రాష్ట్ర కమిటీ పిలుపులో భాగంగా ఆశా వర్కర్ల సమస్య పరిష్కరించాలని సోమవారం రోజున జిల్లా కలెక్టరేట్ వద్ద ధర్నా నిర్వహించి అనంతరం జిల్లా కలెక్టర్ కు వినతిపత్రం సమర్పించారు. సందర్బంగా దుంపల రంజిత్ కుమార్ సీఐటీయు జిల్లా కార్యదర్శి మాట్లాడుతూ... ప్రభుత్వాలు మారుతున్న ఆశా వర్కర్ల సమస్యలు మాత్రం పరిష్కరం చేయట్లేదు. కరోనా సమయంలో తన ప్రాణాలను సైతం పణంగా పెట్టిన ఆశాలకు నేడు గుర్తింపు, గౌరవం కూడా లేదు. ధరలు పెరుగుతున్న వాటికీ అనుగుణంగా వేతనాలు మాత్రం ప్రభుత్వాలు పెంచడం లేదు. వేతనాలు పెంచుమని ఓట్లు వేసుకొని అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం ఆశాలను పట్టించుకున్న పరిస్థితి లేదు. ప్రభుత్వ సంక్షేమ పథకాల ల్లో ఆశాలకు ఇందిరమ్మ ఇండ్లు, ఇతర పథకాలు వర్తింపచేయాలని అన్నారు. అనంతరం ఆశా వర్కర్స్ యూనియన్ (సిఐటియు) జిల్లా కార్యదర్శి శోభ మాట్లాడుతూ... 20 ఏళ్ళుగా పని చేస్తున్నా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పారితో షకం పేరుతో వెట్టి చాకిరీ చేయించుకుంటుంది. పారితోషకాలు తగ్గిస్తామని చెప్పడం సరైంది కాదు. తగ్గిస్తే ఊరుకోం. సుప్రీం కోర్ట్ తీర్పు కూడా రాష్ట్ర ప్రభుత్వం పరిగణలోకి తీసుకోకుండా కనీస వేతనాలు ఇవ్వడం లేదు ఆశ వర్కర్లను శ్రమ దోపిడీకి గురిచేస్తుంది. ఏ.ఎన్సి.సి టార్గెట్స్‌తో ఏ.ఎన్.ఎం లు.. మెడికల్ ఆఫీసర్‌లు ఇబ్బందులు గురిచేస్తున్నారు. సబ్ సెంటర్ డ్యూటీలను తీసివేయాలి. జిల్లా మాత శిశు ఆసుపత్రిలో ఆశ వర్కర్లకు కేటాయించిన ప్రత్యేక గదిని ఆశాలకు ఇవ్వాలి. పీహెచ్సీలలో ఆశాలకు కనీస సౌకర్యాలు కల్పించాలి. ప్రతి నెల జీతం రిపోర్ట్ చేసే ఏ.ఎన్.ఎం లల్లో కొంతమంది ఆశాలతో వారి రిపోర్ట్ లు కూడా ఆన్లైన్ చేస్తేనే జీతం చేస్తామని బెదిరిస్తున్నారు. ఆశాల పట్ల అధికారుల బెదిరింపులు ఆపాలి. ప్రతి నెలనెల వేతనాలు, అన్ని రకాల పెండింగ్ బిల్లులు చెల్లించాలి. ఈ కార్యక్రమంలో జి ప్రకాష్ సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు, చల్లూరి దేవదాస్, అంబటి లక్ష్మణ్ సిఐటియు మండలల కన్వీనర్లు, పాయిరాల రాములు రజక వృత్తిదారుల సంఘం జిల్లా కార్యదర్శి, సరోజ, విజయలక్ష్మి కవిత లీలావతి సువర్ణ అరుంధతి లక్ష్మి ఆశా యూనియన్ జిల్లా కమిటీ సభ్యులు పాల్గొన్నారు



# ఉద్యోగుల ఒత్తిడి నియంత్రణకు క్రీడలు అవసరం

### నిర్మల్ జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్

**నిర్మల్ రూరల్,ఆగస్టు25 (జనం సాక్షి) :** ఉద్యోగుల ఒత్తిడి నియంత్రణకు క్రీడలు అవసరమని జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ తెలిపారు.సోమవారం కలెక్టరేట్ లో టేబుల్ టెన్నిస్ కోర్టును కలెక్టర్ ప్రారంభించారు.యువజన క్రీడల శాఖ ఆధ్వర్యంలో కలెక్టరేట్ రెండవ అంతస్తులో ఏర్పాటు చేసిన కోర్టును కలెక్టర్ రిబ్బన్ కత్తిరించి ప్రారంభించిన అనంతరం అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్‌తో కలిసి కాసేపు టేబుల్ టెన్నిస్ ఆడారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ఉద్యోగుల శారీరక, మానసిక ఆరోగ్య పరిరక్షణకు క్రీడలు ఎంతో దోహదం చేస్తాయని పేర్కొన్నారు.కార్యాలయ పనిఒత్తిడి నుంచి ఉపశమనం పొందేందుకు ఉద్యోగులు,సిబ్బంది విధులు ముగిసిన తర్వాత కోర్టును వినియోగించుకోవాలని సూచించారు.టేబుల్ టెన్నిస్ ఆడటం ద్వారా మానసిక ప్రశాంతత లభిస్తుందని తెలిపారు. అలాగే సాధారణ ప్రజల కోసం పట్టణంలో మరిన్ని టేబుల్ టెన్నిస్ కోర్టులను అందుబాటులోకి తీసుకువచ్చేలా చర్యలు తీసుకుంటామని కలెక్టర్ వెల్లడించారు.ఈ కార్యక్రమంలో జిల్లా యువజన క్రీడలశాఖ అధికారి శ్రీకాంత్ రెడ్డి, సిపిఓ జీవరత్నం,ఇతర అధికారులు,కలెక్టరేట్ సిబ్బంది పాల్గొన్నారు.

### కోరుట్లలో పరిశుద్ధ్యంపై

# ప్రత్యేక దృష్టి

### కమిషనర్ రవీందర్

**కోరుట్ల, ఆగస్టు 25 (జనం సాక్షి):** కోరుట్ల పట్టణంలో పరిశుద్ధ్య పనులపై గత సంవత్సరం కంటే ఈ ఏడాది మరింత శ్రద్ధతో పని చేస్తున్నామని కమిషనర్ రవీందర్ తెలిపారు. పరిశుద్ధ్యంపై ఎటువంటి సమస్యలు దృష్టికి వచ్చినా వెంటనే చర్యలు తీసుకుంటున్నామని, శానిటేషన్ ఇన్స్పెక్టర్లు సాయంత్రం 6 నుంచి 7 గంటల వరకు కూడా పని చేస్తున్నారని ఆయన వివరించారు. ఉదయం తిరిగేందుకు కూడా సిద్ధంగా ఉంటూ, అవసరమైన పనులను తప్పనిసరిగా పూర్తి చేస్తామని స్పష్టం చేశారు. సీసీ రోడ్లలోని గుంతలు తమ బాధ్యత కానప్పటికీ, వాటిని కూడా చేపట్టి పూడ్చే పనులు చేస్తున్నామని, కార్మికులు కేవలం స్వీపింగ్ పనులు మాత్రమే కాకుండా, మట్టి కలపడం వంటి పనుల్లోనూ నైపుణ్యంతో పని చేస్తున్నారని తెలిపారు. బడ్జెట్ సమస్యల కారణంగా గుంతలు పూడ్చే పనులు కొంత ఆలస్యమవుతున్నాయని, కాంట్రాక్టర్లు లక్ష యాభై వేల రూపాయల పనులకు కూడా ముందుకు రావడం లేదని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. మెయిన్ రోడ్లలో గుంతలు పూడ్చడం సరిపోతుందని భావించినప్పటికీ, శానిటేషన్ కార్మికులతో మట్టి కలపడం, సిమెంట్ రోడ్ల గుంతలు పూడ్చే పనులు కూడా చేయిస్తున్నామని కమిషనర్ పేర్కొన్నారు. రేపటి నుంచి గుంతలు పూడ్చే పనులను నిలిపివేసి, అన్ని కార్మికులనూ పరిశుద్ధ్య పనులపై దృష్టి పెట్టేలా చేస్తామని, శానిటైజేషన్ వర్క్‌కు ప్రాధాన్యత ఇస్తామని కమిషనర్ రవీందర్ స్పష్టం చేశారు.



# యూరియా కోసం రైతుల తిప్పలు

**మల్హర్, ఆగస్టు 25(జనంసాక్షి) :** భూపాలపల్లి జిల్లా మాలహర్ రావు మండల కేంద్రమైన తాడిచర్ల గ్రామం లోని పిఎసిఎస్ కార్యాలయం లోని గోదాం వద్ద రైతులు యూరియ కోసం ఉదయం 8గంటల నుంచే బారులు తీరారు. యూరియా కోసం రైతులు చెప్పులను వరుస క్రమంలో పెట్టారు. 10గంటల తరువాత నిర్వహకులు యూరియ పంపిణి చేశారు.ప్రభుత్వం యూరియా పంపిణి లో విఫలమైంది అని పలు గ్రామాల రైతులు ఆరోపించారు.ప్రభుత్వనిబంధనల ప్రకారం యూరియా పంపిణి చేస్తున్నాం పిఎసిఎస్ చైర్మన్ ఇప్ప మొండయ్య తెలిపారు.

### ఇంటర్నెట్ వైర్ల తొలగింపుతో మణికొండ

# ఆర్టిఏలో స్తంభించిన సేవలు


**రాజేంద్రనగర్,ఆగస్టు25 (జనంసాక్షి) :** ఇంటర్నెట్ వైర్ల తొలగింపుతో మణికొండ మున్సిపాలిటీ ఆర్టిఏ కార్యాలయంలో స్తంభించిన సేవలు. మణికొండ మున్సిపాలిటీలో ఐదు కిలోమీటర్ల మేర ఇంటర్నెట్ డిష్ వైర్ల తొలగింపుతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు దీంతో పాటు ఆర్టిఏ కార్యాలయం ఇంటర్నెట్ వైర్లు కూడా తొలగించడంతో కార్యాలయంలో రవాణా సేవలు నిలిచిపోయి, వందల సంఖ్యలో దరఖాస్తులు వచ్చి చేరాయి. రేపటి నుంచి సేవలు పునః ప్రారంభమవుతాయని అధికారులు చెప్పడంతో వినియోగదారులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఉదయం నుంచి రవాణా పనుల కొరకు వచ్చిన ప్రజలు తమ పని అవుతుందని చాలాసేపటి వరకు వేచి చూసి, అసహనంతో వెనుతిరిగారు.



# ప్రజలకు సామాజిక సేవ గొప్ప సంకల్పం

### సరల్ జగ్ కార్యాలయాన్ని ప్రారంభించిన మీనాక్షి నటరాజన్, మహేష్ కుమార్ గౌడ్

### కరీంనగర్లో కాంగ్రెస్ బలోపేతానికి చేపట్టిన ప్రణాళికను వివరించిన వెలిచాల రాజేందర్ రావు



**కరీంనగర్ జిల్లా బ్యూరో, అగస్టు 25 (జనంసాక్షి) :** స్వలాభం కోసం తాపత్రయపడుతున్న నేటి రోజుల్లో పేద ప్రజలకు సామాజిక సేవ చేయాలనే గొప్ప సంకల్పంతో తల్లిదండ్రులు జగపతిరావు – సరళాదేవి పేరిట సరల్ జగ్ అనే ట్రస్టును వెలిచాల రాజేందర్ రావు ఏర్పాటు చేయడం ఆదర్శనీయమనీ కాంగ్రెస్ పార్టీ వ్యవహారాల ఇన్చార్జి మీనాక్షి నటరాజన్, పిసిసి అధ్యక్షుడు బొమ్మ మహేష్ కుమార్ గౌడ్ పేర్కొన్నారు. సోమవారం సాయంత్రం కొత్తపల్లిలోని వెలిచాల ప్రజా కార్యాలయంలో కాంగ్రెస్ పార్టీ కరీంనగర్ పార్లమెంట్ నియోజకవర్గ ఇన్చార్జి వెలిచాల రాజేందర్ రావు వారి తల్లిదండ్రులు వెలిచాల జగపతిరావు – సరళ దేవి పేరిట సామాజిక సేవా కార్యక్రమాలు చేపట్టేందుకు ఏర్పాటు చేసిన సరల్ జగ్ ట్రస్టు కార్యాలయాన్ని కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జి మీనాక్షి నటరాజన్, పిసిసి అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ అట్టహాసంగా ప్రారంభించారు. అంతకుముందుకు వెలిచాల ప్రజా కార్యాలయంలోకి మీనాక్షి నటరాజన్, బొమ్మ మహేష్ కుమార్ గౌడ్ రాగానే వారికి, వందలాది మంది కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలతో కలిసి రాజేందర్ రావు ఘన స్వాగతం పలికారు. రాజేందర్ రావు వారిద్దరికీ శాలువాలు కప్పి ఘనంగా సన్మానించారు. జగపతిరావు – సరళ దేవి చిత్రపటాల వద్ద మీనాక్షి నటరాజన్, మహేష్ కుమార్ గౌడ్ నివాళులర్పించారు. అనంతరం వెలిచాల రాజేందర్ రావు త్వరలో చేపట్టనున్న సామాజిక సేవా కార్యక్రమాలను వారికి వివరించారు. పేద ప్రజలకు రొటీన్ గా కాకుండా విభిన్నమైన ఆలోచనతో సేవ చేసేందుకు ఒక చక్కటి ప్రణాళికను రూపొందించుకొని ముందుకు సాగుతున్నానని వారికి తెలిపారు. పుస్తక పఠనం తగ్గిపోతున్న ఈ రోజుల్లో బర్డ్ నెక్స్ట్ పేరిట కరీంనగర్ లో వివిధ ప్రాంతాల్లో పుస్తకాల లైబ్రరీలను ఏర్పాటు చేయనున్నట్లు వివరించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం, కాంగ్రెస్ నాయకులు, తాజా మాజీ కార్పొరేటర్లు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.


# డ్రగ్స్‌కి కేరాఫ్ అడ్రస్‌గా సైబరాబాద్!

- ఇతర రాష్ట్రాల నుండి పెద్ద ఎత్తున మాదకద్రవ్యాలు, గంజాయి పట్టుపడుతున్న వైనం
- బహిర్గతమయ్యేవి మచ్చుకే... లోలోపల ఘటనలు కోకొల్లలు?
- ఒరిస్సా గంజాయి కైనా... బెంగళూరు డ్రగ్స్ కైనా జంక్షన్ పాయింట్ గా హైదరాబాద్!
- తాజాగా గచ్చిబౌలిలో రేవ్ పార్టీ ఘటన... వాస్తవాలు వెలుగు చూడని వైనం?
- డ్రగ్స్ మహమ్మారిని నిర్మూలించాల్సిన బాధ్యత పాలకులదే... సామాజికవేత్తల స్పష్టీకరణ

**శేరిలింగంపల్లి, ఆగస్టు 25 (జనంసాక్షి) :** డ్రగ్స్ మహమ్మారి నగరాన్ని కుదిపేస్తూనే ఉంది. గతంలో అత్యంత రహస్యంగా కొన్ని వర్గాలకే పరిమితమైన డ్రగ్స్ మెల్లగా తన జడలు విప్పి ప్రస్తుతం హైదరాబాద్ మహానగరాన్ని కుదిపేస్తుంది. పిల్లలు మొదలు వృద్ధుల వరకు ప్రతి ఒక్కరూ దీనికి దాసోహం అంటూ విశ్వం నగరాన్ని మత్తుపదార్థాల అడ్డగా మారుస్తుండడం ఆందోళన కలిగించే అంశం. అనధికార లెక్కల ప్రకారం జూనియర్ కాలేజీలు మొదలు ఇంజనీరింగ్ కాలేజీలు, యూనివర్సిటీలలో కేఫ్ లను నిర్వహించినంత సులభంగా దొడ్డి దారిన మాదకద్రవ్యాలను, గాంజాను విద్యార్థులకు చేరవేస్తూ యువతను మత్తులోకి దించి వారి జీవితాలతో చెలగాటమాడుతున్న డ్రగ్స్‌ను నిజాయితీగా నియంత్రించడానికి ఇప్పటివరకు సరైన ప్రక్రియ, ప్లానింగ్ లేకపోవడం ప్రభుత్వ నిర్లక్ష్య వైఖరికి నిలువెత్తు నిదర్శనం అంటే అతిశయోక్తి కాదు.

**ఒరిస్సా గంజాయి కైనా... బెంగళూరు డ్రగ్స్ కైనా సెంటర్ పాయింట్ గా హైదరాబాద్...!?**

దేశంలో గంజాయికి ప్రధాన కేంద్రంగా ఒరిస్సా రాష్ట్రం నిలుస్తుందని పలు నివేదికలు స్పష్టం చేస్తున్నాయి. దీనికి బలాన్ని చేకూర్చే విధంగా అనేక సందర్భాలలో ఒరిస్సా రాష్ట్రం, వైజాగ్ ప్రాంతాల నుండి భారీగా గంజాయి ముఠాలు పెద్ద ఎత్తున గంజాయిని దేశంలోని ఇతర ప్రాంతాలకు తరలించే క్రమంలో లింగంపల్లి, మియాపూర్, గచ్చిబౌలి తదితర ప్రాంతాలలో అడ్డంగా బుక్కై జైలుకెళ్లిన ఘటనలు విధితమే. గతేడాది మాదాపూర్ లోని ఓ ప్రముఖ హోటల్ లో కొందరు సినీ ప్రముఖుల డ్రగ్స్ పార్టీ జరగగా అందులో డ్రగ్స్ ను సేవించినట్లు స్పష్టమైన ఆధారాలు లభించగా కేసు నమోదు చేసుకున్న మాదాపూర్ విభాగం పోలీసులు తదనంతర దర్యాప్తును కొనసాగించిన ఘటనను మర్చిపోకముందే గత నెల రోజుల క్రితం గచ్చిబౌలిలోనే మరో డ్రగ్స్ పార్టీ కేసు తెలుగులోకి రావడం, ఇక రాజేంద్రనగర్ డివిజన్ పరిధి నార్సింగి, మంచిరేవుల తదితర ప్రాంతాలలో అనేక గాంజా కేసులు, డ్రగ్స్ కేసులు బయటపడ్డప్పటికీ వాటి పరిణామాలు అనేక మలుపులు తిరిగి చివరకు ఎలాంటి ఫలితాలను ఇవ్వకపోవడంతో శేరిలింగంపల్లి ప్రాంతంలో డ్రగ్స్, గాంజా వినియోగం సర్వసాధారణంగా మారిందనడంలో అతిశయోక్తి లేదని పలువురు సీనియర్ సిటిజెన్లు ఆరోపిస్తున్నారు. మహారాష్ట్ర నుండి రాజస్థాన్, కర్ణాటక తదితర ప్రాంతాలకు డ్రగ్స్ ను, ఒరిస్సా, వైజాగ్ నుండి పెద్ద ఎత్తున గాంజాను మధ్యప్రదేశ్ తదితర రాష్ట్రాలకు తరలించడానికి ముంబై జాతీయ రహదారి అనుకూలంగా ఉండడంతో మాదకద్రవ్యాల సరఫరాకు శేరిలింగంపల్లి పరోక్షంగా అడ్డగా మారిందని ఆరోపణలు బలంగా వినిపిస్తుండడం గమనార్హం.



**తాజాగా గచ్చిబౌలిలో రేవ్ పార్టీ...**
**వాస్తవాలు వెలుగు చూడని వైనం!?**

ప్రతిరోజు నగరం పరిధిలో ఎక్కడో ఒకచోట డ్రగ్స్ పార్టీలు, ఆయా కాలేజీల ఆవరణలో విచ్చలవిడిగా గంజాయి సేవనం జరుగుతున్నా దొరికినోడే దొంగ, దొరకనివాడు దొర అన్న చందంగా షరా మామూలుగా పరిస్థితులు తయారవుతున్నాయి అంటే నేడు విశ్వనగరం ఎంత ప్రమాదకర స్థాయిలో ఉందో ఊహించవచ్చు. ప్రస్తుతం నేరాల స్థాయిలో హైదరాబాద్ నగరం ముందు వరుసలో ఉండడం వెనుక ప్రధాన కారణం మత్తు పదార్థాలు, యదేచ్ఛగా మద్యం సేవనం కారణమని పలు నివేదికలు బలంగా నొక్కి చెప్తున్నా చాలామంది నేడు మత్తుకు బానిసలుగా మారి జీవితాలను దుర్భరం చేసుకుంటున్నారు అనేది కాదనలేని సత్యం. చాలా విషయాలలో కఠినంగా, పకడ్బందీ ప్రణాళికతో వ్యవహరించే ప్రభుత్వం, యంత్రాంగం డ్రగ్స్ విషయంలో మాత్రం ఉదాసీన వైఖరిని కనబరుస్తున్నారని పలువురు విద్యావంతులు, సామాజికవేత్తలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. మత్తుకు బానిసైన యువత, కుటుంబీకులు నేర ప్రవృత్తిని పెంపొందించుకొని కుటుంబాలలో చీకటిని నింపుకుంటున్నారని ఇది భవిష్యత్తు తరాలకు ఎంత మాత్రమూ ఆమోదయోగ్యం కాదని విద్యావంతులు స్పష్టం చేస్తున్నారు. పరిధిని దాటుతున్న డ్రగ్స్ రాక్షసి కోరలు చాస్తూ ప్రస్తుతం కొంతమంది ప్రభుత్వ ఉద్యోగులు సైతం బహిరంగంగానే మాదకద్రవ్యాలకు సలాం కొట్టే స్థాయికి చేరుకున్నారనే వాదనలు గట్టిగానే వినిపిస్తున్నాయి. కొందరు బాధ్యత కలిగిన వ్యక్తులు కూడా నిర్లజ్జగా డ్రగ్స్ పట్ల ముందుకు సాగుతుండడం ఆందోళన కలిగించే అంశమని శేరిలింగంపల్లి వాసులు చెబుతున్నారు. శేరిలింగంపల్లి పరిధి గచ్చిబౌలి లో సోమవారం ఓ ప్రైవేట్ అపార్ట్మెంట్ లో జరిగిన డ్రగ్స్ పార్టీలో ఆంధ్ర ప్రాంతానికి ముగ్గురు డ్రగ్స్ కన్స్యూమర్స్( ఇద్దరు వ్యక్తులు, ఓ మహిళ తో పాటు మొత్తం ఏడుగురిని గచ్చిబౌలి పోలీసులు అదుపులోకి తీసుకొని కేసు నమోదు చేసినట్లు తెలుస్తోంది. అయితే ప్రత్యక్ష ఘటనలో పాలుపంచుకున్న ఒకరిద్దరు కీలక వ్యక్తులను పోలీసులు తప్పించారనే ఊహాగానాలు వినిపిస్తుండడం పలు విమర్శలకు తావిస్తోంది. ఈ మధ్యకాలంలో ఎన్నో మాదకద్రవ్యాల ఘటనలకు శేరిలింగంపల్లి కేరాఫ్ అడ్రస్ గా మారిందని, అధికారుల నిర్లక్ష్య వైఖరికి విశ్వనగరానికి గుండెకాయ వంటి శేరిలింగంపల్లి నిందలు మోయాల్సి వస్తుందని పలువురు సామాజిక వేత్తలు దుయ్యబడుతున్నారు. ఇప్పటికైనా ఉమ్మడి తెలుగు రాష్ట్రాలు డ్రగ్స్ పెడలర్స్, డ్రగ్స్ లభించే ప్రాంతాలు, సోర్సులను ప్రత్యేక చర్యల ద్వారా కట్టడి చేస్తూ నిర్దాక్షిణ్యంగా అణిచివేయాల్సిన ఆవశ్యకతను ఎత్తిచూపుతున్నారు. కాగా గచ్చిబౌలిలో సోమవారం రేవ్ పార్టీ జరుగుతుందన్న విశ్వసనీయ సమాచారం మేరకు ఘటనాస్థలికి పోలీసులు చేరుకొని ఏడుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకోగా వారి వద్ద నుండి 20 గ్రాముల కొకైన్, 4 గ్రాముల ఎండిఎంఎ, 20 ఎస్టీసి పిల్స్ స్వాధీనం చేసుకోవడం జరిగింది.

# బ్యాంక్‌లో ప్రజల తాకట్టు బంగారానికి భద్రత?

- 10 నెలల నిర్లక్ష్యానికి 20 కిలోల బంగారం మాయం
- బ్యాంకు ముందు ఖాతాదారుల ఆందోళన, ఉద్రిక్తత

**మంచిర్యాల ప్రతినిధి జనంసాక్షి :** ప్రజలకు అత్యవసర పరిస్థితుల్లో బయట అప్పు కోసం వెళితే అధిక వడ్డీలతో దోపిడీ చేస్తారని తప్పనిసరి పరిస్థితిలో ముచ్చటపడి చేయించుకున్న బంగారు ఆభరణాలను ప్రభుత్వ బ్యాంకులలో తాకట్టు పెట్టి డబ్బులు తీసుకుంటారు. డబ్బులు సర్దుబాటు అయిన తర్వాత తాకట్టు పెట్టిన తమ బంగారాన్ని తిరిగి విడిపించుకుందామంటే తాకట్టు పెట్టిన బంగారం బ్యాంకులో కనిపించకపోతే ఖాతాదారుల పరిస్థితి ఏంటి? మహిళలు ఆభరణాల విషయంలో వందల డిజైన్లు చూసి అందులో ఒక మంచి డిజైన్ ఎన్నుకొని ఆభరణాలు చేయించుకొని మురిసిపోతుంటారు. అలాంటి బంగారు ఆభరణాలు బ్యాంకులో లేవు అని తెలిస్తే వారి పరిస్థితి ఏంటి? బ్యాంక్‌లో బంగారం తాకట్టు పెట్టినవారు తమ బంగారం ఇవ్వాలని సోమవారం మంచిర్యాల జిల్లా చెన్నూర్ ఎస్బిఐ బ్యాంక్(2) ముందు ధర్నా చేస్తూ నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఖాతాదారులు మాట్లాడుతూ....10 నెలలుగా బంగారం అపహరణకు గురవుతుంటే బ్యాంకు ఉన్నతాధికారి పర్యవేక్షణ ఏం చేస్తున్నాడని ప్రశ్నించారు. అర్జెంట్ గా లక్ష రూపాయల నగదు కావాలంటే ఎన్నో కారణాలు చెప్పి బ్యాంకు చుట్టూ తిప్పించుకునే అధికారులు 20 కిలోల బంగారం బ్యాంకు బయటకు వెళ్తుంటే ఏం చేశారని ప్రశ్నించారు.మా బంగారు ఆభరణాలు తాకట్టు పెట్టినప్పుడు ఏ ఆకారంలో ఉన్నాయో అలా ఇస్తారా అనే సందేహాలు ఖాతాదారులు అనుమానం వ్యక్తం చేశారు . మంచిర్యాల జిల్లా చెన్నూర్ స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఎస్బిఐ బ్యాంకు (2) లో పనిచేస్తున్న క్యాషియర్ చేతివాటం ప్రదర్శించి 12 కోట్ల విలువైన బంగారు ఆభరణాలను అపహరించుకపోయి పరారీలో ఉన్నాడనే ఆరోపణలున్నాయి. క్యాషియర్ రవీందర్‌తోపాటు మరో తొమ్మిది మంది నిందితులు ఈ స్కాముల లో పాత్ర ఉన్నట్లు బ్యాంక్ అధికారులు అనుమానం వ్యక్తం చేశారు . తాకట్టు పెట్టిన బంగారం గత 10 నెలల నుండి దశల వారీగా బ్యాంకు సిబ్బంది కళ్లు గప్పి 20 కిలోల బంగారాన్ని మాయం చేయగా బ్యాంకులో ప్రతి మూడు నెలలకు ఒకసారి ఆడిటింగ్ అధికారులు క్రెడిట్, డేబిట్స్ ఆడిట్ చేస్తారనే విషయం అందరి తెలిసిందే. ఆడిట్ అధికారులు సైతం 10 నెలలు గుర్తించలేకపోయారా ? అనుమానాలు వ్యక్తం వ్యక్తమవుతున్నాయి .గత నాలుగు రోజుల నుండి అవకతకలపై ఆడిట్ జరుగుతున్న నేపథ్యంలో క్యాషియర్ పరారీలో ఉండడం అనుమానాలకు బలం చేకూరుస్తుంది.12 కోట్ల రూపాయల విలువైన బంగారు ఆభరణాలు అపహరణలో ఒక్క క్యాషియర్ పాత్రే ఉందా బ్యాంక్ లో ఇంకెవరైనా అతడికి సహకరించారా అనే పలు అనుమానాలు పలు ప్రశ్నలు ఉత్పన్నమవుతున్నాయి .12 కోట్ల రూపాయల విలువైన బంగారు ఆభరణాలు సంబంధిత క్యాషియర్ మాయం చేసిన నేపథ్యంలో బ్యాంకులో మేనేజర్ ఏం చేస్తున్నారనే ప్రశ్నలు ఉత్పన్నమవుతున్నాయి. ఒక్కసారిగా ఇంత బంగారం తీసుకపోవడం సాధ్యం అయ్యే పని కాదు. దశలవారీగా తీసుకపోతున్న నేపథ్యంలో అధికారులు ఎందుకు పట్టుకోలేకపోయారు. బ్యాంక్‌లో 10 నెలల నుండి ఆడిటింగ్ జరగలేదా? అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. మంచి డిజైన్లతో చేయించుకున్న బంగారు ఆభరణాలు మళ్లీ తమ చేతికి అదే డిజైన్ లో వస్తాయో లేదో అనే అనుమానాలు ఖాతాదారుల్లో వ్యక్తం అవుతున్నాయి . పరార్ లో ఉన్న క్యాషియర్ రవీందర్ ను పట్టుకుంటే బ్యాంకులో ఏం జరిగింది. ఈ స్కామ్ లో ఎవరెవరి పాత్ర ఉంది అనేది పూర్తిగా బయటకు వచ్చే అవకాశాలున్నాయి.



# ఇండస్ట్రియల్ హబ్ ద్వారా 2 వేల మందికి ఉద్యోగాలు

### మంచిర్యాల ఎమ్మెల్యే ప్రేమ్ సాగర్ రావు

**మంచిర్యాల ప్రతినిధి ఆగస్టు 25 జనంసాక్షి :** తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చినప్పటి నుండి అభివృద్ధి , సంక్షేమమే లక్ష్యంగా ముందుకు సాగుతున్నామని ఈ నేపథ్యంలో రాబోయే ఎన్నికల్లో సైతం తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ తో పాటు సెంట్రల్ లో కూడా కాంగ్రెస్ పార్టీ అధికారం చేపడుతుందని మంచిర్యాల ఎమ్మెల్యే ప్రేమ్ సాగర్ రావు ఆశాభావం వ్యక్తం చేశారు. సోమవారం నాడు మంచిర్యాల జిల్లా మంచిర్యాల జిల్లా కేంద్రంలోని ఎమ్మెల్యే నివాసంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.... మంచిర్యాల నియోజకవర్గం అభివృద్ధి విషయంలో బీఆర్ఎస్ బీజేపీ పార్టీల నాయకులతో బహిరంగ చర్చకు సిద్ధమని ఆయన సవాల్ విసిరారు..మంచిర్యాల నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసి అత్యున్నతంగా తీర్చిదిద్ది హైదరాబాద్‌తో సమానంగా అభివృద్ధి చేస్తానని పేర్కొన్నారు.ఉమ్మడి ఆదిలా బాద్ జిల్లాలోని లేనటువంటి 400 మెగావాట్ల సబ్ స్టేషన్, మంచిర్యాల 220 మెగా వాట్లా సబ్ స్టేషన్ ను, లక్షెట్టిపేట్ లో,130 మెగా వాట్లా సబ్ స్టేషన్ ను, నస్పూర్ లో ఏర్పాటు చేసేందుకు అనుమతులు వచ్చాయని అన్నారు. అభివృద్ధిపై చిత్తశుద్ధి ఉంది కాబట్టే నాపై కొందరు నాయకులు బురదజల్లే ప్రయత్నం చేస్తున్నారు. అభివృద్ధికి అడ్డుపడితే సహించేది లేదని ఘాటుగా విమర్శించారు. బతుకమ్మ కానుకగా మహిళలకు శ్రీ శక్తి భవనం నిర్మించేందుకు ప్రయత్నిస్తున్నానని తెలిపారు. మంచిర్యాల పట్టణంలో శిథిలా వ్యవస్థలో ఉన్న బాయ్స్ హై స్కూల్, గర్ల్స్ హై స్కూల్ భవనాలను తొలగించి నూతన భవనాలు నిర్మిస్తామని అన్నారు. మంచిర్యాల జిల్లాకు త్వరలోనే నవోదయ హై స్కూల్ మంజూరు అవుతుందని తెలిపారు. సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ నిర్మాణ పనులు శరవేగంగా జరుగుతున్నాయని అన్నారు. హాజీపూర్ మండలంలోని ముల్కల వద్ద నిర్మిస్తున్న ఇండస్ట్రియల్ హబ్ ద్వారా రెండు వేల మందికి ఉద్యోగ అవకాశాలు కల్పించేందుకు చర్యలు చేపట్టామని తెలిపారు.వచ్చే వినాయక చవితి సందర్భంగా వినాయక మండపాలకు ఉచిత విద్యుత్ అందించి మున్సిపాలిటీ ద్వారా త్రాగునీరు, సానిటేషన్ వ్యవస్థ ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ప్రజలకు ఎవరైనా ఇబ్బందులకు చేస్తే సహించేది లేదని ఆయన హెచ్చరించారు. ప్రశాంత వాతావరణంలో గణేష్ నవరాత్రి ఉత్సవాలు జరుపుకోవాలని ప్రజలను కోరారు. నాకు గత 20 రోజు అనారోగ్యానికి గురి కావడం జరిగింది.. నేను ఆయురారోగ్యాలతో ఉండాలని ప్రత్యేక పూజలు చేసిన ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా ప్రజలకు, కాంగ్రెస్ పార్టీ నాయకులకు, మహిళా నాయకురాలకు, కార్యకర్తలకు, అభిమానులకు పేరు పేరునా ధన్యవాదాలు తెలిపారు.ఈ కార్యక్రమంలో మంచిర్యాల జిల్లా డీసీసీ అధ్యక్షురాలు కొక్కిరాల సురేఖ, తాజా మాజీ ప్రజా ప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, మహిళా నాయకురాలు, యువజన కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలుపాల్గొన్నారు..





# పాఠశాల విద్యార్థులకు ఫుడ్ పాయిజన్

- హుటాహుటిన పాఠశాలకు చేరుకున్న సబ్ కలెక్టర్ కిరణ్మయి

**నిజామాబాద్ జిల్లా బ్యూరో ఆగస్టు 25 (జనం సాక్షి) :** కామారెడ్డి జిల్లా బిచ్కుంద మండలంలోని షెట్లూర్ గ్రామంలో గల ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులు తిన్న ఆహారం విషాహారంగా మారింది. దీంతో పాఠశాలకు చెందిన సుమారు 21 మంది విద్యార్థులు తీవ్ర అస్వస్థతకు గురయ్యారు. పూర్తి వివరాలు ఇలా ఉన్నాయి. కామారెడ్డి జిల్లాలోని బిచ్కుంద మండలం షెట్లూర్ ప్రాథమిక పాఠశాలలో పాఠశాలలో ఉన్న 28 మంది సోమవారం పాఠశాలకు విచ్చేశారు. ప్రతీ రోజు మాదిరిగానే మధ్యాహ్న భోజనం చేయగా అందులో 21 మంది అస్వస్థతకు గురి కాగా వారిని వెంటనే బిచ్కుంద మండల కేంద్రంలో గల ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్లి చికిత్స అందించారు. ఈ విషయం తెలుసుకున్న బాన్సువాడ సబ్ కలెక్టర్ కిరణ్మయి వెంటనే ఘటనా స్థలానికి అనంతరం బిచ్కుంద అస్పత్రికి చేరుకొని పరిస్థితిని అలాగే విద్యార్థుల ఆరోగ్య స్థితిగతులను పర్యవేక్షణ చేశారు. ఈ విషయపై పూర్తి సమాచారం సేకరించాలని, ఫుడ్ పాయిజన్ పై వివరాలు అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులకు మెరుగైన వైద్యం అందించాలని వైద్య సిబ్బందిని ఆదేశాలు జారీ చేశారు. ఎవ్వరికి ఎలాంటి ప్రమాదం లేదని అందరూ ఆరోగ్యంగా ఉన్నారని ఆమె తెలిపారు. ఆమె వెంట డీఈఓ రాజు, తాసిల్దార్ వేణుగోపాల్, ఎంపీడీవో గోపాలకృష్ణ, ఎంఈవో శ్రీనివాస్ రెడ్డి, మరియు ప్రజా ప్రతినిధులు, విద్యార్థులను పరామర్శించారు.

# కోదండరామ్‌పై మొసలి కన్నీరు

- దమ్ముంటే కోదండను సిఎంను చేయాలి
- ఉస్మానియాకు వేయికోట్లు ప్రకటించాలి
- బీఆర్ఎస్ ఎమ్మెల్సీ దాసోజు శ్రవణ్ డిమాండ్



**హైదరాబాద్, ఆగస్ట్25 (జనంసాక్షి) :** ఉస్మానియా యూనివర్సిటీలో సీఎం రేవంత్ రెడ్డి సొల్లు పురాణం మాట్లాడారని ఎమ్మెల్సీ దాసోజు శ్రవణ్ కుమార్ విమర్శించారు. సోమవారం బీఆర్ఎస్ భవన్‌లో మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. కోదండరాం పట్ల రేవంత్ రెడ్డి మొసలి కన్నీరు కారుస్తున్నారు. రేవంత్ రెడ్డిని హీరోగా పెట్టి ఆహా నా పెళ్లంట సినిమా తీయాలని ఎద్దేవా చేశారు. ఓయూకు వెయ్యి కోట్లు- ఇవ్వాలన్నారు. కోదండరామ్ సీఎం పదవికి రేవంత్ రెడ్డి కంటే అర్హుడుఅన్నారు. రేవంత్ రెడ్డి సీఎం పదవి నుంచి దిగిపోయి కోదండరామ్ కు సీఎం పదవి అప్పగించాలని సూచించారు. నేను రాజకీయాల్లోకి రియల్ ఎస్టేట్ దందాల కోసం రాలేదన్నారు. నేను ఏ పార్టీలో ఉన్నా ప్రజల కోసం పనిచేశానని స్పష్టం చేశారు. మా కష్టానికి, త్యాగానికి విలువ లేదా? ఎరుకుల బిడ్డ కుర్రా సత్యనారాయణకు ఎమ్మెల్సీ ఇస్తే అడ్డుకున్నారని అన్నారు. మేము కోదండరామ్ ను అడ్డుకోలేదు. మా గొంతుకోయడం కోసం కోదండరామ్ ను రేవంత్ రెడ్డి అడ్డుపెట్టారన్నారు. కోదండరామ్ తో రేపు పొద్దున మంత్రిగా ప్రమాణస్వీకారం చేయించు. జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో కోదండరామ్ ను నిలబెట్టాలని సవాల్ విసిరారు. కోదండరామ్ ను లిటిగేషన్ లో ఎందుకు పెట్టారని ప్రశ్నించారు. సీఎం కుర్చీని గౌరవించాలని అంటున్న రేవంత్ రెడ్డి మంత్రి పదవిని, వైస్ ఛాన్సలర్ పదవిని ఎందుకు గౌరవించడం లేదన్నారు.స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ అంటే అందరికి ఆత్మీయత ఎక్కువ. స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ సావాస దోషాలతో రేవంత్ రెడ్డి లైన్‌లో నడుస్తున్నారన్నారు. అప్పులపై స్పీకర్ అబద్దాలు చెప్పారని పేర్కొన్నారు. బీఆర్ఎస్ హయాంలో చేసిన రూ.3 లక్షల 50 వేల 520 కోట్లు- అని పార్లమెంటులో కేంద్రమంత్రి అన్నారు. రేవంత్ రెడ్డిని సీఎం పదవి నుంచి దింపి స్పీకర్ ప్రసాద్ కుమార్ సీఎం కావాలన్నారు. పార్లమెంట్‌లో రఘునందన్ రావు అడిగిన ప్రశ్నకు కేంద్రమంత్రి అప్పులపై సమాధానం ఇచ్చిన విషయాన్ని గుర్తు చేశారు. తెలంగాణ కోసం యాదయ్య, శ్రీకాంతాచారి ఆత్మబలిదానా లు చేసుకుంటే రేవంత్ మాత్రం చంద్రబాబు నాయుడు సంకలో ఉన్నారని ఎద్దేవా చేశారు. నేను కుమార్‌ను ఓయూ వైస్ ఛాన్సలర్ ను చేశామని రేవంత్ రెడ్డి అన్నారు. దీంతో రేవంత్ రెడ్డి ఫ్యూడలిజం, భూస్వామ్య మనస్తత్వం బయటప డిందన్నారు. ఓయూలో కాళేశ్వరం గురించి రేవంత్ రెడ్డి మాట్లాడుతున్నారు . జీవో 29 పేరు మీద రేవంత్ రెడ్డి విధ్వంసానికి పాల్పడ్డారని ఆరోపించారు. కోర్టుల్లో ఉన్న అంశాల గురించి రేవంత్ రెడ్డి మాట్లాడుతున్నారు. కోర్టులను, కోర్టు తీర్పులను రేవంత్ రెడ్డి అవమానిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. రేవంత్ రెడ్డిని సీఎం చేసేందుకు నిరుద్యోగులు బస్సులు వేసుకుని రాష్ట్రం మొత్తం తిరిగారు. 60వేల ఉద్యోగాలు రేవంత్ రెడ్డి గుర్తించిన ఉద్యోగాలా? సృష్టించిన ఉద్యోగాలా? అని ప్రశ్నించారు. హెచ్‌సీయూలో రేవంత్ రెడ్డి చంపింది ఏనుగులు, సింహాలను కాదు జింకలు, నెమళ్లను చంపారన్నారు. బీఆర్ఎస్ అధికారంలోకి వస్తుందని రేవంత్ రెడ్డికి భయం మొదలైంది. ఉస్మానియా భూములను బీఆర్ఎస్ ప్లాట్లు- చేసుకుని అమ్ముకుంటారని రేవంత్ రెడ్డి అంటున్నారు. గచ్చిబౌలి భూములను ప్లాట్లు చేసి అమ్ముకున్నది ఎవరో ప్రజలకు చెప్పాలని డిమాండ్ చేశారు.



# సిఎంకు ఖైరతాబాద్, బాలాపూర్ ఉత్సవ కమిటీల ఆహ్వానం

**హైదరాబాద్, ఆగస్ట్25 (జనంసాక్షి) :** జూబ్లీహిల్స్ నివాసంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని ఖైరతాబాద్ గణేష్ అడ్‌హక్ కమిటీ సభ్యులు కలిసారు. ఎమ్మెల్యే దానం నాగేందర్ నేతృత్వంలో శ్రీ విశ్వశాంతి మహా శక్తి గణపతి-2025 నవరాత్రి ఉత్సవాలకు సీఎంను అడ్ హక్ కమిటీ ఆహ్వానించింది. జూబ్లీహిల్స్ నివాసంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని బాలాపూర్ గణేష్ ఉత్సవ సమితి సభ్యులు కూడా కలిశారు. బాలాపూర్ గణేష్ నవరాత్రి వేడుకలకు గణేష్ ఉత్సవ సమితి ఆహ్వానించింది. కార్యక్రమంలో బడంగ్ పేట్ కార్పొరేషన్ మాజీ మేయర్ పారిజాత నరసింహారెడ్డి, బాలాపూర్ గణేష్ ఉత్సవ సమితి చైర్మన్ నిరంజన్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

# లక్ష్మీప్రసన్నను హింసించి చంపారు



- పోలీస్ స్టేషన్ ముందు కుటుంబీకుల ధర్నా

**ఖమ్మం, ఆగస్ట్25 (జనంసాక్షి) :**ఖమ్మం జిల్లా అశ్వారావుపేటలో సంచలనం సృష్టించిన వివాహిత లక్ష్మీప్రసన్న అనుమానాస్పద మృతి కేసులో కుటుంబం ఆందోళనకు దిగింది. తమ కుమార్తెను అల్లుడు నరేశ్ రెండేళ్లుగా గృహనిర్బంధం చేసి, హింసించి చంపారని ఆమె తల్లిదండ్రులు ఆరోపిస్తున్నారు. సోమవారం అశ్వారావుపేట పోలీస్ స్టేషన్ ఎదుట లక్ష్మీప్రసన్న బంధువులు ధర్నాకు దిగారు. ఆమె మరణానికి కారణమైన భర్తను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. పీఎస్ ముందు ఆందోళన చేస్తుండటంతో రహదారిపై వాహనాలు స్తంభించిపోయాయి. నరేశ్‌తో వివాహ సమయంలో రెండెకరాల మామిడితోట, అర ఎకరం పొలంతోపాటు రూ.10 లక్షల నగదు, రూ.10 లక్షలు విలువ చేసే బంగారు ఆభరణాలను కట్నంగా ఇచ్చామని లక్ష్మీప్రసన్న తల్లిదండ్రులు తెలిపారు. అశ్వారావుపేటకు వెళ్లిన ఏడాదిపాటు తమ కుమార్తె మాట్లాడేది. రెండేళ్ల నుంచి ఆమెను చూపించలేదు, ఫోన్ చేసినా మాట్లాడనివ్వలేదు. మేము వెళ్లినా ఊర్లో లేదని ఏవేవో కారణాలు చెప్పి పంపించేవారు. ఆమెను గృహ నిర్బంధం చేసి ఆహారం పెట్టకుండా చంపేశారని వాపోయారు.

# ఏసీబీకి చిక్కిన వ్యవసాయాధికారి

- రూ.50 వేలు లంచం తీసుకుంటుండగా పట్టివేత



**భద్రాద్రి కొత్తగూడెం, ఆగస్టు 25 (జనంసాక్షి) :** ఏసీబీ ఎన్ని దాడులు చేస్తున్నా ఎంత మందిని అరెస్టు చేస్తున్నా అధికారుల చేతివాటం మారటం లేదు. ఏసీబీకి దొరికితే ఉద్యోగం రిస్క్‌లో పడుతుందని కూడా ఆలోచించకుండా టేబుల్ కింద చేయి పెడుతూనే ఉన్నారు. సోమవారం కొత్తగూడెం వ్యవసాయ శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ నర్సింహారావు లంచం తీసుకుంటూ ఏసీబీకి అడ్డంగా దొరికారు. లక్ష్మీదేవి పల్లి మండలం బంగారు చిలక గ్రామంలోని ఫర్టిలైజర్ షాప్ యజమాని నుంచి రూ. 50 వేల లంచం డిమాండ్ చేయగా... ఇవాళ రూ.25 వేలు తీసుకుంటుండగా ఏసీబీ అధికారులు పట్టుకున్నారు. యూరియా అమ్మకాల కోసం షో కాజ్ నోటీసు ఇచ్చి దాన్ని ఉపసంహరించుకునేందుకు రూ 25 వేలు తన కార్యాలయం విద్యానగర్ లో లంచం తీసుకుంటుండగా ఏసీబీడి ఎస్పీ వై. రమేష్ రెడ్ హ్యాండెడ్ గా పట్టుకున్నారు. ఈ సందర్భంగా మాట్లాడిన ఏసీబీ డీఎస్పీ వై రమేష్ .. కొత్తగూడెం విద్యానగర్ కాలనీలో అసిస్టెంట్ డైరెక్టర్ ఆఫ్ అగ్రికల్చర్ ఏడిఏ ఆఫీస్ లో అసిస్టెంట్ డైరెక్టర్ ఆఫ్ అగ్రికల్చర్ ఏడీఏ నరసింహారావు ఫెర్టిలైజర్ షాపు యజమాని వద్ద 25 వేలు లంచం తీసుకుంటుండగా ఎసిబి సిబ్బంది రెడ్ హ్యాండెడ్ గా పట్టుకున్నారు. లక్ష్మీదేవిపల్లి మండలంలోని బంగారు చెలక గ్రామంలో యూరియా అమ్మకాలు చేస్తున్న ఫెర్టిలైజర్ షాప్ దగ్గరకు ఏడిఏ నరసింహారావు వెళ్లారు. షాపు వారిని సంబంధిత కాగితాలు తీసుకొని ఏడీఏ ఆఫీస్ కు రావలసిందిగా ఆదేశించారు. షాపు ఓనరు కాగితాలు తీసుకొని అగ్రికల్చర్ ఆఫీస్ కు రాగా మీ దగ్గర ఫార్మ్ లేదని, ఇన్ వాయిస్ ప్రాపర్ గా లేదని రూ. 50 వేలు లంచం ఇవ్వాలని డిమాండ్ చేశారు. లంచం ఇచ్చుకోలేమని బతిమిలాడినప్పటికీ ఇవ్వక పోతే షాపు లైసెన్స్ రద్దు చేస్తామని బెదిరించడంతో షాపు ఓనర్ ఏసీబీని ఆశ్రయించాడు. షాపు ఓనర్ ని లంచం అడిగిన వాయిస్ రికార్డుతో పాటు- ఈ రోజు రూ. 25000 లంచం తీసుకుంటుండగా రెడ్ హ్యాండెడ్ గా పట్టుకున్నారు. కలర్ టెస్టింగ్ లో సైతం ఏడిఏ నరసింహారావు దొరికినట్లు ఏసీబీ డీఎస్పీ వై రమేష్ తెలిపారు.

# పర్యావరణ హిత మట్టి గణపతులనే పూజిద్దాం

- సమాచారశాఖ స్పెషల్ కమిషనర్ ప్రియాంక

**హైదరాబాద్, ఆగస్ట్25 (జనంసాక్షి) :** పర్యావరణానికి హానిచేయని సహజంగా లభించే మట్టి విగ్రహాలతో వినాయకున్ని పూజించి పర్యావరణ పరిరక్షణ లో అందరు భాగస్వాములు కావాలని సమాచార పౌర సంభందాల శాఖ స్పెషల్ కమిషనర్ సి.హెచ్.ప్రియాంక కోరారు. సోమవారం సమాచార శాఖ కార్యాలయంలో ఉద్యోగులకు మట్టి గణపతి విగ్రహాలను స్పెషల్ కమిషనర్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ, గణేష్ చతుర్థి పది రోజుల పాటు- జరిగే ముఖ్యమైన పండుగ అని పేర్కొన్నారు. రసాయనాలు, పి.ఓ.పి తో తయారు చేసిన గణపతి విగ్రహాలను వాడటం వలన పర్యావరణానికి హాని కలుగుతుందని, పి.ఓ.పి విగ్రహాలకు బదులుగా మట్టి విగ్రహాలను ప్రతిష్టించి పండుగను ఘనంగా జరుపుకోవాలని ఆమె కోరారు. ఈ కార్యక్రమంలో అదనపు సంచాలకులు డి.ఎస్.జగన్, జాయింట్ డైరెక్టర్లు డి.శ్రీనివాస్, కె.వెంకటరమణ, ఈఓఊ రాధాకిషన్, డిప్యూటి డైరెక్టర్లు యం.మధుసూధన్, సి.రాజారెడ్డి, సమాచార శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

# ఫుడ్ ప్యాకెట్లపై ఎక్స్‌పైరీ డేట్ మార్చి అమ్మకాలు

- తెలుగువారు సహా 12 మందికి రెండేళ్ల జైలు
- శిక్షపడ్డవారిలో ముగ్గురు నిజామాబాద్ వాసులు




**నిజామాబాద్, ఆగస్ట్25 (జనంసాక్షి) :** బహ్రెయిన్‌లో కాలం చెల్లిన ఫుడ్ ప్యాకెట్లపై గడువు తేదీలను మార్చిన నేరంపై తెలుగువారితో సహా 12 మంది ప్రవాసీయులకు రెండేళ్ల జైలు శిక్ష పడింది. అలాగే దేశ బహిష్కరణ శిక్ష కూడా విధించారు. ఆహార భద్రతా ప్రమాణాలను గల్ఫ్ దేశాలన్నీ ఖచ్చితంగా పాటిస్తూ ప్రజారోగ్యానికి పెద్దపీట వేస్తాయి. అయినా కొందరు వ్యాపారస్థులు అక్రమాలకు పాల్పడుతుంటారు. ఆ అక్రమాలు వెలుగులోకి వచ్చినపుడు ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకుంటుంది. అరబ్బు దేశానికి పని చేయడానికి వచ్చిన ఓ పంజాబ్ యువకుడు తను పని చేస్తున్న సంస్థలోని లొసుగులపై ఫిర్యాదు చేశాడు. దాంతో తెలుగువారితో సహా మరో 19 మంది జైలు పాలయ్యారు. బహ్రెయిన్ లోని ఒక ప్రముఖ ఆహార సామాగ్రి సరఫరా సంస్థలో పని చేస్తున్న తెలుగు వారితో సహా మొత్తం 19 మంది భారతీయులు ఫుడ్ ప్యాకెట్లపై గడువు తేదీలను మార్చిన నేరంపై రెండేళ్ల జైలు శిక్షను అనుభవించనున్నారు. వీరిలో తెలంగాణకు చెందిన వారున్నారు. నిజామాబాద్ జిల్లాకు చెందిన ముగ్గురు, రాజన్న సిరిసిల్లా, జగిత్యాల జిల్లాలకు చెందిన ఒక్కొకరు చొప్పున మొత్తం అయిదుగురు తెలంగాణ ప్రవాసీయులకు బహ్రెయిన్ హైకోర్టు రెండేళ్ల జైలు శిక్షను ఖరారు చేసింది. ఒక యువకుడు కొద్ది కాలం క్రితం బహ్రెయిన్ లోని సదరు ఆహార సంస్థలో కార్మికుడిగా పని చేయడానికి వచ్చాడు. అయితే తాను ఆశించిన పని లభించకపోవడంతో ఆగ్రహం పెంచుకున్నాడు. ఆహార గిడ్డంగిలో ఆహార ప్యాకెట్లపై గడువు ముగింపు తేదీలను మారుస్తూ మోసాలకు పాల్పడుతున్నారని వీడియో రికార్డింగ్ చేసి నేరుగా బహ్రెయిన్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. దీంతో పోలీసులు, వాణిజ్య, ఆరోగ్య శాఖ అధికారులు గిడ్డంగులపై దాడులు చేసి గడువు ముగిసిన 14 వేల వివిధ ఆహార ప్యాకెట్లను స్వాధీనం చేసుకున్నారు. మొత్తం 29 మందిని అరెస్ట్ చేసారు. విచారణ అనంతరం, ఏడుగురు భారతీయులను విడుదల చేశారు. స్థానికులయిన యాజమానులతో పాటు- మొత్తం 19 మంది భారతీయులకు జైలు శిక్షలు విధించారు. హై కోర్టుకు అప్పీలుకు వెళ్లినా ఫలితం లేకపోయింది. కాగా, తమ వలన కష్టాలు ఎదుర్కొంటు-న్న భారతీయ కార్మికులకు వీలయినంతగా సహాయం చేసేందుకు సదరు సంస్థ సిద్ధమైంది. స్వదేశంలోని వీరి కుటు-ంబాలకు కూడా ప్రతి నెలా ఆర్థిక సహాయం చేయడానికి కూడా ప్రయత్నిస్తున్నట్లు- సమాచారం. రెండేళ్ల జైలు శిక్ష అనంతరం ఈ కార్మికులను దేశం నుంచి బహిష్కరించాలని న్యాయస్థానం తీర్పునిచ్చింది.

# రేఖాగుప్తాకు జడ్ ప్లస్ ఉపసంహరణ

- ఢిల్లీ పోలీసులకే రక్షణ బాధ్యతలు అప్పగింత



**న్యూఢిల్లీ, ఆగస్ట్25 (జనంసాక్షి) :** ఢిల్లీ ముఖ్యమంత్రికి కల్పించిన జెడ్ కేటగిరీ సీఆర్‌పీఎఫ్ సెక్యూరిటీని కేంద్రం ఉపసంహరించుకున్నట్లు అధికారిక వర్గాలు తెలిపాయి. ఇకపై ఢిల్లీ పోలీసులు ముఖ్యమంత్రికి భద్రత కల్పించనున్నారు. ఇటీవల ఢిల్లీలో జరిగిన అధికారిక కార్యక్రమంలో ఓ వ్యక్తి సీఎం రేఖా గుప్తాపై దాడి చేసిన నేపథ్యంలో కేంద్రం సీఎంకు జెడ్ క్యాటగిరీ భద్రత కల్పించింది. ముఖ్యమంత్రికీ భద్రత కల్పించాలని కేంద్ర హోమ్ శాఖ సీఆర్‌పీఎఫ్‌ను ఆదేశించింది. ఈ భద్రతను మరింత కాలం పొడిగించొచ్చన్న వార్తలు వెలువడ్డాయి. అయితే, కేంద్రం ఢిల్లీ సీఎం జెడ్ కేటగిరీ భద్రతా ఏర్పాట్లను తొలగించేందుకు నిర్ణయించింది. ఇకపై సీఎం భద్రత వ్యవహారాలను ఢిల్లీ పోలీసులు పర్యవేక్షించనున్నారు. సీఎం రేఖ గుప్తా సివిల్ లైన్స్‌లోని 'జన్ సున్‌వాయి' కార్యక్రమం నిర్వహిస్తున్న సమయంలో ఈ దాడి జరిగిన విషయం తెలిసిందే. ఈ ఘటనకు సంబంధించి ఇద్దరు వ్యక్తులను పోలీసులు అరెస్టు చేశారు. ఈ కేసులో ప్రధాన నిందితుడు సక్రియా రాజేశ్‌భాయ్ ఖిమ్జీ ఆటోడ్రైవర్ అని, అతడు గుజరాత్‌లోని రాజ్‌కోట్‌కు చెందిన వాడని పోలీసులు తెలిపారు. ఘటనపై దర్యాప్తులో భాగంగా పోలీసులు.. సీఎం నివాసంలో భద్రతా లోపాలను కూడా గుర్తించారు. ఈ లోపాల కారణంగా పెను ప్రమాదం సంభవించే అవకాశం ఉందని పేర్కొన్నారు. ఇలాంటివి పునరావృతం కాకుండా ముందస్తు చర్యలు తీసుకోనున్నారు. ఇందుకు సంబంధించిన నివేదికను హోం మంత్రిత్వ శాఖకు పంపించే అవకాశం ఉందని సంబంధిత వర్గాలు తెలిపాయి.

# బిడ్డ కోసమే కడియం పార్టీ మారారు!

- తన రాజకీయసమాధిని తానే కట్టుకున్నారు
- మాజీ ఎమ్మెల్యే తాడికొండ రాజయ్య విమర్శలు



**జనగామ, ఆగస్ట్25 (జనంసాక్షి) :** ఫిరాయింపుల్లో ముందు వరుసలో ఉన్న ఎమ్మెల్యే కడియం శ్రీహరి ఏ పార్టీలో ఉన్నానో చెప్పలేని పరిస్థితిలో ఉన్నాడని మాజీ ఎమ్మెల్యే తాడికొండ రాజయ్య ఎద్దేవా చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..కాంగ్రెస్ పార్టీలో చేరానని స్వయంగా కడియం శ్రీహరి చెప్పారు. అభివృద్ధి కోసమే పార్టీ మారారని కడియం అంటున్నారు. కడియం శ్రీహరి అప్రూవర్‌గా మారారు. కడియం శ్రీహరికి అభివృద్ధి ఇప్పుడు గుర్తుకు వచ్చిందా? అని ప్రశ్నించారు. 15 ఏళ్లు మంత్రిగా, ఎంపీగా, ఎమ్మెల్సీగా ఉన్నప్పుడు అభివృద్ధి గుర్తుకు రాలేదా అని నిలదీశారు. తన బిడ్డను ఎంపీ చేయడం కోసం కడియం శ్రీహరి పార్టీ మారారు. తన రాజకీయ సమాధిని తానే కట్టుకున్నారన్నారు. ఆయన విదేశాల్లో ఆస్తులు సంపాదించుకున్నారు, హైడల్ ప్రాజెక్టులు అమ్ముకున్నారని ఆరోపించారు. విద్యాశాఖ మంత్రిగా పోస్టులు అమ్ముకున్నారు. కడియం శ్రీహరి అభివృద్ధి కావడం తప్పా స్టేషన్ ఘన్ పూర్‌ను అభివృద్ధి చేయలేదని విమర్శించారు. జస్టిస్ బి.ఆర్.గవాయ్ మూడు నెలల గడువు ఇచ్చి స్పీకర్ నిర్ణయం తీసుకోవాలని డైరెక్షన్ ఇచ్చారు. స్పీకర్ రాజ్యాంగాన్ని పరిరక్షించాలి. అంబేద్కర్ పైన గౌరవం ఉంటే స్పీకర్ వెంటనే నిర్ణయం తీసుకోవాలన్నారు. రేవంత్ రెడ్డి చెప్పినట్లు వింటే స్పీకర్ కోర్టు ధిక్కరణ కిందకు వస్తారు. కడియం శ్రీహరి అంటే అవినీతి తిమింగలం అని మండిపడ్డారు. కాంట్రాక్టర్ల నుంచి పెద్దఎత్తున వసూళ్లకు పాల్పడ్డారు. బినామీ పేర్లతో కడియం శ్రీహరికి ఆస్తులు ఉన్నాయని పేర్కొన్నారు.టిక్కెట్ ఇవ్వకపోతే పార్టీ మారతనని కడియం శ్రీహరి కేసీఆర్ ను బ్లాక్ మెయిల్ చేశారని విమర్శించారు. కడియం శ్రీహరికి ప్రజలు కర్రుకాల్చి వాత పెట్టడం ఖాయమన్నారు.

# సైబర్ నేరగాళ్ల ఉచ్చులో చిక్కి... లక్షలు పోగొట్టుకుని..

- సైబర్ క్రైమ్ పోలీసులకు ఫిర్యాదు



**హైదరాబాద్, ఆగస్ట్25 (జనంసాక్షి) :** సైబర్ నేరాలపై ఎంత అవగాహన కల్పిస్తున్న ఎవరో ఒకరు ఆ ఉచ్చులో చిక్కుకుంటూనే ఉన్నారు. ప్రభుత్వం ఆన్‌లైన్‌లో బ్యాంకింగ్‌కి సంబంధించిన వివరాలను వెల్లడించవద్దని పదే పదే చెబుతున్నా.. ఆ మాట పెడచెవిన పెట్టి సైబర్ నేరగాళ్ల కాటుకు బలి అవుతున్నారు. తాజాగా నగరానికి చెందిన ఓ పురోహితుడికి సైబర్ నేరగాళ్లు కుచ్చుటోపీ పెట్టారు. పాతబస్తీ పురానాపూల్‌కి చెందిన పురోహితుడిని పూజ పేరుతో కేటుగాళ్లు రూ.6 లక్షలు కాజేశారు. సికింద్రాబాద్ మిలిటరీ కార్యాలయం నుంచి కాల్ చేస్తున్నామని.. కల్నల్ సర్ ఆరోగ్యం బాగోలేదని చెప్పారు. 11 రోజుల పూజ కోసం 21 మంది పురోహితులు కావాలని నమ్మబలికారు. అడ్వాన్స్ కింద మూడు లక్షలు చెల్లిస్తామని కూడా చెప్పారు. తొలుత రూ.10 పంపి.. ఆ తర్వాత వీడియో కాల్ చేసి మిగితా డబ్బు పంపిస్తామని కార్డు, పిన్ వివరాలు తెలుసుకున్నారు. దాంతో విడతల వారిగా రూ.5.99 లక్షలు నేరగాళ్లుకాజేశారు. మోసపోయినట్లు గ్రహించిన బాధితుడు 1930కు కాల్ చేసి జరిగింది చెప్పాడు. దీనిపై హైదరాబాద్ సైబర్ క్రైమ్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

Printed, Published and Owned by M.M.RAHMAN Printed at M/s. Manair Enterprises, Plot No. 16E/4, IDA, Kattedan, Ranga Reddy Dist, Telangana - 500077, Published at #119&120, 1st Floor, Down Town Mall, Lakdikapul, Hyderabad, Telangana-500004. Editor : M.M.RAHMAN RNINo. APTEL/2013/50370